సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 180

గురువారం 16-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




గాయత్రి-ట్రెసా జోడీ గెలుపు

ఆల్‌ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి.. - 12లో



బ్యాంకింగ్ సంక్షోభం..

వారం రోజుల్లో మూతపడిన రెండు అమెరికన్ బ్యాంకులు - 13లో



మంచుకొండల్లో మహా ముప్పు

భారత్, చైనా పోటాపోటీ నిర్మాణాలతో హిమాలయాల్లో ప్రకృతి విధ్వంసాలు ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు.

వివరాలు 6లో ▸



లాలూ కుటుంబానికి ఊరట

'భూమికి ఉద్యోగం' కుంభకోణంలో నిందితులుగా ఉన్న లాలూ, ఆయన భార్య రబ్రీదేవి తదితరులకు కోర్టు బెయిల్ ఇచ్చింది.

వివరాలు 6లో ▸

అరుణాచల్ భారత్‌దే..

అరుణాచల్ భారత్‌లో అంతర్భాగమేనని.. మెక్‌మోహన్ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా గుర్తిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది.

వివరాలు 6లో ▸

నా నడక నేల మీదే

సామాన్యులతోనే నా ప్రయాణం.. నా లక్ష్యం పేదరిక నిర్మూలనే

- ఇదే నా ఎకనామిక్స్.. ఇదే నా పాలిటిక్స్.. నా తండ్రిని చూసి నేర్చుకున్న హిస్టరీ ఇదే
- అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టీకరణ
- 45 నెలల్లో 98.5 శాతం హామీలు నెరవేర్చాం
- డీబీటీ ద్వారా పేదలకు రూ.1.97 లక్షల కోట్ల లబ్ధి
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లుగా అగ్రస్థానం
- వృద్ధిరేటులో దేశంలో ఏపీ నంబర్ వన్.. రాష్ట్రంలో మంచి మార్పు.. అదే జగన్ మార్క్
- ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన, నాడు-నేడుతో విద్యా విప్లవం



నాకు పరిశ్రమలు ఎంత ముఖ్యమో వ్యవసాయం అంతే ముఖ్యం. ఐటీ ఎంత ముఖ్యమో చిరు వ్యాపారులు, నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, కులవృత్తుల్లో ఉన్న వారు కూడా అంతే ముఖ్యం. వారు ఎలా బతకగలుగుతున్నారన్నది కూడా అంతే ముఖ్యం. నాకు ప్రభుత్వ ఉద్యోగులు ఎంత ముఖ్యమో నెల నెలా పింఛన్లు తీసుకుంటున్న అవ్వాతాతలు కూడా అంతే ముఖ్యం. మనందరి ప్రభుత్వం ద్వారా సంక్షేమం, అభివృద్ధి పథకాలతో డబ్బులందుకుంటున్న నిరుపేద అక్క చెల్లెమ్మలు, వారి కుటుంబాలు, వారి బాగోగులు కూడా అంతే ముఖ్యమని చెప్పడానికి గర్వపడుతున్నాను. వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, లింగ వివక్షలేని సాధికారతలు అంతకన్నా ముఖ్యం.

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'నా నడక నేల మీదే. నా ప్రయాణం సామాన్యులు, పేదలతోనే. నా యుద్ధం పెత్తందార్లతో. నా లక్ష్యం పేదరిక నిర్మూలన' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సిద్ధాంతాన్ని విస్పష్టంగా ప్రకటించారు. పేద కుటుంబాలు ఆర్థికంగా బలపడితేనే పేద కులాలు బాగుంటాయని అన్నారు. పేద కుటుంబాలు, పేద కులాలను బలపరుస్తూ.. వారికి అన్ని సాధికారతలు కల్పిస్తేనే సమాజం బాగుంటుందని చెప్పారు. 'సమాజంలోని అన్ని ప్రాంతాలను బలపరిస్తేనే రాష్ట్రం బాగుంటుందని నేను నమ్మాను. దానిని ఆచరించి ఫలితాలు చూపించాను. ఇదే నా ఎకనామిక్స్. ఇదే నా పాలిటిక్స్. ఇదే నేను నా తండ్రిని చూసి నేర్చుకున్న హిస్టరీ. ఇవన్నీ కలిపితేనే మీ జగన్' అని తన పాలనా విధానాన్ని ఆవిష్కరించారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం ఆయన ప్రసంగిస్తూ గత నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని గణాంకాలతో సహా

మిగతా 2వ పేజీలో ▶

నవరత్నాలతో పేదల్లో సాధికారత

- వివరాలు 2లో

ఐదోసారీ జనరంజకమే

- రూ.2.79 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్!
- నేడు అసెంబ్లీలో 2023-24 బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి బుగ్గన

5లో

రెట్టించిన వృద్ధి

- నవరత్నాలతో డబుల్ డిజిట్ వృద్ధి రేటు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు నూతనోత్సాహం
- రూ.1,83,891 కోట్ల అదనపు స్థూల ఉత్పత్తి నమోదు.. గతేడాదితో పోలిస్తే జీఎస్‌డీపీలో 16.22% వృద్ధి
- రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.2,19,518.. ఏకంగా 13.98 శాతం వృద్ధి
- అన్ని రంగాల్లో దేశ సగటు కంటే అధిక వృద్ధి రేటు సాధించిన ఏపీ
- వ్యవసాయం 13.18 శాతం, పరిశ్రమలు 16.36 శాతం, సేవా రంగం 20.52% వృద్ధి నమోదు
- సామాజిక ఆర్థిక సర్వే 2022-23 విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్

2లో

అబద్ధాలు అచ్చేసిన రామోజీని సభకు పిలిచి విచారించాలి

- 'సీఎం రాకకోసం గవర్నర్ వేచి ఉండాలా' అని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నట్లుగా 'ఈనాడు' రాసిన తప్పుడు కథనంపై శాసనసభ అట్టుడికింది. గవర్నర్‌కు సీఎం జగన్ స్వాగతం పలుకుతున్న వీడియోను అధికారపక్షం సభలో ప్రదర్శించింది.
- గవర్నర్‌ను కించపరిచేలా అబద్ధాలను అచ్చేసి రామోజీరావు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ సభ్యులు మండిపడ్డారు. ఆయన్ను సభకు పిలిచి విచారించి, తప్పు కేశవ్‌దో.. రామోజీదో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

10లో

చర్చకు పదేపదే అడ్డు

- టీడీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్
- ప్రస్తుత సమావేశాలు కొనసాగినన్ని రోజులు సస్పెండైన కేశవ్, నిమ్మల
- ఎమ్మెల్యే కోటంరెడ్డిపైనా సస్పెన్షన్ వేటు
- మరో పది మంది టీడీపీ ఎమ్మెల్యేలు ఒకరోజు పాటు

13లో



స్పీకర్ పోడియంపై బైఠాయించిన టీడీపీ సభ్యులు

నేడు మళ్లీ ఈడీ ముందుకు కవిత



- ఆడిటర్ బుచ్చిబాబును విచారించిన అధికారులు
- 'లిక్కర్' కేసులో తీవ్ర చర్యలొద్దు
- అత్యవసర విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టులో కవిత పిటిషన్
- నిరాకరించిన సీజేఐ.. 24న జాబితాలో చేర్చాలని ఆదేశం

- వివరాలు 14లో

ఈడీ దృష్టికి మార్గదర్శి అక్రమాలు!

- సమగ్ర నివేదిక సమర్పించిన ఏపీ సీఐడీ విభాగం
- అవి తీవ్రమైన నేరాలు.. దర్యాప్తు జరపండి
- కేంద్ర సంస్థలు, ఇతర రాష్ట్రాలను కోరిన సీఐడీ

- వివరాలు 14లో

నిస్సిగ్గుగా పవన్ కుల రాజకీయాలు



'చంద్రబాబు మేలు కోసమే పవన్ కళ్యాణ్ రాజకీయాలు చేస్తున్నారు. కులాలను రెచ్చగొడుతూ.. కుల రహిత సమాజమంటున్నారు. ముసుగులు తీసేసి.. ఇద్దరూ కలిసే ఎన్నికలకు రండి. వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంది' అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు.

- వివరాలు 3లో

రెట్టించిన వృద్ధి

సామాజిక ఆర్థిక సర్వే 2022-23ను విడుదల చేసిన సీఎం జగన్



సామాజిక ఆర్థిక సర్వే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్ తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాల్లో వేగంగా వృద్ధి చెందుతున్నట్లు సామాజిక ఆర్థిక సర్వే 2022 – 23 వెల్లడిస్తోంది. అన్ని రంగాల్లో వృద్ధి రేటు దగ్గర నుంచి తలసరి ఆదాయం వరకు దేశ సగటు కంటే రాష్ట్రంలో అధికంగా నమోదు కావడం గమనార్హం. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయంలో 13.98 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే 2022 – 23 సంవత్సరానికి ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 16.22 శాతం వృద్ధి నమోదు కాగా ఇదే సమయంలో దేశ జీడీపీ వృద్ధి 15.9 శాతంగా ఉంది. 2021 – 22 (తొలి సవరించిన అంచనాల ప్రకారం) రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.11,33,837 కోట్లు కాగా 2022–23 ముందస్తు అంచనాల ప్రకారం రూ.13,17,728 కోట్లకు చేరనుంది. అంటే ఒక్క సంవత్సరంలోనే నికరంగా రూ.1,83,891 కోట్ల విలువైన ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థకు వచ్చి చేరింది. ఇదే సమయంలో రాష్ట్ర తలసరి ఆదాయం 2021–22తో పోలిస్తే 2022–23లో రూ.26,931 పెరిగి రూ.2,19,518కు చేరుకుంది. దేశవ్యాప్తంగా చూస్తే తలసరి ఆదాయంలో వృద్ధి రూ.23,476గా నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను వేగంగా చేరుకుంటోందని ఆర్థిక సర్వే విశ్లేషించింది. విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, వ్యవసాయం తదితర రంగాలకు వివిధ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.1.97 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసిన విషయం తెలిసిందే. 2022–23 సామాజిక ఆర్థిక సర్వేను సీఎం వైఎస్ జగన్ బుధవారం విడుదల చేశారు. అందులో ముఖ్యాంశాలు ఇవీ..

ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి వివరాలు

రంగం	ఆంధ్రప్రదేశ్		దేశంలో	
	2021-22 (ఎఫ్ఆర్ఈ)	2022-23 (ఏఈ)	2021-22 (ఎఫ్ఆర్ఈ)	2022-23 (ఎస్ఏఈ)
వ్యవసాయం	3,88,453	4,39,645	40,66,649	45,20,818
వృద్ధిరేటు	13.07%	13.18%	10.00%	11.2%
పరిశ్రమలు	2,43,923	2,83,821	61,19,209	69,69,825
వృద్ధిరేటు	23.80%	16.36%	23.3%	13.9%
సేవల రంగం	4,07,810	4,91,496	1,12,53,025	1,32,16,358
వృద్ధిరేటు	18.20%	20.52%	18.1%	17.4%
స్థూల విలువ జోడింపు	10,40,187	12,14,961	2,14,38,883	2,47,07,001
వృద్ధిరేటు	17.46%	16.80%	17.9%	15.2%
జీఎస్‌డీపీ/జీడీపీ	11,33,837	13,17,728	2,34,71,012	2,72,03,767
వృద్ధిరేటు	18.50%	16.22%	18.4%	15.9%
తలసరి ఆదాయం	1,92,587	2,19,518	1,48,524	1,72,000

నోట్: ఎఫ్ఆర్ఈ: ఫస్ట్ రివైజ్డ్ ఎస్టిమేట్స్, ఏఈ: అడ్వాన్స్ ఎస్టిమేట్స్, ఎస్ఏఈ: సెకండ్ అడ్వాన్స్ ఎస్టిమేట్స్

అన్ని రంగాల్లో రెండంకెల వృద్ధి

జీఎస్‌డీపీలో కీలకమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో రాష్ట్రం రెండంకెల వృద్ధిని నమోదు చేసింది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 13.18 శాతం వృద్ధి నమోదు కాగా పరిశ్రమల రంగంలో 16.36 శాతం, సేవా రంగంలో 20.52 శాతం వృద్ధి నమోదైంది. దేశవ్యాప్తంగా చూస్తే వ్యవసాయ రంగంలో 11.2 శాతం, పరిశ్రమల రంగంలో 13.9 శాతం, సేవా రంగంలో 17.4 శాతం వృద్ధి నమోదైంది.

రాష్ట్రంలో ఒక్క వ్యవసాయ రంగంలోనే 20.72 శాతం వృద్ధి నమోదు కాగా ఉద్యానవన పంటల్లో 12.58 శాతం, పశు సంపదలో 7.32 శాతం, ఆక్వాలో 19.41 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం వ్యవసాయం, అనుబంధ రంగాల విలువ రూ.4,39,645 కోట్లకు చేరింది. పరిశ్రమల రంగంలో 16.36 శాతం వృద్ధితో రూ.2,83,821 కోట్లకు చేరింది. పరిశ్రమల రంగంలో కీలకమైన మైనింగ్ రంగంలో 15.81 శాతం, తయారీ రంగంలో 11.81 శాతం, ఎలక్ట్రిసిటీ 30.96 శాతం, నిర్మాణ రంగంలో 16.94 శాతం వృద్ధి నమోదైంది. సేవా రంగంలోకూడా దేశ సగటు కంటే రాష్ట్రం అధిక వృద్ధి రేటును నమోదు చేసింది. 2022–23లో దేశవ్యాప్తంగా సేవా రంగంలో 17.4 శాతం వృద్ధి నమోదైతే, రాష్ట్రంలో 20.52 శాతం వృద్ధి నమోదయ్యింది. ఏపీలో 2021–22లో సేవా రంగ ఉత్పత్తి విలువ రూ.4,07,810 కోట్లుగా ఉంటే 2022–23లో రూ.4,91,496 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. సేవా రంగంలో వాణిజ్యం–హోటళ్ల విభాగంలో 28.42 శాతం, రైల్వేలు 17.82 శాతం, రవాణా రంగం 28.42 శాతం, రియల్ ఎస్టేట్ 13.14 శాతం వృద్ధి నమోదయ్యింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 36.19 శాతం కాగా పరిశ్రమలు 23.36 శాతం, సేవా రంగం వాటా 4.45 శాతంగా ఉంది.

రైతుల సంక్షేమం కోసం..



- అన్నదాతలకు సేవలన్నీ ఒకేచోట అందించే విధంగా 10,778 రైతు భరోసా కేంద్రాలు.
- వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద 52.38 లక్షల మంది రైతులకు రూ.27,063 కోట్ల మేర ఆర్థిక సాయం.
- ఉచిత పంటల బీమా పథకంతో రూ.6,872 కోట్ల ప్రీమియం చెల్లించిన ప్రభుత్వం.
- వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద 73.88 లక్షల మంది రైతులకు రూ.1,834.55 కోట్ల వడ్డీ సబ్సిడీ చెల్లింపు.
- వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ కోసం రూ.27,800 కోట్ల సబ్సిడీ చెల్లింపు, ఆక్వా రైతులకు రూ.2,647 కోట్ల సబ్సిడీ చెల్లింపు.
- పామాయిల్, బొప్పాయి, కోకో, టమాటా, కొబ్బరి, ఎండుమిర్చి ఉత్పత్తిలో మొదటి ర్యాంకులో ఆంధ్రప్రదేశ్.
- వైఎస్సార్ జలకళ కింద 9,629 మంది రైతులు లబ్ధి పొందేలా రూ.188.84 కోట్ల విలువైన 6,931 బోర్ల తవ్వకం.
- వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద 1.20 లక్షల మంది మత్స్యకార కుటుంబాలకు రూ.422 కోట్లు పంపిణీ.

పరిశ్రమలు



- మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో విజయవంతంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణ.
- 386 ఎంఓయూల ద్వారా రూ.13.11 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు. 6 లక్షల మందికిపైగా ఉపాధి.
- రూ.19,115 కోట్ల పెట్టుబడితో 1.52 లక్షల ఎంఎస్ఎంఈల ఏర్పాటు. 13.63 లక్షల మందికి ఉపాధి.
- రూ.1.35 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన 69 భారీ ప్రాజెక్టుల నిర్మాణ పనులు.
- వరుసగా మూడేళ్లుగా సులభతర వాణిజ్యం ర్యాంకుల్లో మొదటి స్థానం దక్కించుకుంటున్న ఏపీ.
- మచిలీపట్నం, భావనపాడు, రామాయపట్నం, కాకినాడ సెజ్‌లో పోర్టులతోపాటు తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం.

విద్య

- మనబడి నాడు – నేడు ద్వారా మూడు దశల్లో పాఠశాలల్లో మౌలిక వసతులు పటిష్టం.
- తొలిదశ కింద రూ.3,669 కోట్లతో 15,717 పాఠశాలల అభివృద్ధి. మూడేళ్లలో 57,189 పాఠశాలలు, 3,280 ఇతర విద్యా సంస్థల్లో రూ.16,022 కోట్లతో మౌలిక వసతుల కల్పన.
- చదువులను ప్రోత్సహిస్తూ జగనన్న అమ్మ ఒడి ద్వారా రూ.19,617.60 కోట్లు వ్యయం.
- జగనన్న విద్యా కానుక కింద ఒకటి నుంచి 10వ తరగతి చదివే 47.4 లక్షల మంది విద్యార్థులకు రూ.2,368 కోట్లు...........
- జగనన్న గోరుముద్ద కోసం రూ.3,239 కోట్లు వ్యయం.
- జగనన్న విద్యా దీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌తో 24.75 లక్షల మంది విద్యార్థులకు రూ.9,249 కోట్ల మేర ప్రయోజనం.
- జగనన్న వసతి దీవెనతో హాస్టళ్లలో ఉంటున్న 18.77 లక్షల మంది విద్యార్థులకు రూ.3,366 కోట్లు లబ్ధి.

వైద్యం - మహిళా సంక్షేమం

- ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించి ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలు.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 3,255 ప్రొసీజర్లకు ఉచితంగా వైద్యం. ఇప్పటివరకు 1.41 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం.
- నాడు – నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు బలోపేతం.
- 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, 528 అర్బన్ హెల్త్ కేర్ క్లినిక్స్ ఏర్పాటు
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా 35.7 లక్షల మంది గర్భవతులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారించి పౌష్టికాహారం అందించేందుకు రూ.6,141 కోట్లు వ్యయం.
- ప్రస్తుతం ఉన్న 11 మెడికల్ కాలేజీలకు అదనంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు.

మహిళా సాధికారత



- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 26.7 లక్షల మంది మహిళలకు రూ.14,129 కోట్లు పంపిణీ.
- వైఎస్సార్ ఆసరాతో స్వయం సహాయక సంఘాలకు చెందిన 78.74 లక్షల మంది మహిళలకు రూ.12,758 కోట్లు.
- వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలకు రూ.3,615 కోట్ల వడ్డీ చెల్లింపు. 1.02 కోట్ల మంది మహిళలకు ప్రయోజనం.

సుస్థిరాభివృద్ధి..



- నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం.
- ఎస్‌డీజీ ఇండియా 2020–21 నివేదికలో నాలుగో స్థానం సాధించిన ఏపీ.
- ఎస్‌డీజీ–7 లక్ష్యంలో మొదటి ర్యాంకు, ఎస్‌డీజీ 14 లక్ష్యంలో రెండో ర్యాంకు.
- రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారదర్శక పాలన విధానాలను అనుసరిస్తున్న ఇతర రాష్ట్రాలు.
- ఆర్బీకేలు, సచివాలయాలు, భూముల సమగ్ర సర్వే తదితర కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు.

గృహ నిర్మాణం



- పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా మహిళలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన 30.65 లక్షల ఇళ్ల పట్టాలు జారీ.
- ఇప్పటివరకు 21.25 లక్షల ఇళ్లు మంజూరు చేయగా 4.4 లక్షల గృహ నిర్మాణాలు పూర్తి. వివిధ దశల్లో కొనసాగుతున్న మిగతా ఇళ్లు.
- వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.32,909 కోట్ల వ్యయం.
- వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద ప్రతీ నెలా 64.45 లక్షల మంది లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ.66,823.79 కోట్ల పంపిణీ.

ఇతర సంక్షేమ పథకాలు



- జగ్జీవన్ జ్యోతి పథకం కింద 15.14 లక్షల మంది ఎస్సీలు, 4.5 లక్షల మంది ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్.
- సొంత ఆటోలు, ట్యాక్సీలున్న 2.74 లక్షల మందికి వైఎస్సార్ వాహనమిత్ర కింద నాలుగేళ్లుగా రూ.1,041 కోట్లు పంపిణీ.
- వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా 81,783 చేనేత కుటుంబాలకు రూ.788.50 కోట్లు.
- వైఎస్సార్ కాపునేస్తం కింద 3.56 లక్షల మంది మహిళలకు రూ.1,518 కోట్లు.
- వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 3.94 లక్షల మందికి రూ.595.86 కోట్ల మేర లబ్ధి.
- జగనన్న చేదోడు కింద 3.30 లక్షల మందికి రూ.927.49 కోట్లు.
- వైఎస్సార్ లా నేస్తం ద్వారా 4,248 మంది యువ న్యాయవాదులకు రూ.35.40 కోట్లు.

నా నడక నేల మీదే

▶ మొదటి పేజీ తరువాయి

వివరించారు. తమ ప్రభుత్వ విధానాల మౌలిక స్వరూపాన్ని, లక్ష్యాలను అసెంబ్లీలో విశదీకరిస్తూ తన రాజకీయ విధానాన్ని పునరుద్ఘాటించారు. ఆయన ఏమన్నారంటే..

98.5 శాతం హామీలు నెరవేర్చాం

- మన ప్రభుత్వం వచ్చి దాదాపు 45 నెలలు కావస్తోంది. నాలుగేళ్లు గడవకముందే 98.5 శాతం మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చాం. కులం, మతం, ప్రాంతం, వర్గంతో పాటు ఎవరికి ఓటు వేశారన్నది కూడా చూడకుండా మంచి చేస్తామని చెప్పాం. దాన్ని ఆచరణలో చూపించాం. జన్మభూమి కమిటీలను పూర్తిగా రద్దు చేశాం. రాజకీయ వ్యవస్థలో గొప్ప మార్పు తీసుకు రాగలిగాం.
- పిల్లలు, పెద్దలు, వృద్ధులు.. ఈ మూడు తరాలకు మేలు చేసేలా రూ.1,97,473 కోట్లు నేరుగా నగదు బదిలీ పథకం (డీబీటీ) ద్వారా అంటే నేరుగా బటన్ నొక్కి లబ్ధిదారులకు అందించాం.
- మన పరిపాలనలో ఇంటింటికి.. మనిషి మనిషికి ఏ విధంగా మేలు జరిగిందన్నది గడప గడపకు వెళ్లి వివరాలతో చెబుతున్నాం. మంచి జరిగిందని భావిస్తే మనందరి ప్రభుత్వానికి, మీ బిడ్డ ప్రభుత్వానికి మద్దతు పలకండని మన ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి చెప్పగలిగేలా 45 నెలల పరిపాలన సాగిందని సగర్వంగా చెబుతున్నాం.
- 13 జిల్లాలు ఇప్పుడు 26 జిల్లాలు అయ్యాయి. ప్రతి జిల్లాలో ప్రజలకు పరిపాలన, సేవలు రెట్టింపయ్యాయి. రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశాం. వీటిలో 1,34,000 మంది మన పిల్లలు శాశ్వత ఉద్యోగులుగా కనిపిస్తున్నారు. 600 పౌర సేవలు లంచాలు, వివక్షకు తావులేకుండా గ్రామ స్థాయిలోనే అందిస్తున్నాం. 50 ఇళ్లకు ఓ వలంటీర్ చొప్పున 2,65,000 మంది ప్రతి ఇంటికి మంచి చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో పౌర సేవల్లో ఇదో గొప్ప విప్లవం.
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేశాం. ఇందులో విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి ఒక్క రైతులకు తోడుగా నిలిచాం. ఆర్బీకేలలో 10,778 మంది అగ్రికల్చర్, హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లు సేవలు అందిస్తున్నారు. వైద్య ఆరోగ్య రంగం మీద ప్రధానంగా దృష్టి సారించాం. గత ప్రభుత్వంలో ఇలాంటి సేవలు లేవు.

భూ వివాదాలకు శాశ్వత ముగింపు

- గతంలో మండలానికి ఓ సర్వేయర్ ఉంటే గొప్ప. లంచాలు ఇస్తే తప్ప మనకు టైమ్ ఇచ్చేవారు కాదు. అలాంటిది ఈ రోజు గ్రామ, వార్డు సచివాలయాల్లో 10,185



మంది సర్వేయర్లను నియమించాం. వారి ద్వారా వందేళ్ల తర్వాత సమగ్ర భూసర్వే చేపట్టి.. కబ్జాలు, భూవివాదాలకు శాశ్వతంగా స్వస్తి పలికేలా అడుగులు వేస్తున్నాం.

- ఏడాదికి 17 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వ్యవసాయానికి పగటి పూటే అందుబాటులో ఉండేలా చేస్తూ ఉచిత విద్యుత్ పథకానికి ఢోకా లేకుండా చేస్తున్నాం. మరో 7 వేల మెగావాట్లను యూనిట్ కేవలం రూ.2.49కే 25 ఏళ్ల పాటు అందుబాటులో ఉండేలా చేస్తున్నాం.

ఊరూరా స్పష్టమైన మార్పు

- 45 నెలల పాలనలో ఏ గ్రామాన్ని తీసుకున్నా జగన్ మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది. 600 సేవలు అందిస్తున్న సచివాలయాలు, వలంటీర్లు, ఆర్బీకేలు, ఈ–క్రాప్, పంట కొనుగోలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, అన్‌లిమిటెడ్ బ్యాండ్ విడ్త్ ద్వారా వర్క్ ఫ్రం హోమ్ కోసం డిజిటల్ లైబ్రరీల నిర్మాణం, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, వాటిలో నిర్మిస్తున్న ఇళ్లు.. కాలనీలు కనిపిస్తాయి.
- నాణ్యమైన బియ్యాన్ని లబ్ధిదారుల గడప వద్దకే అందిస్తున్నాం. ఇందుకోసం 9,260 డెలివరీ వ్యాన్లను అందుబాటులోకి తీసుకొచ్చాం.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వన్

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడేళ్లుగా దేశంలోనే నంబర్‌వన్ స్థానం ఏపీకే దక్కిందని చెప్పడానికి గర్వపడుతున్నా. అందువల్లే రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. మొన్న దావోస్‌లో, నిన్న విశాఖలో ప్రత్యక్షంగా చూశాం.
- 28 రాష్ట్రాల మన దేశంలో 2021–22కుగాను అత్యధికంగా 11.23 శాతం ఆర్థిక వృద్ధి రేటుతో రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలిచి జీఎస్‌డీపీ గ్రోత్‌రేట్ నమోదు చేసింది. 14.02 శాతం తలసరి ఆదాయం పెరిగిన రాష్ట్రంగా కూడా నిలిచింది.

విద్యా విప్లవంతో పెద్ద పెద్ద చదువులు

- గత ప్రభుత్వంలో ప్రభుత్వ బడులు శిథిలమైన స్థితిలో ఉండేవి. నాడు–నేడు ద్వారా వాటి రూపురేఖలు పూర్తిగా మార్చేస్తున్నాం. ప్రభుత్వ బడిని సీబీఎస్ఈ ఇంగ్లిష్ మీడియంతో తీర్చిదిద్దగలుగుతున్నాం. 8వ తరగతి పిల్లలకు ట్యాబులు ఇస్తున్నాం. గోరుముద్ద మెనూ నుంచి పిల్లల డ్రెస్ వరకు అన్నింటా కూడా ఒక మేనమామలా శ్రద్ధ చూపుతున్నా. ఫలితంగా మన పిల్లలు పెద్ద చదువుల వైపు దూసుకెళ్తున్నారు.
- జగనన్న విద్యా దీవెన పథకంతో వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనతో పిల్లలు అందరికీ తోడుగా ఉంటున్నాం. కొన్నాళ్ల తర్వాత ఆరో తరగతి నుంచి ప్రతి క్లాస్‌రూమ్ డిజిటల్ క్లాస్‌రూమ్ అవుతుంది. ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌తో పిల్లలకు చదువులు చెబుతారు. దాంతో ప్రభుత్వ బడులతో పోటీ పడేందుకు కార్పొరేట్ బడుల వాళ్లు కూడా ఇదే మాదిరి అనుసరించాల్సిన పరిస్థితి వస్తుంది.
- ఇప్పటికే 15,200కుపైగా ఉన్న ప్రభుత్వ బడులు ఆరో తరగతి నుంచి ఉన్న 5,800 బడుల్లో 30,230 క్లాస్‌రూమ్‌లో ఈ జూన్‌లో బడులు తెరిచే నాటికే ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌తో డిజిటల్ క్లాస్ రూములు అందుబాటులోకి వస్తున్నాయి. మన బడి నాడు–నేడుతో దాదాపు 45 వేల స్కూళ్లు, కాలేజీల రూపురేఖలు మారుతున్నాయి.

నవరత్నాలతో పేదల్లో సాధికారత

అసెంబ్లీలో సీఎం వైఎస్ జగన్

- అమ్మ ఒడితో చదువులకు ఊతం
- రైతు భరోసాతో అన్నదాతలకు అండ
- ఉద్యోగాలు, ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ
- అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట
- ఇళ్ల నిర్మాణంతో పెరిగిన వృద్ధి రేటు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సామాజిక, రాజకీయ న్యాయం దిశగా అడుగులు

సాక్షి, అమరావతి: నవరత్నాల ద్వారా పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలు పేదరికాన్ని అధిగమించేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం ఆయన ప్రసంగించారు. అమ్మ ఒడి చదివించే తల్లులకు రూ.15 వేలు సహాయం చేస్తుండటం ఒక్క మనరాష్ట్రంలో మాత్రమే కనిపిస్తోందన్నారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 44.48 లక్షల మంది తల్లులకు రూ.19,674 కోట్లు సాయం చేశామని చెప్పారు. 75 శాతం అటెండెన్స్ ఉండాలని చెప్పి ఓ మంచి మేనమామగా తాపత్రయ పడి పిల్లల చదువుల కోసం ఆరాటపడుతూ తెచ్చిన గొప్ప పథకం ఇదని తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా 52.38 లక్షల మంది రైతులకు నాలుగేళ్లలో రూ.27,062 కోట్లు సాయం అందించామన్నారు. కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్ రైతులకు సైతం ఈ సాయం అందిస్తున్న ప్రభుత్వం మనదేనని తెలిపారు. బీమా ప్రీమియంగా రైతులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం కూడా లేకుండా బీమా భారాన్ని మోస్తున్నామన్నారు. ఇలా ఇప్పటి వరకు 44.05 లక్షల మంది రైతులకు రూ.6,872 కోట్లు పరిహారంగా అందించామని తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ, పగటిపూటే తొమ్మిది గంటల ఉచిత విద్యుత్, ఎంఎస్‌పీకి ఏమాత్రం తగ్గకుండా ఆహార ధాన్యాల కొనుగోలు, ధాన్యం సేకరణ, ఆర్బీకేల ద్వారా ఈ–క్రాపింగ్.. ఇలా ప్రతి విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని చెప్పారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

- 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఆర్థికంగా అండ దండలు అందిస్తున్న వైయస్సార్ చేయూత వంటి పథకం రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశంలో కూడా ఎప్పుడూ, ఎక్కడా లేదు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 26.40 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.14,129 కోట్లు అందించాం.
- ఐటీసీ, పీ అండ్ జీ, రిలయెన్స్, అమూల్ వంటి పెద్ద పెద్ద సంస్థలను తీసుకుని వచ్చి ఆ అక్కచెల్లెమ్మల జీవనోపాధికి మార్గాలు చూపుతూ.. బ్యాంకులను మమేకం చేస్తూ వాళ్లకు దారి చూపించిన గొప్ప వ్యవస్థను తీసుకొచ్చాం.

సున్నా వడ్డీతో అక్కచెల్లెమ్మలకు భరోసా

- పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు అండగా నిలబడేందుకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.25 వేల కోట్లను నాలుగు విడతల్లో వారికి చెల్లిస్తామని మాట ఇచ్చాం. ఆ మేరకు ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,758 కోట్లు 78.74 లక్షల మంది అక్కచెల్లెమ్మల చేతిలో పెట్టాం. మూడో విడత చెల్లింపునకు సిద్ధంగా ఉన్నాం.
- గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఎన్‌పీఏల కింద 18 శాతం అక్కచెల్లెమ్మల ఏ, బి గ్రేడ్ సంఘాలన్నీ సీ, డీ గ్రేడ్‌లోకి

> గత ప్రభుత్వంలో గాలి మాటలు విన్నాం. ఏం మాట్లాడారో, ఏం చేశారో చూశాం. అందుకు తగ్గట్లు గ్రాఫిక్స్ అలాగే ఉండేవి. అదిగో మైక్రోసాఫ్ట్.. అదిగో బిల్‌గేట్స్ అనేవారు. అదిగో బుల్లెట్ ట్రెయిన్ అని గొప్పలు చెప్పేవారు. మన ప్రభుత్వం అలా కానేకాదు. ఏం చెప్పామో అది చేసి చూపిస్తున్నాం. ప్రతి ఇంటికి మంచి చేశాం. సామాజిక న్యాయం, మహిళా న్యాయం, రైతన్నలకు న్యాయం.. వీటన్నింటిని దైవ కార్యంగా భావించి నిబద్ధతతో అడుగులు ముందుకు వేస్తున్నాం. ఇలాంటి ప్రభుత్వానికి దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలు ఎప్పటికీ ఉండాలి.
>
> \- సీఎం వైఎస్ జగన్

దిగజారిపోయాయి. ఇవాళ అవుట్ స్టాండింగ్ లోన్స్ కేవలం 0.5 శాతమే ఉన్నాయి. అంటే 99.5 శాతం ఇవాళ అక్కచెల్లెమ్మలు సంతోషంగా లోన్లు కడుతున్నారు.

- వైఎస్సార్ కాపునేస్తం ద్వారా 3.56 లక్షల మందికి రూ.1,518 కోట్లు సాయం చేశాం. వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 3.94 లక్షల మందికి రూ.595 కోట్లు ఇచ్చాం.

ఉద్యోగాలు, ఉపాధి కల్పనతో పెరిగిన వృద్ధి రేటు

- ఐదున్నర కోట్ల జనాభాలో 4 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. మన ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్యను ఆరు లక్షలకు పెంచాం. అంటే 50 శాతం ఉద్యోగాలను పెంచాం. పెద్ద, పెద్ద పరిశ్రమలు మిగిలినవి అన్నీ చూసుకుంటే మరో 20 లక్షల ఉద్యోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కువ ఉద్యోగాలు ఎంఎస్ఎంఈ సెక్టారులోనే ఉన్నాయి. ఒక్కో ఎంఎస్ఎంఈ యూనిట్ కనీసం 10 మందికి ఉపాధి కల్పిస్తుంది.
- ఇంతకు ముందున్న 1.10 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లకు అదనంగా మరో 1.56 లక్షల యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటిని ప్రోత్సహిస్తూ పెండింగ్‌లో ఉన్న ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్‌లను క్లియర్ చేస్తూ వాటికి ప్రభుత్వం తోడుగా ఉందని భరోసా ఇస్తున్నాం.
- వృద్ధి రేటుకు బూస్టనిచ్చే మరొక రంగం స్వయం ఉపాధి. వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా 1.20 లక్షల మంది మత్స్యకారులకు రూ.422 కోట్లు సాయం చేశాం. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా 82 వేల కుటుంబాలకు రూ.778 కోట్లు అందించాం. వాహనమిత్ర, జగనన్న తోడు, జగనన్న చేదోడు, లా నేస్తం వంటి పథకాలతో తోడుగా నిలబడ్డాం.
- జగనన్న చేదోడు ద్వారా ఫుట్‌పాత్‌ల మీద కూరగాయలు అమ్ముకునేవారు, తోపుడు బండ్లమీద వ్యాపారులు.. ఇలాంటి 15 లక్షల మందికి తోడుగా నిలబడ్డాం. వీటితో పాటు 30.75 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. సిమెంటు, స్టీలు అమ్మకాలతో మార్కెట్ పెరిగి కార్మికులకు ఉపాధి పెరిగింది. తద్వారా వృద్ధిరేటులో ఏపీ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచింది.


అక్కచెల్లెమ్మల భద్రతకు కీలక నిర్ణయాలు

- మనందరి ప్రభుత్వంలో గ్రామ, వార్డు స్థాయిలో 15 వేల మంది మహిళా పోలీసులను నియమించాం. మహిళల భద్రత కోసం దిశ యాప్ తీసుకొచ్చాం. ఇప్పటికే 1.36 కోట్ల అక్క చెల్లెమ్మలు డౌన్‌లోడ్ చేసుకున్నారు.
- దిశ బిల్లు కూడా తీసుకొచ్చాం. అది ఉమ్మడి జాబితా (కాంకరెన్స్ లిస్ట్)లో అంశం కాబట్టి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపాం. దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం.
- నా మంత్రి మండలిలో, మన ప్రభుత్వం ఇచ్చే నామినేటెడ్ పదవులు, ఆలయ బోర్డులు, ఏఎంసీలు, స్థానిక సంస్థల్లో.. ఎందులో చూసినా సామాజిక న్యాయంతో పాటు రాజకీయ న్యాయం కూడా అంతే ప్రస్ఫుటంగా కనిపిస్తుందని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఆ పదవుల్లో కనీసం సగం వాటా అక్క చెల్లెమ్మలకు ఇచ్చేలా, సగం వాటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చేలా అడుగులు ముందుకు వేశాం.

నాడు (2019కి ముందు) -నేడు (2019 తర్వాత) .. ఇదీ తేడా

అంశం	నాడు	నేడు
ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లు	1,059	3,255
ఆరోగ్య ఆసరా	-	రూ.903 కోట్లు
జిల్లాలు	13	26
రెవెన్యూ డివిజన్లు	51	76
సర్వేయర్లు	మండలానికి ఒకరు	10,185
మెడికల్ కాలేజీలు	11	కొత్తగా మరో 17 నిర్మాణం
పోర్టులు	6	కొత్తగా మరో 4 నిర్మాణం
ఫిషింగ్ హార్బర్లు	4	కొత్తగా 9 నిర్మాణం
అవ్వాతాతల పింఛన్	రూ.వెయ్యి	రూ.2,750
పింఛన్ లబ్ధిదారులు	39 లక్షలు	64 లక్షలు
రేషన్‌కార్డులు	1.39 కోట్లు	1.46 కోట్లు
డ్వాక్రా ఎన్‌పీఏలు	18 శాతం	0.5 శాతం
ప్రభుత్వ ఉద్యోగులు	4 లక్షలు	6 లక్షలు
ఎంఎస్ఎంఈ యూనిట్లు	1.10 లక్షలు	అదనంగా 1.56 లక్షలు
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	-	10,550

కోవిడ్‌ను దీటుగా ఎదుర్కొన్నాం



- కోవిడ్ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొన్న అగ్రగామి రాష్ట్రాల్లో మన రాష్ట్రం కూడా ఒకటి. వైద్య రంగంలో కనీవినీ ఎరగనిరీతిలో ప్రివెంటివ్ కేర్‌లో ఒక కొత్త అధ్యాయానికి తెరతీస్తూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చాం.
- గ్రామాలు, పట్టణాల్లో 10,550 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశాం. వాటితోపాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, డిస్ట్రిక్ట్ ఆస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రుల రూపురేఖలను నాడు–నేడు కార్యక్రమంతో పూర్తిగా మారుస్తున్నాం.

క్లుప్తంగా...

పెళ్లొద్దని పోలీసులను ఆశ్రయించిన బాలిక


తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

కోవెలకుంట్ల(నంద్యాల): 14 ఏళ్ల వయస్సులోనే వివాహం చేస్తున్నారని, ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన తనకు లేదని ఓ బాలిక పోలీసులను ఆశ్రయించింది. స్థానికుల సమాచారం మేరకు.. పట్టణంలోని గడ్డవీధికి చెందిన బాలిక సంజామల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 9వ తరగతి చదువుతోంది. బాలికకు వివాహం చేయాలని తల్లిదండ్రులు రెండు నెలల కిందట బద్వేలు నియోజకవర్గంలోని చాబోలు గ్రామానికి చెందిన ఓ యువకుడితో నిశ్చితార్థం చేశారు. గురు, శుక్రవారం వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి ఇష్టం లేని బాలిక మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విషయాన్ని పోలీసులకు చేరవేసింది. బాలిక తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు బాల్య వివాహం చట్టరీత్యా నేరమని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు సమాచారం చేరవేసి బాలికను కర్నూలు హోంకు తరలించారు.

వసతి, విద్యా దీవెనలు రద్దు చేస్తాం: లోకేశ్



బి.కొత్తకోట: టీడీపీ అధికారంలోకి రాగానే జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన పథకాలను రద్దు చేస్తామని టీడీపీ నేత నారా లోకేశ్ చెప్పారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని గుట్టపాళ్యం నుంచి బి.కొత్తకోట ఇందిరమ్మకాలనీ వరకు బుధవారం సాగింది. బుచ్చిరెడ్డిగారిపల్లె వద్ద ముస్లింలు, టమాట రైతులతో లోకేశ్ మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్రమశిక్షణ, పట్టుదల కలిగిన వ్యక్తి అని కొనియాడారు. పాత విద్యా విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. సయ్యద్, పఠాన్‌లను బీసీ జాబితాలో చేర్చాలని ముస్లింలు కోరగా ఈ అంశంపై చర్చించాక నిర్ణయం తీసుకుంటామన్నారు. మదనపల్లె టమాట మార్కెట్‌ను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. టమాట ఆధారిత పరిశ్రమలను ప్రారంభిస్తామని, కోల్డ్ స్టోరేజీలు, పల్ప్ పరిశ్రమలు స్థాపిస్తామని చెప్పారు. తన పాదయాత్ర దెబ్బకు సీఎం జగన్ పల్లె నిద్ర కార్యక్రమం చేయనున్నారని, మళ్లీ అవ్వా, తాతా అంటూ పలుకరిస్తూ..బంగారం ఇస్తానంటూ నమ్మించే ప్రయత్నం చేస్తారని అలాంటివి నమ్మవద్దని కోరారు.



1998 డీఎస్సీ అభ్యర్థుల నియామకానికి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రెండున్నర దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ.. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీచేసేందుకు వీలుగా పాఠశాల విద్యాశాఖ బుధవారం జీవో 27ను విడుదల చేసింది. మొత్తం 4,534 మందికి సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగాలు లభించనున్నాయి. వీరిని మినిమమ్ టైమ్ స్కేలుపై నియమించేందుకు వీలుగా విధివిధానాలను విద్యాశాఖ ఈ జీవోలో పొందుపరిచింది. అప్పట్లో ఇంటర్వ్యూల్లో అర్హత సాధించినా.. ఎస్జీటీ పోస్టులు పొందలేకపోయిన వారు గతంలో ప్రభుత్వాల చుట్టూ తిరిగారు. న్యాయపోరాటమూ చేశారు. ఎట్టకేలకు సీఎం వైఎస్ జగన్ వారికి మేలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల నుంచి పాఠశాల విద్యాశాఖ ఆసక్తి వ్యక్తీకరణలను స్వీకరించింది. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఏ నిబంధనలు వర్తిస్తాయో వీరిని కూడా అవే నిబంధనలతో నియమించాలని నిర్దేశించారు. 4,534 మందికి ఉద్యోగాలు కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలత పేర్కొన్నారు. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఈ నెలాఖరులోపు నియామక పత్రాలు వస్తాయని ఆశిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకట్రామిరెడ్డి అన్నారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

8 చోట్ల కౌంటింగ్ కేంద్రాలు

- ఉదయం 8 గంటలకు లెక్కింపు
- తొలుత కర్నూలు స్థానిక సంస్థల ఫలితం

సాక్షి, అమరావతి/ సాక్షి, తిరుపతి: మార్చి13న ఎన్నికలు జరిగిన 9 ఎమ్మెల్సీ స్థానాల ఓట్ల లెక్కింపు గురువారం జరగనుంది. మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయ, నాలుగు స్థానిక సంస్థల నియోజకవర్గాలకు పోటీ పడుతున్న 139 మంది అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. ఓట్ల లెక్కింపునకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. కౌంటింగ్ ప్రారంభానికి అరగంట ముందు స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలింగ్ బాక్సులను ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు. 8 చోట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఫలితాలను సాధ్యమైనంత త్వరగా ప్రకటించే విధంగా పోటీ చేసిన అభ్యర్థులు, ఓటర్ల సంఖ్యనుబట్టి టేబుల్స్ ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ పట్టభద్రుల స్థానానికి 28 టేబుల్స్, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల స్థానానికి 40 టేబుల్స్, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు కౌంటింగ్‌కు 25 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు టీచర్ల నియోజకవర్గానికి 14, కడప-అనంతపురం-కర్నూలు టీచర్ల నియోజకవర్గానికి 15 టేబుల్స్ ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు స్థానాలకు 5, శ్రీకాకుళానికి 4, కర్నూలుకు 2 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఇది సుదీర్ఘ ప్రక్రియని, ఫలితాల ప్రకటనకు రెండు మూడు రోజులు కూడా పట్టే అవకాశం ఉందని మీనా తెలిపారు. సాయంత్రానికి స్థానిక సంస్థల ఫలితాలను, రాత్రికి టీచర్ల నియోజకవర్గ ఫలితాలు వెలువడవచ్చని అంచనా. పట్టభద్రుల నియోజకవర్గాల ఫలితాలకు ప్రకటనకు 2 రోజులు కూడా పట్టే అవకాశం ఉందంటున్నారు. తొలి ఫలితం కర్నూలు స్థానిక సంస్థలది, చివరగా ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు గ్రాడ్యుయేట్స్ ఫలితం వెలువడే అవకాశం ఉంది.

ఓట్ల లెక్కింపు నిలిపివేయలేం : హైకోర్టు

ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఓట్ల లెక్కింపును నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. ఫలితాలు మాత్రం కోర్టు తీర్పునకు లోబడి ఉంటాయంది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఎన్నికల కౌంటింగ్ నిలిపివేయాలని కోరుతూ కోడి శ్రీనివాస్ బుధవారం వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

దొంగ ఓట్లు వేసేందుకు టీడీపీ యత్నం



దొంగ ఓట్లు వేసేందుకు యత్నించిన టీడీపీ కార్యకర్తను పోలీసులకు అప్పజెబుతున్న డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి నగరంలో బుధవారం రీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రీ పోలింగ్‌లోనూ టీడీపీ కార్యకర్తలు దొంగ ఓట్లు వేసేందుకు, అల్లరి చేసేందుకు యత్నించారు. ఆదిలోనే పోలీసులు అడ్డుకోవడంతో వారికి అవకాశం లేకుండాపోయింది. టీడీపీకి చెందిన కొందరు దొంగ ఓటర్లను వైఎస్సార్‌సీపీ నేతలు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. 229 పోలింగ్ కేంద్రంలో 579 ఓట్లకు 287 మాత్రమే పోలయ్యాయి. 233 పోలింగ్ కేంద్రంలో 792 ఓట్లకు 349 ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్ కేంద్రాల్లో చిరు ఉద్యోగులే అధికంగా ఉండడంతో రెండోసారి సెలవు పెట్టుకుని ఓట్లు వేసేందుకు రాలేకపోయినట్లు భావిస్తున్నారు.

తెలంగాణ

నానక్‌రామ్‌గూడకు అమెరికా కాన్సులేట్ కార్యాలయం

పైగా ప్యాలెస్‌లో అమెరికా జాతీయ పతాకం అవనతం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో బుధవారం అమెరికా జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. బేగంపేట సమీపంలోని పైగా ప్యాలెస్‌లో 14 ఏళ్లుగా పనిచేస్తున్న అమెరికా కాన్సులేట్ ఈనెల 20న నానక్‌రామ్‌గూడలో సువిశాల కార్యాలయంలోకి మారనుంది. అధునాతన సౌకర్యాలతో అమెరికన్ కాన్సులేట్ జనరల్ శాశ్వత భవనంలోకి మారనుంది. తాత్కాలిక భవనమైన పైగా ప్యాలెస్ నుంచి పని చేసే చివరి రోజు కావడంతో బుధవారం జాతీయ పతాకాన్ని అవనతం చేశామని, కొత్త భవనంలోకి వెళ్లిన వెంటనే మళ్లీ అక్కడ ఎగరేస్తామని కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ ఒక ట్వీట్‌లో తెలిపారు. 2007లో దివంగత మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అమెరికన్ కాన్సులేట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తాత్కాలిక ఏర్పాటుగా పైగా ప్యాలెస్‌లో కార్యకలాపాలు మొదలైనా.. శాశ్వత భవన నిర్మాణం కోసం వైఎస్ హయాంలోనే నానక్‌రామ్‌గూడలో 13 ఎకరాల స్థలం కేటాయించారు. కొత్తగా ఏర్పాటు కానున్న కార్యాలయంలో ఈనెల 23 నుంచి సాధారణ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

మన్యం మిర్చి.. మరింత ఘాటుగా..

- మిర్చి పొడి తయారీలో సొంత బ్రాండ్‌కు జీసీసీ సన్నాహాలు
- సొంత ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రణాళికలు
- ఎస్.కోటలో ఏర్పాటుకు బోర్డు సమావేశంలో నిర్ణయం



మిర్చిని ప్రాసెసింగ్ చేస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: జీసీసీ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. ఇదే సందర్భంలో జీసీసీ మిర్చి పొడికి కూడా గిరాకీ పెరుగుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం మిర్చి పొడిని వసతి గృహాలకు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీంతో నాణ్యతను మరింత పెంచుకుని.. కశ్మీరీ చిల్లీ పౌడర్ మాదిరిగా బ్రాండ్ ఇమేజ్‌ను పెంపొందించుకునేందుకు సొంతంగా ప్రాసెసింగ్ చేపట్టే దిశగా జీసీసీ అడుగులు వేస్తోంది. పోలవరం పరిసర ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో రైతులు మిరపకాయలు పండిస్తున్నారు. 340 గ్రేడ్ నాణ్యమైన మిరప కాయల్ని గిరి రైతుల నుంచి జీసీసీ సేకరిస్తోంది. ఏటా 100 టన్నుల వరకూ సేకరించి.. తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ సంస్థకు ప్రాసెసింగ్‌కు అప్పగిస్తోంది. దీనిని మరింత క్వాలిటీతో ప్రజలకు అందించాలని జీసీసీ భావిస్తోంది. ఇందుకోసం సొంత ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది.

ఎస్.కోటలో రూ.30 లక్షలతో..

మిర్చి ఘాటు, రంగు విషయంలో కశ్మీరీ చిల్లీ పౌడర్ దేశీయంగా మంచి గుర్తింపు పొందింది. జీసీసీ చిల్లీ పౌడర్‌కు కూడా అదే బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలన్న లక్ష్యంతో విశాఖ శివారులోని పార్వతీపురం మన్యం జిల్లా శృంగవరపుకోటలో మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ జీసీసీకి చెందిన స్థలాలను గుర్తించిన అధికారులు రూ.30 లక్షల వ్యయంతో సివిల్ వర్క్స్, యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల గిరిజనులకు ఉపాధి కూడా లభించనుంది. మంగళవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు.

హాస్టళ్లకు సరఫరా



ప్రభుత్వ వసతి గృహాలకు జీసీసీ మిర్చి పొడి సరఫరా చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనున్నాం. ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహించాం. ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌తో పాటు ఇతర హాస్టల్స్‌కూ అందించనున్నాం. పిల్లల కోసం సరఫరా చేయనున్న నేపథ్యంలో చిల్లీ పౌడర్ నాణ్యతలో రాజీ పడకూడదని భావిస్తున్నాం. వినియోగదారులు జీసీసీ చిల్లీ పౌడర్‌ని బ్రాండ్‌గా గుర్తించేలా ఈ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా మంచి నాణ్యమైన పొడిని తయారు చేస్తాం. ఇందులో భాగంగా వేములవలసలో కోల్డ్‌స్టోరేజీ కూడా ఏర్పాటు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించాం.

– శోభా స్వాతిరాణి, చైర్‌పర్సన్, జీసీసీ

నిస్సిగ్గుగా పవన్ కుల రాజకీయాలు

- కులాలను రెచ్చగొడుతూ.. కుల రహిత సమాజమంటున్నారు
- బీజేపీతో కటింగ్.. టీడీపీతో మెర్జింగ్.. ఇదే పవన్ సభ సారాంశం
- రంగాను కాపులు అభిమానిస్తున్నారనే ఈర్ష్య పవన్‌లో కనిపిస్తోంది
- ముసుగులు తీసేసి ఎన్నికలకు రండి.. వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంది
- ఇద్దరినీ 2024 ఎన్నికల్లో సీఎం జగన్ మళ్లీ చితక్కొట్టి పంపిస్తారు
- సినీ జీవితాన్నిచ్చిన చిరంజీవినీ అవమానించిన పవన్.. మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి: చంద్రబాబు మేలు కోసమే పవన్ కళ్యాణ్ రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ధ్వజమెత్తారు. పవన్ నిస్సిగ్గుగా కుల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. పవన్ కాపులను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కులాలను రెచ్చగొడుతూ.. కులరహిత సమాజమంటావా అని పవన్‌ను నిలదీశారు. అన్ని కులాలూ చంద్రబాబుకు ఊడిగం చేయాలా అని ప్రశ్నించారు. కులాలపై దుర్మార్గమైన రాజకీయ క్రీడ కట్టిపెట్టాలన్నారు. రంగాను కాపులు అభిమానిస్తున్నారనే ఈర్ష్య పవన్‌లో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. పవన్ మాట్లాడేవన్నీ అబద్ధాలేనన్నారు. భారతీయ జనతా పార్టీతో కటింగు, టీడీపీతో మెర్జింగే మచిలీపట్నంలో పవన్ సభ సారాంశమని తెలిపారు. కాపులందరికీ జగన్ మీద ప్రేమ ఎందుకు, చంద్రబాబు మీద ద్వేషం ఎందుకు అని పవన్ అడగటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాపు నాయకులు ఎందరో కమ్మ వారితో పెళ్లి సంబంధాలు కలుపుకొన్నారు కనుక జనసేన చంద్రబాబుతో పొత్తు పెట్టుకోవటంలో తప్పేముందని పవన్ అడగడం సిగ్గుచేటని అన్నారు. బందరులో బీసీ డిక్లరేషన్ చేస్తానని చెప్పి కాపు డిక్లరేషన్ చేశారన్నారు. పవన్ వద్ద ఏం చూసి కాపులు, కాపు నాయకులు వెంట నడవాలని అన్నారు. కాపులందరూ సీఎం జగన్ తోనే ఉన్నారని స్పష్టం చేశారు. నమ్మిన వారి కోసం వైఎస్ జగన్ దేనికైనా సిద్ధపడతారని, అదీ నాయకత్వ లక్షణమని తెలిపారు. వైఎస్ జగన్ నాయకత్వంలో పనిచేస్తున్నందుకు తాము గర్వపడుతున్నామన్నారు. పవన్‌ను నమ్మితే ఏం చేస్తారో కాపులందరికీ తెలుసని చెప్పారు. సినీ జీవితాన్నిచ్చిన చిరంజీవిని కూడా పవన్ అవమానించారని చెప్పారు. అసలు చిరంజీవి పార్టీని మూసేయడానికి కారణం పవన్ కాదా అని నిలదీశారు. రూ.1000 కోట్లు డీల్ అన్న వ్యక్తిని వదిలేసి తమ మీద పడతావెందుకని అన్నారు.

ముసుగులు తీసేసి కలిసి రండి

ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, జనసేన, టీడీపీ, కమ్యూనిస్టు పార్టీలు అన్నీ కలిసే రమ్మని వైఎస్సార్ సీపీ సవాల్ చేస్తోందని నాని చెప్పారు. గతంలోను, ఇప్పుడు కూడా చంద్రబాబుకు అధికారం తెచ్చిపెట్టడానికే జనసేన పనిచేస్తోందని అన్నారు. ఈ మాత్రం దానికి ముసుగు ఎందుకని, పవన్, చంద్రబాబు 2024 ఎన్నికలకు కలిసే రావాలని, వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. ప్రజల కోసం పొత్తు పెట్టుకుంటున్నట్టు నాటకాలెందుకన్నారు. ముసుగులు తీసేసి ఎన్నికలకు రావాలని అన్నారు. 2024 ఎన్నికలకు అన్ని పార్టీలూ కలిసి రావాలని ప్లీనరీ వేదికపై నుంచి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సవాల్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్, చంద్రబాబును వైఎస్ జగన్ మళ్లీ రెండోసారి చితక్కొట్టి పంపిస్తారని చెప్పారు. 2014 నుండి 2019 దాకా చేసిన పాలన చూసి ఓటేయమని, అదే పరిపాలన అందిస్తామని చెప్పి ప్రజలను అడిగే దమ్ము చంద్రబాబుకి, పవన్‌కు ఉందా అని ప్రశ్నించారు. ధృతరాష్ట్రులు, దుర్యోధనులు, దుశ్శాసనులు అందరూ పవన్‌తోనే ఉన్నారని తెలిపారు.

జెండా పవన్‌ది.. అజెండా టీడీపీది

- ఆవిర్భావ సభ ఉద్దేశమేంటో పవన్‌కే తెలియదు
- 175 స్థానాల్లో పోటీచేసే దమ్ములేని నేత పవన్
- 5, 10 సీట్లకోసం చంద్రబాబు వద్ద దేహీ అంటున్నాడు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, అమరావతి: ఏ అజెండా లేకుండా పదేళ్ల నడిచిన రాజకీయ పార్టీ కేవలం పవన్ కళ్యాణ్ జనసేన మాత్రమేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. మంత్రి బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. జనసేనకు రాజకీయ సిద్ధాంతాలు, విలువలు, అజెండా లేవని చెప్పారు. ఆ పార్టీ జెండా పవన్‌ది.. అజెండా టీడీపీది అని వ్యాఖ్యానించారు. పార్టీ ఆవిర్భావ సభలో గంటన్నర పాటు సాగిన పవన్ ప్రసంగంలో ఆ పార్టీ విధివిధానాలు, అజెండా, భవిష్యత్తు కార్యాచరణ లేవన్నారు. అసలు పార్టీ ఆవిర్భావ సభ ఉద్దేశమేంటో పవన్‌కే తెలియదని చెప్పారు. నమ్మిన వారిని మూటగట్టి అమ్మేయడమే పవన్ లక్ష్యమని తెలిపారు. చంద్రబాబుకు పవన్ దత్తపుత్రుడు. ప్యాకేజీ స్టార్ అన్నది మరోసారి రూఢీ అయిందన్నారు. పవన్‌కు 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ములేదని, 5, 10 సీట్లకోసం చంద్రబాబు వద్ద దేహీ అంటున్నారని అన్నారు. ఎలాగైనా అసెంబ్లీకి రావాలనే ఆరాటమే పవన్‌లో కనిపిస్తోందన్నారు. అసెంబ్లీకి రావాలనుకుంటే.. పవన్‌కు విజిటింగ్ పాసులిస్తామని అన్నారు. రూ.1000 కోట్లు అన్న ఆంధ్రజ్యోతి రాధాకృష్ణపై పవన్ చెప్పు ఎత్తలేదెందుకని ప్రశ్నించారు. 175 స్థానాలకు 175 చోట్లా గెలవబోతున్నామని, కష్టపడదామని సీఎం జగన్ తమకు దిశానిర్దేశం చేశారని, ఇది దమ్మున్న నేత లక్షణమని చెప్పారు.

తెలంగాణ

సైనికుల కుటుంబాలకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అండ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకుంది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా సైనిక కుటుంబాల వితంతువులు, సంతానానికి రూ.30 కోట్ల విలువైన గ్రాంట్స్, స్కాలర్‌షిప్‌లు ప్రకటించింది. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ ఆర్మీ వెటరన్స్ (డీఐఏవీ)తో బుధవారం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల కనీసం 14 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ఈ గ్రాంట్లు, స్కాలర్‌షిప్‌ల ద్వారా సైన్యంలో పనిచేసి మరణించిన వారి కుటుంబాలకు చెందిన పిల్లలు అన్ని రకాల ప్రొఫెషనల్ కోర్సులు కూడా చేయవచ్చు. 1వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు విద్యాపరమైన సాయం అందుతుంది. కంప్యూటర్ అక్షరాస్యతకూ ఈ ఏర్పాటు అవకాశం కల్పిస్తుందని ఇన్ఫోసిస్ తెలిపింది. డీఐఏవీ, ఇన్ఫోసిస్‌ల మధ్య తాజా ఒప్పందం కుదిరిన సందర్భంగా బ్రిగేడియర్ వికాస్ భరద్వాజ్ మాట్లాడుతూ 'సైనిక వితంతువులు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా అందే సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇది వారి జీవితాలను మార్చేస్తుంది కూడా' అని వ్యాఖ్యానించారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ప్రతినిధి సునీల్‌కుమార్ ధరేశ్వర్ మాట్లాడుతూ రక్షణ దళాలతో ఇన్ఫోసిస్ అనుబంధం చాలా పురాతనమైందని, సైనిక వితంతువులు, సంతానం తమ లక్ష్యాలను అందుకునేందుకు ఈ గ్రాంట్, స్కాలర్‌షిప్ ఉపయోగపడుతుందని తెలిపారు. కాగా, భారతీయ సైనిక బలగాలకు ఇన్ఫోసిస్ సాయం అందించడం ఇదేమీ కొత్త కాదు. 2016 నుంచి భారతీయ ఆర్మీ సంక్షేమ, రీహాబిలిటేషన్ కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందిస్తోంది. వేలాది మంది వితంతువులు, సంతానానికి రూ.40 కోట్ల వరకూ గ్రాంట్లు అందజేసింది.

కొత్తగా రెక్కలొచ్చెనా!

అవకాశాల వేటలో వడివడిగా అడుగులు

- తోడుగా సాంకేతిక పరిజ్ఞానం
- మూడు చక్రాల స్కూటీతో మారిన జీవనం
- డ్రైవింగ్‌కు అనువైన మార్పులతో అందుబాటులో కార్లు
- కలిసివస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహం

లక్ష్యం దిశగా అడుగులు



ఈమె పేరు తులసి. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన నాగరాజు, మల్లమ్మ దంపతుల రెండో కుమార్తె. ఏడాది వయసులో పోలియో సోకడంతో రెండు కాళ్లు చచ్చుపడ్డాయి. బీఎస్సీ పూర్తి చేసిన తులసి ప్రస్తుతం వలంటీర్‌గా సేవలందిస్తోంది. కనీసం నడవలేని స్థితిలోనూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న ఈమెకు మూడు చక్రాల స్కూటీ సాయంగా నిలుస్తోంది. ఎవరి తోడు లేకుండా వెళ్లి వచ్చేందుకు ఎంతగానోఉపయోగపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సైతం తులసి సిద్ధమవుతోంది.

జీవితమే ఓ పోరాటం



ఇతని పేరు శివ. తుగ్గలి మండలం రామలింగాయపల్లికి చెందిన రామలింగడు, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు. పుట్టుకతోనే పోలియో సోకింది. ఏడో తరగతి చదువుతున్న సమయంలో తండ్రిని క్యాన్సర్ కబళించడంతో తల్లికి ఆసరాగా కూరగాయలు విక్రయించడం మొదలుపెట్టాడు. ఇంతలో తల్లికి కూడా క్యాన్సర్ సోకడంతో ఆమె చికిత్స కోసం కర్నూలుకు చేరుకున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు ప్రస్తుతం జొమాటో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు.

పరీక్షకు ఎదురొడ్డి..



ఈమె పేరు కె.కృష్ణవేణి. నందవరం మండలం రాయచోటి గ్రామానికి చెందిన కె.నరసింహారెడ్డి, సుజాత దంపతుల కుమార్తె. రెండేళ్ల వయసులో కుడి కాలికి పోలియో సోకింది. కాస్త దూరం నడవాలన్నా కష్టం. అయినా ఎంబీఏ పూర్తి చేసింది. ప్రస్తుతం గురజాల సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. సొంతంగా కారు నడపటం నేర్చుకుని విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తోంది. గత ఏడాది సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి.విష్ణువర్ధన్‌రెడ్డితో వివాహం కాగా.. జీవితం సాఫీగా సాగుతోంది.



ఇది పోటీ ప్రపంచం. జీవితంలో ఎవరు ఎంత బాగా పరిగెడితే.. విజయం అంత సులువుగా దాసోహమవుతుంది. అన్ని అవయవాలు సవ్యంగా ఉన్నా.. అవకాశాలను అందిపుచ్చుకోవడం నిత్య పోరాటమే. ఈ పరిస్థితుల్లో దివ్యాంగులు విధి రాతను ఎదురించి నిలుస్తున్నారు. చుట్టూ చీకటి ఉన్నా.. అడుగడుగునా ఆటుపోట్లు ఎదురవుతున్నా.. ఆత్మస్థైర్యం తోడుగా తమను తాము తీర్చిదిద్దుకుంటున్నారు. లోపం మనిషికే కానీ.. మనసుకు కాదని బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. సైకిల్ తొక్కడం రాకపోయినా.. మూడు చక్రాల స్కూటర్ ప్రపంచాన్ని వారికి సరికొత్తగా పరిచయం చేసింది. కారులో చిన్న మార్పు.. ఊహలకు రెక్కలు తొడిగింది. ఇప్పుడిక ఆ పనీ, ఈ పనీ అనే తేడా లేకుండా, అన్ని పనులనూ చక్కబెడుతున్న దివ్యాంగుల జీవితం ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తోంది. – (సాక్షి, కర్నూలు డెస్క్)

కారునూ నడిపేయొచ్చు

ఇది వరకు ద్విచక్ర వాహనాలను నడిపేందుకు ఆలోచించే దివ్యాంగులు ఇప్పుడు ఎంచక్కా కార్లలోనూ షికారు చేస్తున్నారు. రెండు కాళ్లు లేకపోయినా చిన్న మార్పులతో కారు నడిపేస్తున్నారు. ఈ మార్పు గతంలో మహానగరాలకే పరిమితమైనా.. ఇప్పుడు సమీప నగరాల్లోనూ, షోరూంలలోనూ అందుబాటులోకి వచ్చింది. కావాల్సిన మార్పు కోసం రూ.15 వేల నుంచి రూ.20 వేల లోపు వెచ్చిస్తే కారు కూడా సిద్ధమవుతోంది. కొన్ని షోరూంలు దివ్యాంగులు కొత్త వాహనం కొనుగోలు చేస్తే ధరలో కొన్ని మినహాయింపులు కూడా కల్పిస్తున్నాయి. అదేవిధంగా ప్రభుత్వం టోల్‌గేట్ల వద్ద కూడా సడలింపులు ఇస్తుండటం విశేషం.

లైసెన్స్ పొందడం ఎలా?


- వికలత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్
- ఆధార్ కార్డు
- నడిపేందుకు అనువైన వాహనం
- దరఖాస్తు వెబ్‌సైట్: https://sarathi.parivahan.gov.in/

అందుబాటులో అనువైన స్కూటీలు



ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలన్నా, బండి ఎక్కడమే తరువాయి రయ్యుమని దూసుకెళ్తున్నారు. ఇంటి పనులు, బయటి వ్యవహారాలే కాదు... పిల్లలను సరదాగా తిప్పే విషయంలోనూ దివ్యాంగులు స్కూటీని సద్వినియోగం చేసుకుంటున్నారు. పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లడం, కాలేజీల నుంచి ఇంటికి చేర్చడం.. వారి బాగోగుల విషయంలో పాలుపంచుకోవడం, బయటకు తీసుకెళ్లి కోరింది కొనిపెట్టి సరదాలు తీర్చడంలో ఇప్పుడు ఏ లోటూ రానివ్వడం లేదు. అవసరమైతే స్నేహితులకు కూడా లిఫ్ట్ ఇస్తుండటం చూస్తే ఈ వాహనం దివ్యాంగుల జీవితాన్ని ఎంతలా మార్చేసిందో అర్థమవుతుంది.

షోరూంలలోనే వాహనాలు



విభిన్న ప్రతిభావంతుల కోసం కారులో మార్పు చేసిన దృశ్యం

ఐదారేళ్ల క్రితం ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినా.. దివ్యాంగులకు అనుగుణంగా మార్పు చేసుకోవడం ఎంతో కష్టతరమైన పని. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి పెద్ద నగరాల్లో మాత్రమే ఈ సదుపాయం ఉండేది. ఈ విషయంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల కూడా ఎవరూ ఆ వాహనాల జోలికి వెళ్లలేదు. ఇప్పుడు ఇంటర్నెట్ పుణ్యమా అని ఎలాంటి సమాచారమైనా అరచేతిలో లభిస్తోంది. ఇలా దివ్యాంగులకు అవసరమైన వాహనాలు పట్టణాల్లోనూ అందుబాటులోకి వచ్చేశాయి. ఇప్పుడిక షోరూంలో వాహనం కొనుగోలు చేసే సమయంలోనే చెబితే వాళ్లే అన్ని సౌకర్యాలతో కూడిన వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందుకు రూ.6 వేల నుంచి రూ.7వేల వరకు అదనంగా ఖర్చవుతోంది.



దాతృత్వం కంటే యుద్ధం, సాహసం ఎక్కువ గొప్ప పనులు చేయగలిగాయి. నీ సానుభూతి కాదు, నీ ధైర్యం దురదృష్ట వంతుడిని కాపాడగలదు.

– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, మార్చి, 16

అందరి కళ్లూ సుప్రీం పైనే!

దేశంలో సంప్రదాయం ఒకటి ఉండవచ్చు. రాజ్యాంగమిచ్చే హక్కు వేరొకటి కావచ్చు. రెంటి మధ్య ఘర్షణలో త్రాసు ఎటు మొగ్గాలి? ధర్మసందేహమే! విభిన్న ప్రకృతులైన స్త్రీ పురుషుల సంపర్కం, వివాహమే భారతీయ సమాజ సంప్రదాయం, చట్టబద్ధం. సంప్రదాయం కాకపోగా, బ్రిటీషు కాలపు చట్టం కింద నిన్నటి దాకా శిక్షార్హమైన స్వలింగ సంపర్కం మారుతున్న కాలానుగుణంగా శిక్షార్హం కాదని కొన్నేళ్ళ క్రితమే తీర్పిచ్చిన మన సుప్రీమ్ కోర్ట్ ఇక స్వలింగ వివాహమూ చట్టబద్ధమేనని తేలుస్తుందా అన్నది చర్చనీయాంశం. భారతదేశంలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధతను కేంద్రం తన అఫిడవిట్‌లో మార్చి 13న వ్యతిరేకించింది. 'ఎంతో ప్రభావశీలమైన' ఈ కేసులో తుది వాదనలు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విని, నిర్ణయిస్తుందని సుప్రీమ్ తేల్చింది. ఈ కేసు, ఏప్రిల్18 నుంచి ప్రత్యక్షప్రసారంలో జరగనున్న వాదనలు భారత సమాజంలో కీలకం కానున్నాయి.

పౌరులందరూ సమానులేనన్నది రాజ్యాంగ మౌలిక సూత్రం. వ్యక్తిగత ఇష్టానిష్టాలు, అభిప్రాయాలు, అలవాట్లు, నమ్మకాలను బట్టి దాన్ని మార్చలేం. మార్చకూడదు. కాబట్టి స్వలింగ సంపర్కులకూ అందరితో సమానంగా హక్కులు రాజ్యాంగ విహితమే. అయితే, సంప్రదాయవాద భారతీయ సమాజంలో స్వలింగ వివాహం సున్నిత అంశం. అన్ని వర్గాల నుంచి అన్ని రకాల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోకుండా చటుక్కున తేల్చే వ్యవహారం కాదు. ఆధునిక అమెరికాలోనూ దీర్ఘ కాలం దీనిపై చర్చోపచర్చలు నడిచాయి. అక్కడ డజనుకు పైగా రాష్ట్రాల్లో ఈ పెళ్ళిళ్ళు నిషిద్ధం. 2008లో తొలిసారి అధ్యక్షపదవికి పోటీకి దిగినప్పుడు ఒబామా సైతం ఈ వివాహాల్ని వ్యతిరేకించారు. దీర్ఘపోరు తర్వాత 2015లో అమెరికా సుప్రీమ్ తీర్పుతో 50 రాష్ట్రాల్లోనూ పరిస్థితి మారింది.

నిజానికి, 2018 సెప్టెంబర్‌లో భారత సర్వోన్నత న్యాయస్థానం స్వలింగ సంపర్కం శిక్షార్హం కాదని తేల్చింది. పాతకాలపు చట్టాన్ని పక్కనపెట్టి ఇచ్చిన ఈ సంచలన తీర్పుపై అప్పట్లోనే గగ్గోలు పుట్టింది. సాంస్కృతిక విలువలకు తిలోదకాలిచ్చి, పాశ్చాత్య సంస్కృతిని అలవరుచుకుంటున్నామంటూ విమర్శలు రేగాయి. తీరా స్వలింగ సంపర్కం తప్పు కాదని కోర్టు చెప్పినా తమకు సామాజిక అంగీకారం లభించడం లేదనీ, తమపై దుర్విచక్షణ సాగుతూనే ఉందనీ లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్ల (ఎల్జీబీటీక్యూ) వర్గం ఫిర్యాదు చేస్తోంది. కథ చకచకా ముందుకు సాగి, స్వలింగ సంపర్కం నేరం కాదనే దశ నుంచి స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కోరడం దాకా ఇప్పుడు వచ్చింది. హోమో సెక్సువల్ పెళ్ళిళ్ళను చట్టబద్ధమైనవని గుర్తించాలని కోరుతూ, 2020లోనే ఢిల్లీ, కేరళ హైకోర్టుల్లో కొన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. తర్వాత సుప్రీమ్‌కు పిటిషన్లు చేరాయి. కోర్టు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది.

కేంద్రం మార్చి 13న సుప్రీమ్‌లో తన అఫిడవిట్ దాఖలు చేస్తూ, స్వలింగ వివాహాల చట్టబద్ధతకు ససేమిరా అంది. సహజ ప్రకృతికి విరుద్ధంగా జరిపే లైంగిక చర్యలు శిక్షార్హమని భారత శిక్షాస్మృతిలోని 377వ సెక్షన్ మాట. ఆ సెక్షన్ కింద స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించరాదని అయిదేళ్ళ క్రితం తీర్పునిచ్చినంత మాత్రాన ఏకంగా స్వలింగ వివాహాన్ని వివిధ చట్టాల కింద తమ ప్రాథమిక హక్కని పిటిషనర్లు అనుకోరాదన్నది ప్రభుత్వ వాదన. భారతీయ కుటుంబ వ్యవస్థకూ, ఈ స్వలింగ వివాహాలకూ పొంతన కుదరదని సర్కారీ అఫిడవిట్. 2018లో కోర్ట్ వల్ల రాజ్యాంగ హక్కులు లభించాయి కానీ, స్వలింగ వివాహాల్ని చట్టప్రకారం గుర్తించనిదే వైద్యచికిత్సకు సమ్మతి పత్రంపై సంతకాలు, పింఛన్లు, దత్తత స్వీకారాలు, చివరకు స్వలింగ దంపతులకు క్లబ్ సభ్యత్వాల లాంటి ప్రాథమిక హక్కులూ కరవేనని ఎల్జీబీటీ ఉద్యమకారుల వేదన. ఈ పరిస్థితుల్లో మార్చి 18 నుంచి రాజ్యాంగ ధర్మాసనం జరిపే విచారణకై వేచిచూడాలి.

1989లో ప్రపంచంలోనే తొలిసారిగా డెన్మార్క్ స్వలింగ భాగస్వామ్యాన్ని అనుమతిస్తూ చట్టం చేసింది. ఇక బ్రిటన్‌లో ఈ పెళ్ళిళ్ళను అంగీకరించడానికి 32 ఏళ్ళు పట్టింది. అమెరికాలో పుష్కర కాలమైంది. ఫ్రాన్స్‌లో ఏకంగా 220 ఏళ్ళు పట్టింది. స్వలింగ సంపర్కం ఎన్నడూ నేరమే కాని తైవాన్‌లో సైతం మొన్న 2019లో కానీ వీటికి ప్రభుత్వ గుర్తింపు దక్కలేదు. భారత్ మరి గత అయిదేళ్ళలోనే ఈ సంప్రదాయ విరుద్ధ, సాహసోపేత నిర్ణయం తీసుకొనే దశకు చేరుకుందా? ఆధునిక సమాజంలో ఎల్జీబీటీ హక్కుల్ని కాదనలేం. కానీ ఇప్పటికీ పెళ్ళంటే ఒకే కులం, మతం, సంప్రదాయాలకే మొగ్గే మెజారిటీ జనమున్న దేశంలో ఈ మార్పు భావోద్వేగభరిత అంశం. ధార్మిక, అంగీకృత సామాజిక విలువలు ముడిపడ్డ ఈ అంశంలో తొందరపడితే పర్సనల్ చట్టాల తేనెతుట్టె కదులుతుంది. పర్యవసానాలు సామాజికంగా, రాజకీయంగా తప్పవు. మెజారిటీ మనోభీష్టానికి వ్యతిరేకంగా లైంగిక సంబంధాలు, పెళ్ళి, లైంగిక సమ్మతి వయసు, దత్తత, వారసత్వహక్కు లాంటివి పాలకులు ముట్టనిదీ అందుకే. కడకు ఇలాంటివి కోర్టు గుమ్మం తొక్కడమూ సహజమే.

ప్రస్తుతం ఆస్ట్రేలియా, జర్మనీ సహా 32 దేశాల్లో ఈ పెళ్ళిళ్ళు చట్టబద్ధమే. కానీ, లైంగిక మైనారిటీ దంపతుల పెంపకంలోని పిల్లల చదువు, ఆరోగ్యం, సామాజిక – ఆర్థిక పురోగతిపై వివిధ పరిశోధనలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. అది అటుంచినా, ఆ భావిపౌరులపై సమాజంలో పడే ముద్రకూ, ఎదురయ్యే సహాయ నిరాకరణకూ పరిష్కారమేంటి? స్వలింగ వివాహాలకు చట్టబద్ధత నిస్తే, అనేక చట్టాలను పునర్నిర్వచించక తప్పదు. అది మరో సవాలు. అన్నిటికీ సిద్ధమై, సమాజంలో అందరినీ సిద్ధం చేయకుండా తొందరపడితే కష్టం. అందుకే, ఇప్పుడు అందరి కళ్ళూ సుప్రీమ్ పైనే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.నవమి ప.1.15 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.1.51 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.20 నుండి 1.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.09 నుండి 10.56 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** రా.9.20 నుండి 10.48 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

'మూల' సంస్కృతికి రక్ష అంబేడ్కరిజం

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ప్రకృతి నుంచి నేర్చుకొంటూ ఎక్కడికక్కడ మానవ సమూహాలు తమవైన సంస్కృతులను అభివృద్ధి చేసుకున్నాయి. సాధారణంగా ఆహారావసరాలు తీర్చగలిగే నదీలోయల్లో విభిన్న సాంస్కృతిక విశిష్టతలతో కూడిన నాగరికతలు రూపుదిద్దుకొంటాయి. మన గోదావరి, కృష్ణా వంటి నదీలోయల్లో విలసిల్లిన 'మూల సంస్కృతి' ఇలా అభివృద్ధి చెందినదే. ఇక్కడి మూలవాసులు ఏ ప్రకృతి వనరులను ఉపయోగించుకుని వ్యవసాయం, టెక్నాలజీలను అభివృద్ధి చేసుకున్నారో... అవే ప్రకృతి శక్తులను దేవుళ్లుగా పూజించారు దేశం బయటి నుంచి వచ్చిన ఆర్యులు. వారే ఇక్కడివారిపై 'రాక్షసులు' అని ముద్రవేశారు. ఆ వైదిక సంస్కృతీ వాహకులు ఇప్పటికీ మూలవాసుల సంస్కృతిని కబళించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

భారతదేశం ఈనాడు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక ఘర్షణల్లో ఉంది. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించే శక్తుల విజృంభణే ఇందుకు కారణం. ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్ వంటి మతతత్త్వ శక్తులు రాజ్యాంగేతర జీవనాన్ని కొనసాగిస్తూ... దానిని దేశం మీద రుద్దాలనే తాపత్రయంలో ఉన్నాయి. కారణం వారు స్వాతంత్ర్యానికి ముందు నుంచీ భారతదేశ సాంస్కృతిక, సాంకేతిక వ్యవస్థలకు విరోధులు కావడమే. నిజానికి భారతదేశ మూలాలు భౌతికవాద, హేతువాద, తాత్వికవాద భావజాలంలో ఉన్నాయి. భౌతిక వాదం, జీవశాస్త్రం, మానవ పరిణామవాదాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమన్వయించి హిందూ ప్రత్యామ్నాయ వాదాన్ని రూపొందించారు. అందులో తత్త్వ శాస్త్రానికి ప్రాధాన్యమిచ్చి ఆధ్యాత్మిక వాదం ఒక ఊహాత్మక వైయక్తిక భావ జాలం నుండి రూపొందిందేననీ, అందుకే వేలకొద్ది దేవుళ్ళు భారత దేశంలో సృష్టించబడ్డారనీ ఆయన చెప్పారు.

ఎంఎన్ రాయ్ తన 'మెటీరియలిజం' గ్రంథంలో శాస్త్రీయ భావ జాల చారిత్రక దృక్పథం గురించి వివరిస్తూ... భారతదేశమే భౌతిక తత్త్వ శాస్త్రాన్ని ప్రపంచానికి అందించిందని నొక్కి వక్కాణించారు. భారతీయ మూలవాసులు భౌతికవాద జీవులనీ; వారు నిప్పునూ, నీరునూ, గాలినీ, శూన్యాన్నీ జీవితానికి అన్వయించుకున్న మహోన్నత శాస్త్రవేత్తలనీ ఆయన శాస్త్రీయంగా నిరూపించారు. మరీ ముఖ్యంగా సింధు నాగరికతలో వచ్చిన నదీ నాగరికత సంస్కృతి నుండి నదులకు కాలువలు నిర్మించే బృహత్తరమైనటువంటి ఇంజనీరింగ్‌ను దళితులు కనిపెట్టారు. అంబేడ్కర్ దళిత బహుజనులు 'మొదటి ఇరిగేషన్ ఇంజనీర్లు' అని చెప్పారు. అందుకే భారతదేశ వ్యాప్తంగా సింధు, గంగ, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణా, కావేరి, సువర్ణ రేఖ, మహానది, పెన్నా, మహి, సబర్మతి, నర్మదా, తపతి వంటి ఎన్నో నదులకు ఆనకట్టలు కట్టి నదీ నాగరికతలనూ, వ్యవసాయ సంస్కృతినీ నిర్మించారు. ఈ నదులన్నింటినీ వైజ్ఞానిక దృష్టితో చూడకుండా దిగజార్చింది మత వ్యవస్థ.

భారతదేశంలో అత్యుత్తమమైన నదుల్లో గోదావరి చాలా గొప్పది. ఈ నది ప్రవహించే ప్రాంతం ఎక్కువగా గుట్టలు, పర్వతాలు, లోయలు; ఎగువ, దిగువ ప్రాంతాలు; చిన్న చిన్న గుట్టలతో కూడి ఉంది. ఈ నది అంచుల్లో నివసించే వాళ్ళు గిరిజనులు, దళితులే. వారే ఈ నదీ వ్యవస్థను ఇప్పటికీ రక్షిస్తున్నారు. ఈ గోదావరి సంస్కృతికీ, హిందూ మత సంస్కృతికి సంబంధమే లేదు. సుమారు 1600 సంవత్సరాలు గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో బౌద్ధ సంస్కృతి విలసిల్లింది. ఈ హిందూ వాద సంస్కృతి వచ్చిన తర్వాత ఈ నదీ నాగరికత మీద గొడ్డలి వేటు పడింది.

గోదావరి తర్వాత గొప్ప సంస్కృతులు సృష్టించింది కృష్ణా నదీ



పరివాహక ప్రాంతం. దీని పరీవాహక ప్రాతంలోనూ దళితులు, గిరిజనులే అధికంగా జీవిస్తున్నారు. వీరే ఇక్కడ విలసిల్లిన సంస్కృతికి సృష్టికర్తలు. హిందూ సంస్కృతికీ, ఇక్కడి సంస్కృతికి కూడా ఎటువంటి సంబంధం లేదు. హిందూ సామ్రాజ్యవాదం నదీ సంస్కృతులను ధ్వంసం చేయాలనే పెద్ద ప్రయత్నంలో ఉంది. అంబేడ్కర్ అందుకే నదుల అనుసంధానానికి సంబంధించి ఉద్గ్రంథాలను రచించారు. ఆదివాసీల నుండీ, దళితుల నుండీ ఆయుధాలు ఉన్న అగ్ర వర్ణాల వారే భూమిని కొల్లగొట్టారని నిరూపించారు. అంబేడ్కర్ దళితుల, ఆదివాసీల జీవన సంస్కృతులన్నీ నదీ పరీవాహక వ్యవసాయక అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. దీనికి తోడు సుదీర్ఘమైన సముద్ర తీర ప్రాంతంలో జీవిస్తున్న బెస్తలు, కొండల మీద గొర్రెలను మేపుకొని జీవిస్తున్న యాదవులు, తాటాకు కొట్టి గృహ నిర్మాణ సంస్కృతికి పునాదులు వేసిన గౌడలు, శెట్టి బలిజలు; వస్త్రాలు నేసి మానవ నాగరికతను కాపాడిన పద్మశాలీలు, దేవాంగులు, దళితులు... వీళ్లంతా కూడా నదీ నాగరికత సృష్టికర్తలే అని అంబేడ్కర్ చెప్పారు.

మైనార్టీలపైనా, దళితులపైనా... ద్వేషం, మాత్సర్యం, క్రోధం కలిగి ఉండటం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంలో ప్రధానమైన అంశం. నిజానికి మైనారిటీలుగా చెప్పబడుతున్న ముస్లింలు కానీ, క్రైస్తవులు కానీ పరాయివారు కారు. హిందూమత అస్పృశ్యతను వారు భరించలేక ఇస్లాం మతాన్నీ, క్రైస్తవ మతాన్నీ తీసుకున్నవారే. ఆర్యులు మధ్య ఆసియా నుండి వచ్చారని రొమిల్లా థాపర్, డీడీ కోశాంబి, ఆర్ఎస్ శర్మ, బిపిన్ చంద్ర వంటి వారు తేల్చారు. ఆర్యులు మూలవాసులకు శత్రువులని అంబేడ్కర్ చెప్పారు.

ఇకపోతే బౌద్ధం భారత ఉపఖండంలో జన్మించింది. సిక్కుమతం భారతదేశంలో పుట్టింది. ఆయా సందర్భాలలో చారిత్రకంగా వివిధ మతాలు స్వీకరించిన దళిత బహుజన మైనారిటీలను శత్రువులుగా చూడటం అశాస్త్రీయ విషయం. నిజానికి మూలవాసులైన దళితులు ఏవైతే ఉత్పత్తి సాధనాలుగా శాస్త్రీయ పరికరాలు కనిపెట్టారో వాటిని ఆర్యులు పూజించారు. అంటే మూలవాసుల కంటే వారు ఎంత వెనుకబడి ఉన్నారో మనకు అర్థం అవుతుంది. నాగరికతలో, మానవతలో, సౌజన్యంలో, ప్రేమలో, కరుణలో మూల వాసులది అద్వితీయమైన పాత్ర. ఆర్యులు మూలవాసుల సుగుణాలను అధ్యయనం చేయలేక పోయారు. మూలవాసులు ప్రకృతి వనరులను ఉపయోగించి నాగరికతా నిర్మాణం చేస్తే... ఆర్యులు ఆ ప్రకృతి శక్తులను దేవుళ్లుగా కొలిచారు. వేదాల్లో ఉన్న దేవుళ్ళు అందరూ ఇందుకు ఉదాహరణ.

మనిషి దేవుణ్ణి సృష్టించుకున్నాడు. కానీ ఆ దేవుడు మనిషి మీద ఆధిపత్యం వహిస్తున్నాడు. చివరకు మనిషిని బలిచ్చేవరకు ఈ మూఢ భక్తి పరిఢవిల్లింది. సాటి మనిషిలో ఉన్న జ్ఞానాన్నీ, హేతుభావాన్నీ నిరాకరించి దైవాధీన భావాన్ని అలవాటు చేసుకున్నాడు మానవుడు. తన తోటి మనిషిని ప్రేమించడం మానేసి, తను పూజించే దేవుణ్ణి కొనియాడమని బలవంతం చేశాడు. పూజించకపోతే వధించాడు. ఒక్కొక్క దేవుణ్ణి పూజించేవారు ఒక్కో సమూహంగా ఏర్పడ్డారు. ఇతర దేవుళ్లను పూజించే వారిని చంపడం ప్రారంభించారు. దీన్ని 'దుష్ట శిక్షణ' అన్నారు. వేదాల్లో తమ శత్రువులను చంపమని వాళ్ళ దేవతలను వేడుకొన్నారు ఆర్యులు. చివరకు దేవుళ్ళనే అవతార పురుషులుగా కిందకు దించారు. మూలవాసులకు 'రాక్షసులని' పేరు పెట్టి వారిని హతమార్చటానికే 'దశావతారాలు' ఆవిర్భవించాయని ప్రచారం చేశారు. వేద కాలం నుంచే ఈ హననం, హత్యాకాండ, అణచివేత, దౌర్జన్యం, విధ్వంసం ప్రారంభమయ్యాయి.

సంస్కృతిని, సంపదను మూలవాసులు సృష్టిస్తూ వెళ్లారు. ఆర్యుల వారసులు వీరిని వధిస్తూ, సంపదను ధ్వంసిస్తూ వెళ్లారు. ఈ చరిత్రను వక్రీకరించాలనే ఉద్దేశ్యంతోనే హిందూ మతవాద శక్తులు విద్యావ్యవస్థలో సిలబస్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే 'ద ఆరెస్సెస్: రోడ్‌మ్యాప్స్ ఫర్ ద 21సెంచరీ' వంటి పుస్తకాలు విశ్వవిద్యాలయాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

ఇకపోతే ఎన్నో విలువైన గ్రంథాలను హిందుత్వ శక్తులు నిరాకరించాలనీ, ధ్వంసం చేయాలనీ ప్రయత్నిస్తున్నాయి. కమ్యూనిస్టు భావాలకూ, సోషలిస్టు భావాలకూ, అంబేడ్కరిస్టు భావాలకూ భిన్నంగా వ్యవహరిస్తున్నారు. మూలవాసుల జీవన సంస్కృతులకు మూలమైన నదీ నాగరికతా సాంస్కృతిక విప్లవానికీ, రాజ్యాంగ మూల సూత్రాలకూ భిన్నంగా ఆ శక్తులు జీవిస్తున్నాయి. రాస్తున్నాయి. ప్రచారం చేస్తున్నాయి. అందుకే ఇప్పుడు అంబేడ్కర్ ఆలోచనలతో పునరుజ్జీవన ఉద్యమం, ప్రత్యామ్నాయ భావజాల ఉద్యమం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. అంబేడ్కర్ మార్గమే ఈనాటి సామాజిక జీవన సూత్రం కావాలి.

వ్యాసకర్త దళిత ఉద్యమ నేత । 9849741695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అంతగా వేచివుండాలా?



పుణెలోని ఒక హాస్పిటల్లో చెస్ట్ ఫిజీషియన్ అపాయింట్‌మెంట్ నాకు 11:40కి ఇచ్చారు. డాక్టర్ రావడమే 12:20కి వచ్చాడు. అప్పటికి లిస్టులో నాది 15వ పేరు. మొత్తానికి నన్ను డాక్టర్ 1:30కి చూడగలిగాడు. హాస్పిటల్స్ ఇంతకంటే మెరుగ్గా పనిచేయలేవా?

– హరీష్ పూరి, ఆర్మీ వెటెరన్

చర్యలు ఉండవా?



ఢిల్లీ విమానాశ్రయంలో మొత్తం గందరగోళంగా ఉంది. ఇమ్మిగ్రేషన్, సెక్యూరిటీ చెక్ కోసం మూడు గంటల పొడవైన క్యూలు. జనాలు నీరసిస్తున్నారు, పోట్లాడుతున్నారు. అసలు చాలా కౌంటర్లు పనిచేయడం లేదు. ఇప్పుడిదే సాధారణమా?

– తనుశ్రీ పాండే, జర్నలిస్ట్

పురాతన మతం



యజీదీలు ముస్లింలు కాదు. కుర్దులు, అరబ్బులు కూడా కాదు. వాళ్ల పవిత్ర అంశీభూతాలు: అగ్ని/సూర్యుడు, వాయువు, జలం, భూమి, ఆకాశం. యజీదీలది ఒక ప్రాచీన మతం.

– అజ్జాద్ అల్‌సలేమ్, యజీది యాక్టివిస్టు

ఆయనదో లోకం



ఒక కూరగాయల వ్యాపారి ఎప్పుడూ శ్రద్ధగా చదువుకుంటూ ఉంటాడు (ఢిల్లీలో). ఆయన పేరు అశోక్‌కుమార్. ఆ కారణంగా నేను ఎప్పుడూ కూరగాయలు ఆయన దగ్గరే కొంటూ వుంటాను.

– మయాంక్ ఆస్టెన్ సూఫీ, రచయిత

కొత్త శ్వాస



డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్'కు ఆస్కార్ అనేది చివరి అడుగు కాదు. విజయపు ఒడి చివర ఆస్కార్ ఉందంతే. మా తమ్ముడు గెలవాలని నేను కోరుకున్నదైతే నిజం. సరే, ఇది శౌనక్ (సేన్) 'తొలి' ఆస్కార్ నామినేషన్‌గా గుర్తుండి పోతుంది. ఈ డాక్యుమెంటరీకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రేమాభివందనాలు. మీరే మా ఛాంపియన్లు.

– రాజా సేన్, స్క్రీన్ రైటర్

వ్యతిరేకించడం తప్పు కాదు!



నేను అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె.అడ్వాణీ– ఇద్దరినీ లండన్‌లో 'బీబీసీ' కోసం ఇంటర్వ్యూ చేశాను. అలాగే 1990ల్లో నగరంలో జరిపిన వారి కార్యక్రమాలకు కవరేజ్ ఇచ్చాను. ఇరువురూ అప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని 'ప్రజాస్వామ్య వ్యతిరేకి' అని నిందించారు. ప్రతిపక్ష నాయకుల పనే అది, వ్యతిరేకించడం!

– పంకజ్ పచౌరీ, యాంకర్, రిపోర్టర్

చదువరి



ఒక పాత(2012) ప్రసంగంలో ఎల్.కె. అద్వాణీ ఫిర్ సుబహ్ హోగీ(1958) చిత్రం ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ 'క్రైమ్ అండ్ పనిష్‌మెంట్' నవలకు రూపాంతరం అని చెబుతున్నారు. రామ్ అనే ఒక తెలివైన లా విద్యార్థి వడ్డీవ్యాపారి ఇనస్పెక్టెను బద్దలుగొట్టి దోచుకోవాలనుకోవడం ఇందులో కథ. దోస్తోవ్‌స్కీ అటుండనీ, రాజకీయ నాయకులు ఇలా క్లాసిక్స్‌ను ఉటంకించడమే అరుదు.

– ఇర్ఫాన్, ఆర్కైవిస్టు

ఇన్‌బాక్స్

మహామహోపాధ్యాయుడు

తిరుమల తిరుపతి దేవస్థానం వారి భగవద్గీత ప్రాజెక్టుకు 2002–2007 మధ్య స్పెషల్ ఆఫీసరుగా పనిచేసి, శ్రీమద్భగవద్గీతను నాలుగు సార్లు వైవిధ్యభరితమైన వ్యాఖ్యానాలతో ప్రచురించి ఘనతను పొందినవారు డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య. సంస్కృత పండితులుగా, సాహితీవేత్తగా గొప్ప పేరున్న 'మహామహోపాధ్యాయ' సముద్రాల లక్ష్మణయ్య సోమవారం రాత్రి ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

చిత్తూరు జిల్లా ఏర్పేడు వద్ద కాత్రకాయలగుంటలో 1939 జూన్ 8న ఆయన జన్మించారు. ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఏ సంస్కృతంలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తర్వాత తిరుపతి ప్రాచ్య కళాశాలలో శిక్షణ పొందారు. తిరుపతిలోని తి.తి.దే.లో అధ్యాపకులుగా పని చేస్తూ 42 గ్రంథాలను రచించారు. టీటీడీ ప్రచురణలకు సంపాదకులుగా వ్యవహరించారు. ధర్మ ప్రచార పరిషత్‌కు కార్యదర్శిగా, పురాణ –ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా సేవలనందించారు. వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ పీఠం ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు. అన్నమాచార్య సంకీర్తనామృతం, భర్తృహరి సుభాషితములు, శ్రీ మలయాళ స్వామి జీవిత చరిత్ర, దశకుమార చరితము, రఘువంశము, అమరవాణి, హిందూ ధర్మ పరిచయం, యోగవాశిష్ఠము వంటి గ్రంథాలు ప్రచురించారు.



డా॥ సముద్రాల లక్ష్మణయ్య

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలకు వ్యాఖ్యానం రాసి భవిష్యత్తరాలకు, ఇతర వ్యాఖ్యానకారులకు ఆదర్శవంతంగా నిలిచారు. అన్నమయ్య కీర్తనల్లో వేదాలు, రామాయణ, మహాభారతాలు, ఉపనిషత్తులు, పురాణాల్లోని అంశాలను ఆయన స్పృశించారు. వేదాంత ధోరణితో ఆయన రచించిన సంకీర్తనలు బహుళ ప్రాచుర్యం పొందాయి. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వారు 'వాచస్పతి' పురస్కారాన్ని, 'మహామహోపాధ్యాయ' బిరుదులనిచ్చి లక్ష్మణయ్యను సత్కరించారు. వీరి మృతి సాహితీ రంగానికీ, ఆధ్యాత్మిక రంగానికీ తీరని లోటు.

– డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య
అన్నమయ్య తితిదే ప్రాజెక్టులో వ్యాఖ్యానకారుడు

ఆధునిక శిబిచక్రవర్తి అమరజీవి

సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

అమరజీవి పొట్టి శ్రీరాములు మదరాసులో మహా లక్ష్మమ్మ, పొట్టి గురవయ్య దంపతులకు 1901 మార్చి 16న జన్మించారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన శ్రీరాములు తల్లి దగ్గరే నలుగురి సంతానంలో ఒకడిగా పెరిగారు. శ్రీరాములు జీవించిన 52 ఏళ్లలో తొలి 20 ఏళ్ళు మదరాసులో ఉన్నారు. శానిటరీ ఇంజనీరింగ్ చదువు కోసం, గ్రేట్ ఇండియా పెనిన్సులర్ రైల్వేలో అసిస్టెంట్ ప్లంబర్ ఉద్యోగం కారణంగా బొంబాయిలో పదేళ్ళు గడిపారు. ఇంజనీరింగు డిప్లమా చదువుతున్న కాలంలో పెళ్ళి జరగడమూ, ఉద్యోగం చేస్తున్న సమయంలో మొదట 1928లో తల్లి మహాలక్ష్మమ్మను, పిమ్మట కొంత కాలానికే తొలి సంతానాన్ని ఐదు రోజులకే కోల్పోవడం, తర్వాత 1929లో భార్య సీతమ్మను కోల్పోవడం తీరని విషాదాలు.

క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో గాంధీజీ పరిచయంతో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. మూడేళ్ళపాటు తలలో నాలుకగా సబర్మతీ ఆశ్రమంలో గడిపి గాంధీజీ ఆలోచనను, ఆచరణను తన రక్తంలో జీర్ణించుకున్నారు. 1933 ఆగస్టు 1 రాత్రి గాంధీజీతో పాటు బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించిన 34 మందిలో పొట్టి శ్రీరాములు ఒకరు. ఇది ఆయనకు తొలిసారి జైలు జీవితాన్ని పరిచయం చేసింది.

1934 జనవరి 15న పగలు రెండు గంటల సమయంలో బిహార్ ఉత్తర ప్రాంతంలో మూడు సార్లు తీవ్రంగా కంపించి భయంకరమైన శబ్దంతో భూకంపం ముంచెత్తింది. దీని ప్రభావం 77 వేల చదరపు మైళ్లకు వ్యాపించిందనీ, ఫలితంగా కోటిన్నరమంది తీవ్ర సమస్యలకు గురయ్యారనీ అంచనా. పది లక్షల ఇళ్ళు, 1,400 కిలోమీటర్ల రైలు మార్గం ధ్వంసమయ్యాయి. ఐదోనెల జైలు శిక్ష అనుభవిస్తున్న ఎంతో మందితోపాటు భూకంపం కారణంగా పొట్టి శ్రీరాములు విడుదలై గాంధీజీ సలహా మేరకు బిహార్ భూకంప బాధి



తుల కేంద్ర సహాయక సంఘంలో సభ్యుడుగా చేరారు. దీనికి నాయకత్వం వహిస్తున్నది బాబూ రాజేంద్రప్రసాద్. దాదాపు పది నెలలపాటు నిద్రాహారాలు మాని, సహాయ సేవా కార్యక్రమాలను పొట్టి శ్రీరాములు గొప్పగా నిర్వహించారు.

1937లో మేనమామ భార్య తండ్రి అయిన గోనుగుంట్ల నర్సయ్య మరణంతో శ్రీరాములు ప్రజా జీవితం తెలుగు ప్రాంతానికి తరలివచ్చింది. ప్రత్యేక రాష్ట్రం కోసం తనను తాను త్యాగం చేసుకున్న అమరజీవిగానే ఆయన తెలుసు. నిజానికి పొట్టి శ్రీరాములు ధీరోదాత్త ఆత్మత్యాగం కారణంగా తమిళులు, కన్నడిగులు, మలయాళీలు, గుజరాతీలు, మహారాష్ట్రీయులు... ఇలా ఎన్నో మాతృభాషలవారు ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పరచుకోగలిగారు.


1937 నుంచి తెలుగు ప్రాంతాలలో హరిజనోద్ధరణ, హరిజనుల దేవాలయ ప్రవేశం, ఖాదీ ప్రచారం, మద్యపానాన్ని మాన్పించడం, పాకీ పనివారి సమస్యలు తీర్చడం, భిక్షువుల సమస్య తీర్చడం, హిందూ ముస్లిం ఐక్యత కోసం పాటుపడడం – ఇలా ఎన్నోరకాలుగా శ్రీరాములు కృషి సాగింది. ఇంతే కాకుండా సరళంగా, మంచి వ్యక్తీకరణతో సాగే రచనలు చేయగల సామర్థ్యం కూడా గలిగినవాడు. గుడివాడ నుంచి ఎర్నేని సుబ్రహ్మణ్యం నడిపిన 'దరిద్ర నారాయణ' పత్రికలో పొట్టి శ్రీరాములు స్వతంత్ర రచనలతోపాటు ఆంగ్ల వ్యాసాలకు అనువాదాలు కూడా కనబడతాయి. గాంధీ స్మారక నిధి, ఇంకా కాంగ్రెస్ కమిటీ బాధ్యుడిగా భాష తెలియని ప్రభుత్వం కారణంగా ప్రజా కార్యక్రమాలు సరిగా నిర్వహింపబడటం లేదని గుర్తించి స్వభాషారాష్ట్రం కోసం ఆత్మార్పణకు పూనుకొన్న యోధుడు పొట్టి శ్రీరాములు. సి.రాజగోపాలాచారి వంటి కొందరు నాయకులు కొంత దూరదృష్టితో, ఉదారబుద్ధితో వ్యవహరించి ఉంటే తెలుగువారు పొట్టి శ్రీరాములును కోల్పోయి ఉండేవారు కాదు!

వ్యాసకర్త ఆకాశవాణి పూర్వ సంచాలకులు । మొబైల్: 94407 32392
(నేడు పొట్టి శ్రీరాములు జయంతి)

ధర్మ పక్షం

'నువ్వు లంకలో పుట్టి పెరిగినవాడివి. మా నాన్నకు సాక్షాత్తూ తమ్ముడివి. కొడుకు లాంటి నాకు ద్రోహం చేసేందుకు ఎలా సిద్ధమయ్యావు? నీ బుద్ధి శిథిలమైపోయి, నీకు నువ్వే హాని చేసుకొంటున్నావు. శత్రువు ఎంత గుణవంతుడైనా, స్వపక్షం ఎంత గుణహీనమైనదైనా, మనిషికెప్పుడూ స్వపక్షమే శ్రేయస్కరం. నిర్గుణః స్వజనః శ్రేయాన్, యః పరః పర ఏవ సః! (వాల్మీకి 6–87–15). ఇప్పుడు నిన్ను నెత్తినెక్కించుకొని నీ సహాయంతో నీ స్వపక్షాన్ని నాశనం చేసినవాడు, రేపు తన పని కాగానే నిన్నూ చంపేస్తాడు! తెలుసుకో!'

ఈ మాట అన్నవాడు ఇంద్రజిత్తు. అన్నది పినతండ్రి విభీషణుడితో! లక్ష్మణుడితో తను (తన ఆఖరి) యుద్ధానికి సిద్ధపడుతున్నప్పుడు! పైపైన చూస్తే అతడి వాదంలోనూ కొంత బలం కనిపిస్తుంది. ఇందుకు విభీషణుడు ఇలా బదులిచ్చాడు:



'రాక్షసుడిగా పుట్టినా కూడా నాకు ధర్మం, సద్గుణం, సచ్ఛీలమే ప్రధానం. దారుణమైన అధర్మాన్ని నేను ఏ పక్షంలోనూ సహించలేను. నేను నా అన్నను వదలలేదు. ఆయనే నన్ను తిట్టి తరిమేశాడు. స్వపక్షం వాడు కదా అని ధర్మచ్యుతుడిని సమర్థించడం ముంజేతికి కాలనాగును కట్టుకోవడమే! నా అన్న మూడు తప్పులు చేస్తూ వచ్చాడు. అవి – పరులసొమ్ము హరించడం, పరస్త్రీలతో దుర్వర్తన, హితవు చెప్పే వారిని శత్రువులుగా శంకించి దూరం చేసుకోవడం! ఆయనకున్న ఎన్నో సద్గుణాల కొండలను ఈ దోషాలు కారుమబ్బుల్లా కప్పేశాయి. అవి ఆయన ఐశ్వర్యాన్నీ, జీవితాన్నీ నాశనం చేసి తీరతాయి. యమ పాశాన్ని మీ మెడలకు మీరే బిగించుకొన్నారు'.

స్వపక్షాన్ని సమర్థించ వలసిందే గానీ ధర్మాన్ని అతిక్రమించి కాదు. అధర్మాన్ని ఆశ్రయించిన పక్షానికి వినాశం తప్పదు. దానితో నువ్వూ నాశనం కాకూడదనుకొంటే, ధర్మం వైపు నిలబడమని విభీషణుడి మతం. విభీషణుడు రావణ పక్షాన ఉంటే, రావణుడు రక్షింపబడేవాడు కాదు, విభీషణుడికి కూడా వినాశమే మిగిలేది.

– ఎం. మారుతిశాస్త్రి

క్లుప్తంగా...

ఏప్రిల్ 3 నుంచి తిరుమల శ్రీవారి వసంతోత్సవాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 3న శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామివారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఏప్రిల్ 4న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారు బంగారు రథంపై ఊరేగుతారు. ఏప్రిల్ 5న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటు శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. వసంతోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 4న అష్టదళ పాదపద్మారాధన, ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

శ్రీశైలంలో రికార్డు స్థాయిలో విద్యుదుత్పాదన


కె.సుధీర్‌బాబు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పాదన జరిగిందని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ కె.సుధీర్‌బాబు బుధవారం తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు 1,047 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యం కాగా బుధవారం నాటికి రికార్డు స్థాయిలో 1,869.5 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తికి 321 టీఎంసీల నీటిని వినియోగించామని తెలిపారు. రాష్ట్రానికి నిత్యం 220 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం కాగా.. 40 శాతం జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచే అందిస్తున్నారు. జలాశయ నీటిమట్టం రోజు రోజుకు తగ్గుతుండడంతో ప్రస్తుతం డిమాండ్‌ను అనుసరించి పీక్‌లోడ్ అవర్స్‌లో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

పరీక్ష కేంద్రంలో పురిటి నొప్పులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాలవలస దేవి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షకు హాజరైన గర్భిణి పాలవలస దేవికి పురిటి నొప్పులు వచ్చాయి. పరీక్ష రాస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది అప్రమత్తమై పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. దేవికి వివాహమై మూడేళ్లు పూర్తయింది. ఆమె డిగ్రీ విద్యను పూర్తి చేసినప్పటికీ, ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్ ఒకేషనల్ (వెటర్నరీ) విద్యను అభ్యసిస్తూ పరీక్షకు హాజరైంది.

చంద్రబోస్, రామ్‌చరణ్‌లకు 'ఆప్త' అభినందనలు



అమరావతి: ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని 'నాటు.. నాటు' పాట ద్వారా ప్రపంచ సినీ అత్యున్నత పురస్కారం 'ఆస్కార్' అందుకున్న సందర్భంగా గేయ రచయిత చంద్రబోస్‌కు, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌కు, చిత్ర యూనిట్‌కు అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్ కొట్టె శుభాకాంక్షలు తెలిపారు. లాస్‌ఏంజిల్స్‌లో రామ్‌చరణ్‌ను బుధవారం కలిసిన ఉదయ్‌భాస్కర్ ఆప్త తరఫున అభినందనలు తెలిపారు. కాగా, అమెరికా పర్యటనలో భాగంగా అట్లాంటా విచ్చేసిన చంద్రబోస్‌కు ఆప్త అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్, సభ్యులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. తెలుగు ప్రజలే కాకుండా ప్రతి భారతీయుడి కలను చంద్రబోస్ నెరవేర్చారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 3 వరకు అట్లాంటాలో జరగనున్న 'ఆప్త' 15 వసంతాల కన్వెన్షన్‌కు చంద్రబోస్‌ను ఆహ్వానించారు. కన్వెన్షన్‌కు హాజరయ్యేందుకు చంద్రబోస్ అంగీకరించారని ఆప్త ప్రతినిధి చంద్రశేఖర్ పోలిశెట్టి మీడియాకు తెలిపారు.

ఐదోసారీ జనరంజకమే

రూ.2.79 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్

- నేడు అసెంబ్లీలో 2023–24 బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిమంత్రి బుగ్గన
- ఉదయం 8 గంటలకు సీఎం జగన్ అధ్యక్షతన కేబినెట్ భేటీలో ఆమోదం
- మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ జెండర్ బేస్డ్ బడ్జెట్
- మహిళలు, పిల్లల కోసం ప్రత్యేకంగా కేటాయింపులు
- వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమం, పేదల ఇళ్లకు పెద్దపీట



సాక్షి, అమరావతి: వరుసగా ఐదో దఫా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నవరత్నాల పథకాలు అమలు కొనసాగిస్తూ అన్ని వర్గాలకు అండగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం 2023–24 వార్షిక బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. ఈ ఏడాది కూడా మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జెండర్ బేస్డ్ బడ్జెట్ సిద్ధం చేసింది. రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం నుంచి పన్నుల వాటా రూపంలో వచ్చే నిధులను వాస్తవ రూపంలో బేరీజు వేస్తూ వార్షిక బడ్జెట్ రూపొందించారు. కేంద్రం నుంచి పన్నుల వాటా రూపంలో రూ.41.388 కోట్లు రానున్నాయి. మొత్తం మీద 2023 – 24 వార్షిక బడ్జెట్ రూ.2.79 లక్షల కోట్లుగా ఉండనుందని అంచనా.

నేటి ఉదయం మంత్రిమండలి ఆమోదం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఐదో బడ్జెట్ జనరంజకంగా ఉండనుంది. ఉదయం 8 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. అనంతరం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2023–24 వార్షిక బడ్జెట్‌ను ఉదయం 10 గంటలకు అసెంబ్లీకి సమర్పించనున్నారు. ఇదే సమయంలో శాసన మండలిలో డిప్యూటీ ముఖ్యమంత్రి అంజాద్ బాషా బడ్జెట్‌ను చదవనున్నారు. వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తయిన వెంటనే ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్‌ను వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అసెంబ్లీలో చదవనున్నారు. అదే సమయానికి మండలిలో వ్యవసాయ బడ్జెట్‌ను పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చదవనున్నారు.

నవరత్న భరితంగా బడ్జెట్..

నవరత్నాలను ప్రతిబింబించేలా బడ్జెట్‌ను తీర్చిదిద్దారు. వృథా, దుబారా, ఆర్భాటపు వ్యయాలకు తావు లేకుండా అందరి సంక్షేమం, అన్ని రంగాల అభివృద్ధిని సమ్మిళితం చేస్తూ ఆయా రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, పేదల గృహాలతో పాటు వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ పథకాలకు తగినన్ని కేటాయింపులు చేయనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు ఉండనున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉప ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందించారు. మహిళలు, పిల్లల కోసం ప్రత్యేకంగా కేటాయింపులు చేయనున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా కోసం సబ్సిడీకి తగినన్ని నిధులు కేటాయించనున్నారు.

విశాఖ నుంచి పరిపాలన హర్షణీయం

- 890వ రోజు రిలే దీక్షలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


రిలే నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: విశాఖ వేదికగా పరిపాలన సాగిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్ భేటీలో ప్రకటించడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 890వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. అభివృద్ధికి వికేంద్రీకరణ చక్కని మార్గమని నాడు రాజ్యాంగం సాక్షిగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సూచించారన్నారు. మూడు రాజధానులకు రాష్ట్ర ప్రజలంతా జేజేలు పలుకుతున్నారని చెప్పారు. ఏపీలో కులవాదంతో అధికారం కోసం ఓ సామాజిక వర్గం పడరాని పాట్లు పడుతూ ఎల్లో మీడియాని, పవన్‌కళ్యాణ్‌ను అడ్డుపెట్టుకుని తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ సమావేశాల నుంచి తిరుగు ప్రయాణంలో మూడు రాజధానుల దీక్షా శిబిరం వద్ద తన వాహన శ్రేణిని వేగం తగ్గించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుజన పరిరక్షణ సమితి నాయకులకు అభివాదం చేశారు. వికేంద్రీకరణకు తొలి అడుగులు వేసిన జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విద్యా విధానం అమల్లోకి రావాలి

- ఏఎన్‌యూ అకడమిక్ ఎగ్జిబిషన్‌లో సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ

ఏఎన్‌యూ: కృత్రిమ మేధస్సు ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం వినియోగించుకుంటున్నాం అనుకోవచ్చు గానీ, ఇది చాలా ప్రమాదకరమని సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరుగుతున్న అకడమిక్ ఎగ్జిబిషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిదానికీ సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడటం వల్ల మనిషి మేధస్సు కూడా వికసించడంలేదన్నారు. ఒక వ్యక్తి ఏదైన విషయాన్ని మరొకరికి చెబితే.. ఆ వ్యక్తి వెంటనే దానిని నమ్మడంలేదని, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిర్ధారించుకున్నాకే నమ్ముతున్నాడని చెప్పారు. హార్డ్ వర్క్ చేసే వారికంటే స్మార్ట్ వర్క్ చేసే వారే ఎక్కువ ప్రయోజనం పొందగలుగుతారని తెలిపారు. విద్యాపరమైన కోర్సులకు నిర్దిష్ట కాలపరిమితి ఉండటం సరికాదని.. చదివే వ్యక్తి మేధస్సు, నైపుణ్యం ఆధారంగా వారు ఎంత తొందరగా కోర్సు పూర్తి చేస్తే అంత తొందరగా వారికి డిగ్రీ ఇచ్చే వ్యక్తిగత విద్యా విధానం అమల్లోకి రావాలన్నారు. తాను ఇంజినీరింగ్ చదివినప్పుడు సిద్ధార్థ కళాశాల ఏఎన్‌యూ అనుబంధంగా ఉండేదని, ఏఎన్‌యూకి నేడు అతిథిగా రావడం, తన బీటెక్ డిగ్రీ సర్టిఫికెట్‌ను ఈ రోజు వేదికపై అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. వీసీ ఆచార్య రాజశేఖర్ బీటెక్ డిగ్రీని రామ్‌గోపాల్‌వర్మకు అందించారు.


రామ్‌గోపాల్‌వర్మకు డిగ్రీ అందజేస్తున్న వీసీ రాజశేఖర్

28న విజయవాడలో కోటి రుద్రాక్షలతో అభిషేకం

- ఆలయ గౌరవాధ్యక్షుడు, ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి
- విశాఖ శ్రీశారదాపీఠంలో పోస్టర్ ఆవిష్కరణ

సింహాచలం: విజయవాడ నగరం ముత్యాలంపాడులో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 28న కోటి రుద్రాక్షలతో అభిషేకం, అర్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు, ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. విశాఖ శ్రీశారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారిని బుధవారం ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. కోటి రుద్రాక్షల అభిషేకం కార్యక్రమంలో పాల్గొనాలని స్వామిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా కోటి రుద్రాక్షలతో అభిషేకం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ నేపాల్ నుంచి ప్రత్యేకంగా కోటి రుద్రాక్షలు తెప్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రారంభిస్తారని చెప్పారు. 200 మంది రుత్వికులు పాల్గొననున్నారని తెలిపారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంబంధించి పాటలు రచించి, పాడటం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, చిత్రంలో గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్

నా సినిమాల జోలికొస్తే మూడో కన్ను తెరుస్తా

- పునరావృతం కాకుండా చూసుకోండి
- నరసరావుపేట ఎమ్మెల్యేపై పరోక్షంగా బాలకృష్ణ ఆగ్రహం
- ఎన్టీఆర్ శతాబ్ది చలన చిత్ర పురస్కారాల సభలో హెచ్చరిక
- మహానటి సావిత్రి, ప్రముఖ నిర్మాత బి.నాగిరెడ్డికి అవార్డుల ప్రదానం


సభలో ప్రసంగిస్తున్న నందమూరి బాలకృష్ణ, చిత్రంలో సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి, బి.నాగిరెడ్డి కుమారుడు విశ్వనాథరెడ్డి తదితరులు

తెనాలి: 'సినిమా నా ఊపిరి. సినిమా, రాజకీయం నాకు రెండు కళ్లు. నరసరావుపేటలో బాలకృష్ణ పాట వేశారని అభ్యంతరం పెట్టారట.. జాగ్రత్త..' అంటూ ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హెచ్చరించారు. బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలో పెమ్మసాని థియేటరులో జరిగిన ఎన్టీఆర్ శత జయంతి చలన చిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగిస్తుండగా, పక్కనే ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెవిలో నరసరావుపేట అంటూ ఏదో చెప్పారు. వెంటనే బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'నరసరావుపేటలో బాలకృష్ణ పాట ఎందుకు వేస్తారని అన్నారట.. జాగ్రత్త.. ఒకసారి నేను మూడోకన్ను తెరిచానో.. పొలిటీషియన్‌గా నాపై రండి.. నేను రెడీ. సినిమా జోలికొస్తే.. మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోండి' అంటూ హెచ్చరించారు. పరోక్షంగా నరసరావుపేట ఎమ్మెల్యేనుద్దేశించి బాలకృష్ణ ఈ హెచ్చరిక చేసినట్లు భావిస్తున్నారు.

ఎన్టీఆర్ సినిమాల వల్లే భాష, భక్తి బతికి ఉన్నాయి

ఎన్టీఆర్ సినిమాల వల్లే ఇప్పటికీ సమాజంలో భాష, భక్తి బతికి ఉన్నాయని బాలకృష్ణ చెప్పారు. తెలుగు సినిమాకు స్టార్‌డమ్ తీసుకొచ్చిన ఏకైక నటుడు ఎన్టీఆర్ అని, ఆయన నటించిన పాతాళభైరవి తొలి పాన్ ఇండియా సినిమా అని అన్నారు. పాతాళభైరవి, పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర, సమరసింహారెడ్డి చిత్రాలకు నేటి సినిమాలు దరిదాపుల్లోకి కూడా రావన్నారు. నటన, వ్యక్తిత్వం, క్రమశిక్షణతో ఎన్టీఆర్, సావిత్రి సినీ పరిశ్రమలో చెరగని ముద్ర వేశారని చెప్పారు. మహానటి సావిత్రి, ప్రముఖ నిర్మాత బి.నాగిరెడ్డికి ప్రకటించిన ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాలను వారి వారసులు విజయ చాముండేశ్వరి, బి.విశ్వనాథరెడ్డి అందుకున్నారు.

బాలయ్యా.. నోరుపారేసుకోవద్దు

నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ నోరుపారేసుకుంటున్నారని నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదన్నారు. 'మహా శివరాత్రికి కోటప్పకొండలో ప్రభలు కట్టడం ఆనవాయితీ. భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ప్రజల నుంచి చందాలు వసూలు చేసి ప్రభ కట్టి తాగి తందానాలాడి దానిని కోటప్ప కొండకు తీసుకువెళ్లకుండానే మధ్యలో ఆపేసి ప్రజలకు అసౌకర్యం కలిగించారు. దీనికి బాలకృష్ణ వార్నింగ్ ఇచ్చినట్టుగా మాట్లాడటం పద్ధతి కాదు' అని చెప్పారు.

వినియోగదారుల హక్కుల రక్షణే లక్ష్యం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: వినియోగదారుల హక్కుల పరిరక్షణతో పాటు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామన్నారు. నిబంధనలను పాటించకుండా విక్రయాలు సాగిస్తున్న నగర, పట్టణ ప్రాంతాల్లోని మాల్స్, పెట్రోల్ బంకులు, బంగారం దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో దేశంలోనే తొలిసారిగా ఏపీలో రాష్ట్రస్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సైతం ఏపీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రశంసిస్తూ ఇతర రాష్ట్రాల్లోనూ ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ సునీల్‌చౌదరి మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి 17 జిల్లా వినియోగదారుల ఫోరాలు పనిచేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత, కలెక్టర్ ఢిల్లీ రావు, లీగల్ మెట్రాలజీ జాయింట్ కమిషనర్ రామకుమార్ మాట్లాడారు.

జైళ్లలో సంస్కరణలపై కేంద్రానికి నివేదిక

- రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాస్
- ముగిసిన 7 రాష్ట్రాల జైళ్ల శాఖ అధికారుల సదస్సు

ఆరిలోవ(విశాఖ తూర్పు): జాతీయ కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై నివేదిక సిద్ధం చేసి, కేంద్ర హోం శాఖకు పంపిస్తామని ఏపీ జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇండ్ల శ్రీనివాస్ అన్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో మూడు రోజుల పాటు జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్ బుధవారం ముగిసింది. 'స్టేక్ హోల్డర్స్ కో–ఆర్డినేషన్ అండ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్' అనే అంశంపై జైళ్లశాఖ అధికారులకు అవగాహన కోసం శిక్షణ తరగతులు నిర్వహించారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌ను ఏపీ జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇండ్ల శ్రీనివాస్ ప్రారంభం నుంచి ముగింపు వరకు పర్యవేక్షించారు. ఆంధ్ర రాష్ట్ర జైళ్ల శాఖ అధికారులతో పాటు తెలంగాణ, మేఘాలయ, కర్ణాటక, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన 21 మంది జైళ్ల శాఖ అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఐజీ ఇండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉన్న జైళ్ల అభివృద్ధికి, కొత్త సంస్కరణలు అమలు చేయడానికి వీలుపడుతుందన్నారు. విశాఖ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ రాష్ట్రాల జైళ్లకు చెందిన సూపరింటెండెంట్లు, జైలర్లు పాల్గొన్నారు.

మహిళల్ని యజమానులుగా గుర్తించిన ఏపీ ప్రభుత్వం

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి


కోవి ఇండియా ఎక్సలెన్స్ అవార్డ్స్–2023 అందుకున్న మహిళలతో సజ్జల

భవానీపురం (విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతిగా నిలిచారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోవి (గేరింగ్ ఉమెన్ పవర్) ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో భవానీపురంలోని బెరంపార్క్‌లో బుధవారం నిర్వహించిన కోవి ఇండియ ఎక్సలెన్స్ అవార్డ్స్–2023 ప్రదానం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమ్మ ఒడి, చేయూత పథకాలకు సంబంధించిన సొమ్మును మహిళల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేయడం ద్వారా వారిని గృహ యజమానురాలుగా ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. ఒకవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు 50 శాతం నామినేటెడ్ పదవులు కేటాయించడంతోపాటు మరోవైపు రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల స్థలాలను మహిళల పేరిట ఇవ్వడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. దాదాపు కోటి మంది డ్వాక్రా మహిళలు బ్యాంక్ రుణాలను తీసుకుని స్వశక్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ డాక్టర్ జి.సృజన, ఏపీఎస్ఈఆర్ఎంసీ వైస్ చైర్‌పర్సన్ విజయ శారదరెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి, ఏపీటీడీసీ చైర్మన్ ఆరిమండ వరప్రసాదరెడ్డి, మధు త్యాగి, సౌదామిని, కోవి ఏపీ చాప్టర్ అధ్యక్ష, కార్యదర్శులు రాధిక, అపర్ణ పాల్గొన్నారు.

ఏపీ సీఎం పీఏనంటూ ముంబైలో మోసాలు

- వ్యాపారులకు రంజీ మాజీ ప్లేయర్ టోకరా
- మ్యాచ్‌లకు స్పాన్సర్‌షిప్ అంటూ మోసాలు
- బుడుమూరి నాగరాజును అరెస్టు చేసిన ముంబై పోలీసులు
- గతంలో తెలంగాణ మంత్రి కేటీఆర్ పీఏ అంటూ మోసాలు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా నమ్మించి మహారాష్ట్రకు చెందిన వ్యాపారులకు టోకరా వేస్తున్న క్రికెట్ రంజీ మాజీ ప్లేయర్ బుడుమూరు నాగరాజును ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతను నేషనల్ క్రికెట్ ఆకాడెమీ పేరుతోను, ప్రముఖుల పీఏనంటూ పలువురు ప్రముఖులను మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. గతంలో తెలంగాణ మంత్రి కేటీఆర్ పీఏనంటూ ఇలాంటి మోసాలకే పాల్పడి హైదరాబాద్ పోలీసులకు చిక్కాడు. ఇతనిపై ముంబై, హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 30కి పైగా కేసులు ఉన్నాయి.

హైటెక్ పంథాలో..

శ్రీకాకుళానికి చెందిన నాగరాజు తన మోసాలకు ట్రూ కాలర్ యాప్, వాట్సాప్‌లను వినియోగించుకున్నాడు. ట్రూకాలర్‌లో తన నంబర్‌ను ప్రముఖుల పీఏల పేరుతో ఎంటర్ చేస్తాడు. ప్రముఖుల ఫొటోలను వాట్సాప్‌కు డీపీగా పెట్టుకుంటాడు. ఇదే విధంగా ముంబైలో ఎలక్ట్రానిక్ షాపులు నిర్వహించే సంస్థ యజమానికి ఏపీ సీఎం జగన్ ఫొటోను డీపీగా పెట్టుకున్న వాట్సాప్ నంబర్‌తో సందేశం పంపాడు. తాను సీఎం జగన్ వ్యక్తిగత సహాయకుడినని, ఓ క్రికెట్ మ్యాచ్‌కు స్పాన్సర్‌గా ఉండాలని కోరాడు. వాయిస్ ఫిషింగ్ టెక్నాలజీతో మారు గొంతుతో మాట్లాడాడు. నిజమని నమ్మిన ఆ సంస్థ యజమాని రూ.12 లక్షలు చెల్లించారు. అయితే, మ్యాచ్‌ల ఊసే లేకపోవడంతో మోసపోయానని గ్రహించి జనవరి 13న ముంబై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగరాజు పేరుతో ఉన్న సిమ్‌కార్డు, గుర్తింపు పత్రాల ఆధారంగా ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం నాగరాజును హైదరాబాద్‌లో అరెస్టు చేసి తీసుకువెళ్లారు. ఇతని బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.7.66 లక్షలు ఫ్రీజ్ చేశారు.

అప్పట్లో ఆత్మవిశ్వాసానికి ప్రతీక

మధ్యతరగతి కుటుంబానికి చెందిన నాగరాజు ఎంబీఏ చదివాడు. మంచి క్రికెట్ ఆటగాడు. 2006లో విశాఖ స్టీల్ ప్లాంట్ జోన్ జట్టుకు, నార్త్ జోన్ జట్టులో ఆడాడు. 2009లో రాష్ట్ర (ఉమ్మడి) స్థాయిలో అండర్–19 కేటగిరీలో ఆడాడు. ఆ తర్వాతి ఏడాది స్టేట్ సౌత్ జోన్‌కు ఎంపికయ్యాడు. గోవా జట్టుతో ఆడుతున్న సమయంలో నాగరాజు ముక్కుకు తీవ్ర గాయమైంది. దీంతో రెండేళ్లు క్రికెట్‌కు దూరమైనా, కుంగిపోలేదు. ఆత్మవిశ్వాసంతో ప్రాక్టీస్ చేసి ఎయిర్ ఇండియా జట్టుకు ఎంపికయ్యాడు. ఓ మ్యాచ్‌లో 52 బంతుల్లో 106 పరుగులు చేశాడు. దీంతో 2014లో ఆంధ్రా రంజీ జట్టుకు ఎంపికయ్యాడు. క్రికెట్‌పై ఉన్న మక్కువ అతన్ని బెట్టింగ్స్ వైపు నడిపించింది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాసి నష్టపోయాడు. దీంతో డబ్బు కోసం మోసాలు మొదలెట్టాడు. చివరకు కటకటాలపాలయ్యాడు.

భద్రాద్రి రామయ్యకి పుష్కర పట్టాభిషేకం

పుణ్య నదీ, సముద్ర, పుష్కరిణీ జలాలతో
ఈనెల 31న త్రేతాయుగం నాటి క్రతువు

భద్రాచలం: త్రేతాయుగంలో జగదభిరాముడికి మహా పట్టాభిషేకం రోజున నిర్వహించిన క్రతువును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఈనెల 31న జరపనున్నారు. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి మరుసటి రోజున పట్టాభిషేకం, 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కర పట్టాభిషేకం నిర్వహిస్తుండటం ఆనవాయితీనే. అయితే ఈ ఏడాది జరిగే పుష్కర పట్టాభిషేకానికి గతంలో ఎన్నడూ లేని విధంగా దేశ నలుమూలల్లో ఉన్న సముద్రాలు, నదులు, పుష్కరిణుల నుంచి పవిత్ర జలాలను సేకరిస్తున్నారు. ఈ జలాలతో శ్రీ సీతాలక్ష్మణసమేతుడైన రామచంద్రస్వామికి మిథిలా స్టేడియంలోని వేదికపై పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించేందుకు వైదిక కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. త్రేతాయుగంలో శ్రీరాముడికి వశిష్ఠ మహర్షి పురోహితుడిగా వ్యవహరించి పట్టాభిషేక మహోత్సవం జరిపినట్లు రామాయణ ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది. అరణ్యవాసం పూర్తి చేసుకున్న తర్వాత జరిగిన ఈ మహా పట్టాభిషేకోత్సవానికి వానర వీరులు దేశంలోని నాలుగు దిక్కుల్లో ఉన్న సముద్రాల జలాలను రాజ్యానికి తీసుకొచ్చినట్లు పండితులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

తుర్కియేలో వరద బీభత్సం

14 మంది మృతి

అంకారా: ప్రకృతి ప్రకోపంతో తుర్కియే వణికిపోతోంది. వేలాది మందిని బలిగొన్న భీకర భూకంప ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న తుర్కియేలో వరదలు ముంచెత్తుతున్నాయి. అదియమాన్, సాన్లీయుర్ఫా ప్రావిన్స్‌లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరదల వల్ల ఇప్పటిదాకా 14 మంది మృతిచెందారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. కనీసం ఇద్దరు కనిపించకుండాపోయారని తెలియజేశాయి.

ఊపిరాడక ఐదుగురి మృతి

ఛత్తీస్‌గఢ్‌లో ఇటుక బట్టీ వద్ద విషాదం

రాయ్‌పూర్: ఇటుకలు కాల్చేందుకు రాజేసిన అగ్గి చివరకు వారి ప్రాణాలమీదకు తెచ్చింది. ఇటుక బట్టీ వద్ద ఐదుగురు కార్మికులు ఊపిరి ఆడక మరణించిన దుర్ఘటన ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాసముంద్ జిల్లాలోని గంధ్‌పూలీగఢ్ గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఒక ఇటుకల బట్టీ కర్మాగారం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి ఎండిన బురదమట్టి ఇటుకలను క్రమపద్ధతిలో పేర్చి వాటి అంతర్భాగంలో నిప్పుపెట్టి పైభాగంలో ఆరుగురు కార్మికులు నిద్రించారు. మిగతా కార్మికులు ఉదయం బట్టీ దగ్గరకు వచ్చేసరికి ఆ ఆరుగురు చలనం లేకుండా పడిఉన్నారు. హుటాహుటిన వారిని ఆస్పత్రికి తరలించగా ఐదుగురు అంతకుముందే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. విషపు పొగ పీల్చడంతో ఊపిరాడక మరణించారని భావిస్తున్నారు.

ఆరు కేంద్ర సాయుధ బలగాల్లో 84,866 ఖాళీలు

న్యూఢిల్లీ: కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం, సరిహద్దు భద్రతా దళం వంటి ఆరు కేంద్ర సాయుధ బలగాల్లో మొత్తంగా 84,866 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మొత్తం బలగాల గరిష్ట నియామకాల పరిమితి 10,05,520 కాగా వాటిలో కేవలం 84,866 పోస్టులే భర్తీ చేయాల్సి ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ బుధవారం రాజ్యసభలో చెప్పారు. వీటిలో గత 5 నెలల్లో 31 వేలకు పైగా సిబ్బందిని భర్తీ చేశామన్నారు. 2023 జనవరి 1 నాటికి సీఆర్‌పీఎఫ్‌లో 29వేలకుపైగా, బీఎస్‌ఎఫ్‌లో 19వేలకుపైగా, సీఐఎస్‌ఎఫ్‌లో 19వేలకుపైగా, సశస్త్ర సీమాబల్‌లో 8వేలకు పైగా, ఐటీబీపీలో 4వేలకుపైగా, అస్సాం రైఫిల్స్‌లో 3,000 పైగా ఖాళీలున్నాయి. కేంద్ర బలగాల్లో 247 డాకర్లు, 2,354 నర్సులు, ఇతర వైద్య వృత్తుల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నట్లు రాయ్ తెలిపారు.

మంచుకొండల్లో మహాముప్పు

జోషిమఠ్ కుంగుబాటుకు మించి పొంచి ఉన్న ప్రమాదాలు

భూకంపాలు, కొండచరియలు, అవలాంచ్‌ల ముప్పు

చైనా, భారత్ హిమాలయాల్లో సాగిస్తున్న నిర్మాణాలే కారణమంటున్న నిపుణులు

తక్షణం అడ్డుకట్ట వేయకుంటే పెనుముప్పే



అందమైన మంచుకొండలైన హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఉత్తరాఖండ్‌లో జోషిమఠ్ కుంగిపోవడం కంటే మించిన విధ్వంసాలు ఎదురుకానున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. హిమానీ నదాలు కరిగిపోవడం, సరస్సులు మాయమవడం, శాశ్వత మంచు ప్రాంతాలపై ప్రభావం పడడం వంటి విపత్తులు ఎదురు కానున్నాయి. దీనికి ముఖ్య కారణం వాతావరణంలో వస్తున్న మార్పులు కాదు, భారత్, చైనా పోటాపోటీగా హిమాలయాల్లో నిర్మాణాలు సాగించడం కూడా ప్రధాన కారణమవుతోంది..వాణిజ్య అవసరాలు, సైనిక అవసరాల కోసం రెండు దేశాలు హిమాలయాల్లో కొండల్ని తొలుస్తున్నారు. రైల్వే ట్రాకులు, రహదారులు నిర్మిస్తున్నారు. సొరంగాలను తవ్వుతున్నారు. హిమాలయాలకి రెండు వైపులా ఈ కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతూ ఉండడం పెను ప్రమాదానికి దారి తీయబోతోందన్న ఆందోళనలు ఎక్కువైపోతున్నాయి. 2020లో గల్వాన్‌లో ఘర్షణల తర్వాత ఇరు దేశాలు సైనిక అవసరాల కోసం హిమాలయాల వెంబడి వంతెనలు, ఔట్‌పోస్టులు, హెలిప్యాడ్‌లు విస్తృతంగా నిర్మిస్తున్నాయి. చైనా ఏకంగా చిన్న చిన్న నగరాలనే కట్టేస్తున్నట్టు ఉపగ్రహఛాయాచిత్రాల ద్వారా వెల్లడవుతోంది.

ఎల్‌ఏసీ వెంట అధిక ముప్పు..

భారత్, చైనా మధ్య 3,500 కి.మీ. పొడవునున్న వాస్తవాధీన రేఖ వెంబడి ముప్పు అధికంగా ఉందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఎన్‌హెచ్‌–7 జాతీయ రహదారిపై ప్రతీ కిలోమీటర్‌కి ఒక కొండచరియ విరిగిపడి రహదారులు మూతపడడం సర్వసాధారణంగా మారింది. ''భారత్‌లోని హిమాలయాల్లో ఉత్తరాఖండ్‌లోనూ, అటు చైనా వైపు హిమాలయాల్లోనూ అత్యధిక ముప్పు పొంచి ఉంది. మౌలిక సదుపాయాల పేరిట చేపడుతున్న కార్యక్రమాలు శాశ్వత మంచు పర్వతాలను సైతం కుదేలు చేసే రోజులొచ్చేస్తున్నాయి. అవలాంచ్‌లు (హిమ ఉత్పాతం), కొండచరియలు విరిగిపడడం, భూకంపాలు అత్యంత సాధారణంగా మారతాయి''అని క్రయోస్ఫియర్ జర్నల్ ఒక నివేదికలో వెల్లడించింది.

చైనా నిర్మాణాలు

టిబెట్ పీఠభూమిలో

- 9,400 కి.మీ. మేరకు రోడ్డు నిర్మాణం.
- 580 కి.మీ. పొడవున రైల్వేలు చెంగ్డూ నుంచి లాసా వరకు రైల్వే నిర్మాణం
- సముద్రానికి 13 వేల అడుగుల ఎత్తులో పూర్తిగా మంచుతో నిండి ఉన్న 21 పర్వతాల మీదుగా 14 అతి పెద్ద నదుల్ని దాటుకుంటూ సియాచిన్–టిబెట్ రైల్వే లైన్ నిర్మాణం
- 2,600 కి.మీ. పొడవున విద్యుత్ లైన్‌లు
- వేలాది సంఖ్యలో భవనాలు
- అస్సాంలో బ్రహ్మపుత్ర నది నుంచి ఉత్తర చైనాకు నీటిని మళ్లించడానికి డ్యామ్‌లు
- 2050 నాటికి మంచుకొండల్లో 38.14%రోడ్లు, 38.76% రైల్వేలు
- 39.41% విద్యుత్ లైన్లు, 20.94% భవనాలే కనిపిస్తాయి.
- సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం 624 భవనాల నిర్మాణం



చైనాలో ఓ ప్రాజెక్ట్ వద్ద..

నేపాల్ వైపు

- చైనా బెల్ట్ అండ్ ఓడ్ ఇనీషియేటివ్ కింద రాసువగాఢి హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు
- ఉద్యాన వనాలు
- హైడ్రోపవర్ ప్రాజెక్టులు
- 240 కోట్ల డాలర్ల విలు వైన ప్రాజెక్టులు
- పాంగాంగ్ సరస్సుపై సైనిక అవసరాల కోసం వంతెన

ఎలాంటి ప్రభావం చూపిస్తుంది ?

అరుణాచల్ ప్రదేశ్, సిక్కిమ్ రాష్ట్రాల్లో వర్షాకాలాలు బీభత్సంగా మారనున్నాయి.

సింధు నదికి సమీపంలో చిలాస్‌లో డ్యామ్‌లు కట్టడంతో ఒక నెలలో దాని పరిసర ప్రాంతంలో 300 సార్లు భూకంపం సంభవించింది. సరిగ్గా అలాంటి ముప్పే హిమాలయాల్లో కూడా జరిగే అవకాశం ఉంది.

అవలాంచ్‌లు ముంచెత్తి సరస్సులు విస్ఫోటనం చెందుతాయి

కొండచరియలు విరిగిపడి నిర్మాణంలో ఉన్నవన్నీ కూడా ధ్వంసమయ్యే ప్రమాదముంది. టిబెట్‌లోని బొమి ప్రాంతంలో దశాబ్దాల క్రితం కట్టిన వంతెనలు, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలన్నీ కొండచరియలు విరిగిపడి ధ్వంసమయ్యాయి.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవన్నీ పూర్తవకుండానే భూకంపాలు, కొండచరియలు, అలవాంచ్‌లతో అవన్నీ ధ్వంసమయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయని, మరింత ప్రమాదంలోకి హిమాలయాలు వెళ్లిపోయాయని ఓల్లో యూనివర్సిటీ ప్రొఫెసర్ అంద్రూస్ కాబ్ అంచనా వేస్తున్నారు.

భారత్‌లో 23 హిమానీనదాలతో అత్యంత ప్రమాదముందని నిపుణులు గుర్తించారు.

భారత్‌లో కొండచరియలు విరిగిపడే ప్రమాదాల్లో 85% హిమాలయాల్లోనే సంభవిస్తున్నాయి. కొండచరియలు ముప్పు కలిగిన టాప్–5 దేశాల్లో చైనా, భారత్‌లు ఉన్నాయి.

హిమాలయాల్లో ఉన్న హిమానీ నదాలు 2035 నాటికి మాయమైపోయే ఛాన్స్ ఉంది.

భారత్ నిర్మాణాలు

- హిమాలయాల్లో 30 అతి పెద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టులు
- అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిమ్‌లలో వాయువేగంతో సాగుతున్న హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణాలు
- 900 కి.మీ. పొడవునా గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బదరీనాథ్‌లను కలిపేలా చార్‌ధామ్ ప్రాజెక్టు
- 283 కి.మీ. పొడవునా నిమ్ము–పదమ్–దర్చా (ఎన్‌పీడీ)హైవే



హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్

- చైనాతో వివాదంలో ఉన్న 3,500 కి.మీ. సరిహద్దుల పొడవునా రోడ్లు, టన్నెల్స్, వంతెనలు, ఎయిర్‌ఫీల్డ్స్, హెలిప్యాడ్స్ నిర్మాణం
- చైనాతో వ్యూహాత్మకంగా ప్రాధాన్యం కలిగిన 73 ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం

– సాక్షి, నేషనల్ డెస్క్

34 మంది జలసమాధి

మడగాస్కర్ తీర ప్రాంతంలో విషాదం

అంటనానారివో(మడగాస్కర్): బతుకుదెరువు కోసం సముద్రమార్గంలో విదేశానికి వలసవెళ్తున్న శరణార్థులు ప్రమాదవశాత్తు జలసమాధి అయ్యారు. శనివారం రాత్రి వాయవ్య మడగాస్కర్ తీరం దగ్గర్లోని హిందూ సముద్రజలాల్లో జరిగిన ఈ దుర్ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మడగాస్కర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఫ్రాన్స్ అధీనంలోని మయోటీ ద్వీపానికి చేరుకునేందుకు మడగాస్కర్ దేశంలోని అంబిలోబే, టమతమే, మజుంగా ప్రాంతాలకు చెందిన 58 మంది శరణార్థులు ఒక పడవలో బయల్దేరారు. మార్గమధ్యంలో నోసీ బే అనే ద్వీపం సమీపంలో హిందూ సముద్రజలాల్లో పడవ మునిగింది. ఈ ప్రమాదంలో నీట మునిగిన 34 మంది మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. 24 మందిని అక్కడి మత్స్యకారులు కాపాడారు. మయోటీ అనేది పేదరికం కనిపించే చిన్న ద్వీపాల సముదాయం. అంతకుమించిన నిరుపేదరికంతో మగ్గిపోతున్న మడగాస్కర్‌లో కంటే మయోటీలో జీవనం కాస్త మెరుగ్గా ఉంటుందని శరణార్థులు అక్కడికి వలసపోతుంటారని అధికారులు చెప్పారు.

మూడేళ్లలో రూ.2,430 కోట్లు


న్యూఢిల్లీ: గత మూడేళ్లకాలంలో భారతీయ ఎన్‌జీవో సంస్థలు విదేశాల నుంచి విరాళాల రూపంలో రూ.2,430.80 కోట్లను స్వీకరించాయని కేంద్రం వెల్లడించింది. బుధవారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ వివరాలు చెప్పారు. 2019–20లో రూ.727.1 కోట్లు, 2020–21కాలంలో రూ.798.1 కోట్లు, 2021–22కాలంలో రూ.905.5 కోట్ల విరాళాలు పొందాయని పేర్కొన్నారు. ఈ నెల పదోతేదీ నాటికి దేశవ్యాప్తంగా 16,383 ఎన్‌జీవో సంస్థలు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయని తెలిపారు. వీటిలో దాదాపు 15వేల సంస్థలు 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తమ వార్షిక నివేదికలను సమర్పించాయి. కొన్ని సంస్థల నిధుల దుర్వినియోగం/నిధుల మళ్లింపుపై ఫిర్యాదుల నేపథ్యంలో చర్యల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.



మన సూర్యుడికంటే 30 రెట్లు పెద్దదైన నక్షత్రం ఇది. పేరు డబ్ల్యూఆర్ 124. మరికొన్ని లక్షల ఏళ్లలో ఇది బద్దలుకాబోతోంది. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ తీసిన తాజా చిత్రమిది.

అదానీపై విచారణ డిమాండ్‌తో... ఈడీ ఆఫీసుకు విపక్షాల ర్యాలీ

పాల్గొన్న 18 పార్టీల ఎంపీలు ● మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు



పార్లమెంట్ నుంచి ఈడీ ఆఫీస్‌కు ర్యాలీగా వస్తున్న విపక్ష పార్టీల ఎంపీలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు అవకతవకలపై ఈడీతో లోతుగా దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తూ విపక్ష పార్టీలు సమైక్యంగా కదం తొక్కాయి. ఈ ఉదంతంపై ఈడీకి ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో పాటు 18 విపక్ష పార్టీల ఎంపీలు బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలో పార్లమెంటు భవనం నుంచి ఈడీ ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా బయల్దేరారు. ఈడీ కార్యాలయానికి వెళ్తున్న ఎంపీలను మార్గమధ్యంలోనే విజయ్ చౌక్ సమీపంలో పోలీసులు అడ్డుకుని ముందుకు వెళ్లకుండా నిలువరించారు. బారికేడ్లతో రోడ్లను మూసేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ర్యాలీని అనుమతించబోమని చెప్పారు. దీనిపై నేతలంతా మండిపడ్డారు. అదానీపై విచారణ కోరుతూ ఈడీకి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే మోదీ సర్కారు నిరంకుశంగా అడ్డుకుందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు. దాదాపు 200 మంది ఎంపీల శాంతియుత ర్యాలీని అమానుషంగా అడ్డుకున్నారంటూ దుయ్యబట్టారు. అనంతరం ఎంపీలంతా పార్లమెంటు ప్రాంగణానికి వెనుదిరిగారు. ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలు పాల్గొనకపోవడం విశేషం. అంతకుముందు తృణమూల్ విడిగా ఎల్పీజీ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం ముందు ధర్నా చేసింది.

పార్లమెంట్‌లో ఆగని రగడ

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాల్సిందే ● లోక్‌సభ, రాజ్యసభల్లో బీజేపీ డిమాండ్ ● అదానీపై జేపీసీకి విపక్షాల పట్టు ● ఉభయ సభలు మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో దుమారం కొనసాగుతూనే ఉంది. అధికార, విపక్ష సభ్యుల నినాదాలు, కేకలతో ఉభయసభలు వరుసగా మూడో రోజు బుధవారం సైతం స్తంభించాయి. రాహుల్ క్షమాపణకు బీజేపీ సభ్యులు, అదానీ వ్యవహారంపై జేపీసీకి విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. దాంతో లోక్‌సభ, రాజ్యసభ మళ్లీ వాయిదా పడ్డాయి.

ప్రజాస్వామ్యాన్ని అవమానించారు

బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) డిమాండ్‌తో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలకు దిగారు. రాహుల్ క్షమాపణ చెప్పాలంటూ బీజేపీ ఎంపీలు సైతం నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోంచి వెళ్లి సభ జరగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా కోరారు. కార్యకలాపాలకు అడ్డు తగులుతున్న విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను మంత్రి పీయూష్ గోయల్ కోరారు. పార్లమెంట్ సభ్యుడైన ఓ వ్యక్తి విదేశాలకు వెళ్లి ఇదే పార్లమెంట్‌ను దారుణంగా కించపర్చారని రాహుల్ గాంధీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది చాలా తీవ్రమైన అంశమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సభ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా పడింది. వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్ష ఎంపీలు నినాదాలు కొనసాగించారు. సభ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సభ్యులందరిపైనా ఉందని సభాపతి స్థానంలో ఉన్న భర్తృహరి మెహతాబ్ చెప్పారు. సభలో ప్రభుత్వానికి సంబంధించిన పత్రాలకు తప్ప ప్లకార్డులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గందరగోళం కొనసాగుతుండగానే రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ ఇంటర్–సర్వీసెస్(కమాండ్, కంట్రోల్, డిసిప్లిన్) బిల్లు–2023ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ సభకు వచ్చి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ మన దేశాన్ని అవమానించారంటూ ప్రవాస భారతీయుల నుంచి తనకు ఫోన్లు వస్తున్నాయని వెల్లడించారు. భారత్ సార్వభౌమత్వ దేశమని, మన దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలంటూ ఇతర దేశాలను రాహుల్ కోరడం ఏమిటని ప్రహ్లాద్ జోషీ ఆక్షేపించారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది.



రాజ్యసభలోనూ గందరగోళం

లోక్‌సభలో కనిపించిన దృశ్యాలే రాజ్యసభలోనూ పునరావృతమయ్యాయి. లండన్‌లో చేసిన వ్యాఖ్యల పట్ల రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు ఎదురుదాడికి దిగారు. అరుపులు కేకలతో గందరగోళం నెలకొనడంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమైన తర్వాత ఇరుపక్షాల నడుమ వాగ్వాదం కొనసాగింది. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించేందుకు ప్రయత్నించగా, బీజేపీ సభ్యులు అడ్డుకున్నారు. రాహుల్ క్షమాపణ చెప్పిన తర్వాతే కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడాలంటూ నినాదాలు చేశారు. సభ్యులంతా శాంతించాలని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పదేపదే కోరినా ఫలితం లేకుండా పోయింది. సభ ముందుకు సాగే అవకాశాలు లేకపోవడంతో మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రాహుల్ క్షమాపణ ప్రసక్తే లేదు: ఖర్గే

రాహుల్ వ్యాఖ్యలపై ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ నేతలపై గతంలో ప్రధాని మోదీ విదేశాల్లో చేసిన వ్యాఖ్యలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎదురుదాడికి దిగారు. ''భారత్‌లో పుట్టినందుకు గతంలో మీరంతా సిగ్గుతో తలదించుకునేవారు. అదో పాపంగా భావించారు. జీవిస్తున్నారు అని ప్రధాని హోదాలో చైనాలో మోదీ అన్నారు. రాహుల్ మాటల్లో తప్పేంలేదు. క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదు'' అని స్పష్టంచేశారు. ' భావ ప్రకటనా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని అణగదొక్కుతున్నారు. నిజం మాట్లాడితే జైలు పంపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని చంపడం కాదా?'' అన్నారు.

లాలూ కుటుంబానికి ఊరట

అందరికీ బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు




న్యూఢిల్లీ: భూమికి ఉద్యోగం కుంభకోణంలో నిందితులుగా ఉన్న నాటి రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి, కూతుళ్ల మీసా భారతి తదితరులకు కోర్టు నుంచి ఉపశమనం లభించింది. ఇటీవల మూత్రపిండమార్పిడి శస్త్రచికిత్స తర్వాత కోలుకుంటున్న లాలూ బుధవారం ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టుల ప్రాంగణానికి చేరుకుని జడ్జి ఎదుట హాజరయ్యారు. ఇతర నిందితులూ వెంట వచ్చారు. లాలూ, రబ్రీ దేవి, మీసా భారతి తదితరులకు ప్రతి ఒక్కరికీ చెరో రూ.50,000 విలువైన వ్యక్తిగత బాండు, అంతే మొత్తానికి మరో పూచీకత్తు సమర్పించాలని సూచిస్తూ అందరికీ బెయిల్ మంజూరుచేస్తూ ప్రత్యేక న్యాయమూర్తి గీతాంజలి గోయల్ ఉత్తర్వులు జారీచేశారు. బెయిల్ కోసం నిందితులు గతంలో పెట్టుకున్న అభ్యర్థనలను కోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) తోసిపుచ్చలేదు. కేసు తదుపరి విచారణను కోర్టు మార్చి 29వ తేదీకి వాయిదావేసింది. భారతీయ రైల్వే నియామకాల్లో పేర్కొన్న నిబంధనావళిని తొక్కిపెట్టి తమకు తక్కువ ధరకు భూములు దక్కేలా చేసిన ఉద్యోగార్థులకు వేర్వేరు జోన్లలో తక్కువ స్థాయి ఉద్యోగాలు ఇప్పించారని లాలూ కుటుంబంపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో కేసు నమోదుచేసి సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తున్న విషయం తెల్సిందే.

ఇమ్రాన్‌కు స్వల్ప ఉపశమనం

లాహోర్: ప్రభుత్వ కానుకల అక్రమ విక్రయం కేసులో కోర్టుకు గైర్హాజరై అరెస్టును ఎదుర్కొంటున్న పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు లాహోర్ హైకోర్టు ఉపశమనం కల్పించింది. గురువారం దాకా ఆయనను అరెస్టు చేయొద్దని పోలీసులను ఆదేశించింది. ఇమ్రాన్‌ను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులతో, అడ్డుకునేందుకు వచ్చిన తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలతో ఇమ్రాన్ నివాసప్రాంతం ఉద్రిక్తంగా మారడం తెలిసిందే. కోర్టు ఉత్తర్వులతో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అయితే శుక్రవారం అరెస్టును అడ్డుకునేందుకు ఇంకా పెద్ద సంఖ్యలో మద్దతుదారులు వస్తుండటంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది.

4 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాల విడుదలకు చెక్

అణువిద్యుత్ రంగంతో ఇది సాధ్యమైంది: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 4 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాల విడుదలకు అణువిద్యుత్ రంగం అడ్డుకట్టవేస్తోందని కేంద్రం పేర్కొంది. విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలపై ఆధారపడకుండా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని లోక్‌సభలో అణుఇంధన శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో కేవలం మూడు శాతమే అణువిద్యుత్‌కేంద్రాల నుంచి వస్తున్నప్పటికీ ఆ కేంద్రాలు దేశ ఇంధన భద్రతలో ఆవశ్యక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. 2032 ఏడాదికల్లా అణువిద్యుత్ వ్యవస్థాపక సామర్థ్యం మూడింతలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఇకపై 3 షిఫ్టుల్లో సీయూఈటీ: యూజీసీ

న్యూఢిల్లీ: ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష(సీయూఈటీ)ను ఈ ఏడాది నుంచి 3 షిఫ్టుల్లో నిర్వహించనున్నట్లు యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్ కుమార్ చెప్పారు. జేఈఈ, నీట్ వంటి కీలక పరీక్షలను సీయూఈటీలో కలిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షల సమ్మేళనం గురించి రెండేళ్ల ముందుగానే ప్రకటిస్తామన్నారు. సీయూఈటీ–యూజీ సెకండ్ ఎడిషన్ పరీక్షను ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిర్వహించేందుకు యూజీసీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గతంలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఇకపై విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరీక్షపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఉద్యోగం పోయిన హెచ్‌–1బి వర్కర్లకు... ఆర్నెల్ల గ్రేస్ పీరియడ్

అమెరికా అధ్యక్షుని సలహా కమిటీ సిఫార్సు

- వేలాది భారత టెకీలకు ఊరట!
- ఐదేళ్లకు మించి వెయిటింగ్‌లో ఉన్న గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఈఏడీ!
- సాధ్యాసాధ్యాలపై అధ్యక్షుని సలహా కమిటీ చర్చ

వాషింగ్టన్: మాంద్యం దెబ్బకు అమెరికాలో వరుసపెట్టి ఉద్యోగాలు కోల్పోతున్న హెచ్‌–1బి ఉద్యోగులకు ఊరట. ఉద్యోగం పోయిన రెండు నెలల్లోపే కొత్త కొలువు వెతుక్కోవాలన్న నిబంధనను సడలించి గ్రేస్ పీరియడ్‌ను ఆర్నెల్లకు పెంచాలని అధ్యక్షుని సలహా సంఘం సిఫార్సు చేసింది. తద్వారా కొత్త ఉపాధి అవకాశం వెతుక్కునేందుకు వారికి తగినంత సమయం దొరుకుతుందని అభిప్రాయపడింది. దీనికి అధ్యక్షుని ఆమోదం లభిస్తే కొన్నాళ్లుగా అమెరికాలో ఉద్యోగాలు కోల్పోతున్న వేలాది భారత టెకీలకు భారీ ఊరట కలగనుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్‌తో పాటు పలు దిగ్గజ కంపెనీలు వేలాదిగా ఉద్యోగులను తొలగిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత నిబంధనల మేరకు వారంతా 60 రోజుల్లోగా మరో ఉపాధి చూసుకోలేని పక్షంలో అమెరికా వీడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో గ్రేస్ పీరియడ్‌ను 180 రోజులకు పెంచాల్సిందిగా సిఫార్సు చేసినట్టు ఆసియా అమెరికన్లు తదితరులపై అధ్యక్షుని సలహా సంఘం సభ్యుడు అజన్ జైన్ భుటోరియా వెల్లడించారు. అమెరికాలో 2022 నవంబర్ నుంచి రెండు లక్షలకు పైగా ఐటీ నిపుణులు ఉద్యోగాలు కోల్పోయారు. వీరిలో ఏకంగా 80 వేల మంది భారతీయులేనని అంచనా!



గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఊరట!

మరోవైపు, ఈబీ–1, ఈబీ–2, ఈబీ–3 కేటగిరీల్లో ఆమోదిత ఐ–140 ఉపాధి ఆధారిత వీసా పిటిషన్లుండి, ఐదేళ్లకు పైగా గ్రీన్‌కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నవారికి ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్లు (ఈఏడీ) జారీ చేయాలని అధ్యక్షుని సలహా కమిటీ తాజాగా ప్రతిపాదించింది. ఇందుకు ఆమోదం లభిస్తే ఇమిగ్రెంట్ వారి వీసా దరఖాస్తులపై తుది నిర్ణయం వెలువడేదాకా అమెరికాలో వృత్తి, ఉద్యోగాలు కొనసాగించుకునేందుకు వీలు కలుగుతుందని కమిటీ సభ్యుడు అజన్ జైన్ భుటోరియా తెలిపారు.

అరుణాచల్ భారత్‌లో అంతర్భాగం

మెక్‌మోహన్ రేఖ అంతర్జాతీయ సరిహద్దు	అమెరికా సెనేట్‌లో తీర్మానం	భారత్‌కు అండగా ఉంటామన్న సెనేటర్ బిల్ హగెర్టీ

వాషింగ్టన్: అరుణాచల్ ప్రదేశ్ తమదేనని వాదిస్తున్న చైనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమే తప్ప చైనాలో భాగం కాదని అగ్రరాజ్యం అమెరికా తేల్చిచెప్పింది. చైనా, అరుణాచల్ మధ్యనున్న మెక్‌మోహన్ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. సరిహద్దు వద్ద యథాతథ స్థితిని మార్చడానికి చైనా ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సెనేటర్లు బిల్ హగెర్టీ, జెఫ్ మెర్క్‌లీ సెనేట్‌లో తీర్మానం ప్రవేశపెట్టగా మరో సెనేటర్ జాన్ కార్నిన్ కూడా దాన్ని ప్రతిపాదించారు. ''స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌కు చైనా నుంచి ముప్పు కొనసాగుతున్న తరుణంలో ఈ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలకు అండగా నిలవడం అమెరికా బాధ్యత. ప్రత్యేకించి భారత్‌కు మా మద్దతు ఉంటుంది'' అని హగెర్టీ పేర్కొన్నారు. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వద్ద యథాతథ స్థితిని మార్చాలన్న చైనా కుటిల యత్నాలను ఖండిస్తున్నామని చెప్పారు. అమెరికా–భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత ముందుకెళ్లనుందని అన్నారు. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌కు 'క్వాడ్' కూటమి మద్దతు ఉంటుందని వెల్లడించారు. సరిహద్దు వెంట వివాదాస్పద ప్రాంతాల్లో గ్రామాల నిర్మాణం, అరుణాచల్ భూభాగాలకు మాండరిన్ భాషలో మ్యాప్‌లను రూపొందించడాన్ని తీర్మానంలో ప్రస్తావించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 16 । మార్చి । 2023


వేసవి ఎండలకు విరుగుడుగా బెంగళూరు చామరాజపేటెలో కొబ్బరికాయల వినియోగం


ఐటీ సిటీలో రేస్ కోర్స్ రోడ్ జంక్షన్‌లో ఏర్పాటు చేయడానికి సిద్ధమైన గుర్రాల బొమ్మలు

న్యూస్‌రీల్

భవనం పై నుంచి పడి చిన్నారి మృతి

శివాజీనగర: భవనం పై నుంచి కిందపడి చిన్నారి మృతి చెందిన సంఘటన బెంగళూరు చామరాజపేటలోని ఆజాద్‌నగర 6వ క్రాస్‌లో చోటు చేసుకుంది. ఒకటిన్నర సంవత్సరాల బాలిక దీక్ష మృతురాలు. వినయ్– కవిత అనే దంపతుల కుమార్తె దీక్ష, వీరు తెలిసిన మిత్రుల ఇంటికి వెళ్లారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో పై అంతస్తు బాల్కనీ తల్లి పాపకు ఆహారం తినిపిస్తోంది. ఆ సమయంలో ఆట లాడుతూ పాప గ్రిల్స్‌పై నుంచి కిందకు పడిపోడడంతో తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో బిడ్డ తుది శ్వాస విడిచింది. చామరాజపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని తనిఖీని చేపట్టారు.

140 సీట్లలో గెలుపు మాదే: యడ్డి

సాక్షి బళ్లారి: ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 140 స్థానాలు గెలుపొందడం ఖాయమని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప అన్నారు. ఆయన బుధవారం బాగలకోటె జిల్లా ఇలకల్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత రైతు మహిళలకు ప్రతి నెల రూ.1000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. రైతులకు ప్రత్యేక బీమా ఏర్పాటు చేసి ఆయా కుటుంబాలను ఆదుకుంటామన్నారు. రాష్ట్రంలో మళ్లీ బీజేపీని గెలిపించేందుకు అన్ని జిల్లాల ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ ఎన్ని సార్లు ప్రచారానికి వచ్చినా బీజేపీకి అంతా మంచే జరుగుతుందన్నారు. మోదీతో పోల్చుకుంటే రాహుల్ లెక్కలోకి రాడని అన్నారు.

మహదేవప్ప టికెట్ త్యాగం



మైసూరు: నంజనగూడు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌పై తాను వెనక్కి తగ్గుతున్నట్లు మాజీ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప తెలిపారు. కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఇటీవల మరణించిన మాజీ ఎంపీ ఆర్.ధృవ నారాయణ కుటుంబాన్ని బుధవారం మైసూరులో ఆయన పరామర్శించారు. ధృవనారాయణ కుమారుడు దర్శన్‌కు మద్దతిస్తున్నట్లు తెలిపారు. దర్శన్ సమక్షంలోనే పోటీ నుంచి విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. నంజనగూడు నుంచి పోటీ చేయాలని తాను టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్నట్లు, అయితే ధృవనారాయణ మరణంతో తన ఆత్మసాక్షి నిర్ణయం మేరకు పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ధృవనారాయణ ఆశయం మేరకు దర్శన్‌ను గెలిపించుకుందామని చెప్పారు. కాగా నంజనగూడు నుంచి దర్శన్ పోటీ చేయవచ్చని సమాచారం.

జ్వరం, జలుబు.. ఇంటింటా గుబులు

- వైరల్ జ్వరం, హెచ్3ఎన్2 దండయాత్ర
- ఆస్పత్రులకు రోగుల క్యూ
- వేసవి రాకతో జబ్బుల బెడద రెట్టింపు


వైరల్ జబ్బుల వల్ల ఊపిరితిత్తులకు సమస్య



రోగులతో రద్దీగా ఉన్న బెంగళూరులోని ఆస్పత్రి


బాలలు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై వైరస్‌ల దాడి

బనశంకరి: రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల మధ్య వైరల్ ఫీవర్ ప్రజలను పీడిస్తోంది. జలుబు, దగ్గు, తలనొప్పి, గొంతునొప్పి తో పాటు వైరల్ జ్వర లక్షణాలతో ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రులు వైరల్ ఫీవర్ రోగులతో రద్దీగా మారాయి. దీనికి తోడు కోవిడ్ వైరస్ లక్షణాలతో కూడిన హెచ్3ఎన్2 (ఇన్ఫ్లుయెంజా–ఏ) వైరస్ సైతం హెచ్చుమీరుతుండటం ప్రజలను కంగారుకు గురిచేసింది.

మూడింటి లక్షణాలు ఒక్కటే

కోవిడ్–19, వైరల్ ఫీవర్, హెచ్3ఎన్2.. ఈ మూడింటి లక్షణాలు దాదాపు ఒకే రకంగా ఉంటాయి. దాని వల్ల తమకు సోకిన జబ్బు ఏదో తెలియక గందరగోళంలో చిక్కుకున్నారు. బెంగళూరుతో పాటు పలు జిల్లాల్లో ఇంట్లో ఒకరిద్దరు వైరల్ జ్వరంతో బాధ పడుతున్నారు. ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లలు, వయసుపైబడిన వారు త్వరగా ఈ జ్వరం బారిన పడుతుండగా జ్వరం ఒకరినుంచి మరొకరికి సులభంగా వ్యాపించడం వల్ల రోగుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా విస్తరిస్తోంది.

పొడి వాతావరణం కారణం

వేసవిలో పొడి వాతావరణం వల్ల గాలిలో ధూళి ఎక్కువగా ఉంటుంది. దీంతో జ్వరం, శ్వాసకోశ సమస్య మొదలవుతుంది. ఇది వైరస్ ప్రబలడానికి దోహదం చేస్తుంది. వేసవి సమయంలో ప్రజల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో తొందరగా రోగాల బారినపడతారని ప్రముఖ వైద్యుడు డాక్టర్ మంజునాథ్ నాయక్ తెలిపారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

వైరల్ జ్వరం పిల్లల్లో జ్వరం, జలుబు, దగ్గు రూపంలో కనబడుతుంది. ఆర్ఎస్‌వీ (రెస్పిరేటరీ సెన్సిటియల్ వైరస్) ఈ సమయంలో పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. రోగం ముదిరితే వైరల్ న్యూమోనియాగా మారుతుంది. ఈ సమయంలో వెంటనే ఆసుపత్రిలో చేర్చాలి. ఇలాంటి రోగ లక్షణాలు కలిగిన చాలామంది పిల్లలకు కోవిడ్ పరీక్ష కూడా చేశారు. కానీ ఎవరిలోను కోవిడ్ పాజిటివ్ రాకపోవడంతో కోవిడ్ భయం లేదని బౌరింగ్– లేడీ కర్జన్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ చిక్కనరసారెడ్డి తెలిపారు.


జలుబు, జ్వరంతో బెంబేలు

రాష్ట్రంలో కోవిడ్‌కు ఇద్దరు మృతి

రాష్ట్రంలో తగ్గుముఖం పట్టిన కోవిడ్ వైరస్ మళ్లీ కేసులు పెరుగుతున్నాయి. మంగళవారం 81 మందికి వైరస్ సోకగా ఇద్దరు మృతిచెందారు

ఇప్పటికి 150 హెచ్3ఎన్2 కేసులు

రాష్ట్రంలో వైరల్ జ్వరాలతో పాటు హెచ్3ఎన్2 వైరస్ ఉంది, ఇప్పటి వరకు 150 హెచ్3ఎన్2 కేసులు నమోదు కాగా ఇందులో కొందరు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఇతర రోగాలతో బాధపడుతున్న వ్యక్తులు, వయసుపైబడిన వారు వీరిలో అధికంగా ఉన్నారు. శ్వాసకోశ సమస్య కలిగిన వారి నమూనాలను హెచ్3ఎన్2 జీనోమ్ సీక్వెన్సింగ్ కు పంపిస్తున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డీ రందీప్ తెలిపారు.

మాస్కు, దూరం పాటించాలి

దీర్ఘకాలం అనారోగ్యంతో ఉన్న వ్యక్తులకు ఇప్పుడు నిత్యం జలుబు సమస్య ఏర్పడింది. సులభంగా ఫ్లూ వైరస్‌కి గురై జబ్బు పడుతున్నారు. మాస్కు ధరించడం ఉత్తమం. దూరం పాటిస్తూ, చేతులను శుభ్రం చేసుకోవడం లాంటి ముందుజాగ్రత్త చర్యలు పాటించాలని జయదేవ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్ తెలిపారు.

వైరల్ జ్వరం లక్షణాలు

- మూడునాలుగురోజుల పాటు విపరీతమైన జ్వరం, చలి
- జలుబు, దగ్గు, తలభారం, చేతులు కాళ్లు నొప్పులు
- కొందరిలో శ్వాసకోశసమస్య, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, కళ్లు ఎర్రగా మారడం

మూడురోజులైతే డాక్టర్‌ను కలవాలి

- కోవిడ్ లక్షణాలు, వైరల్ జ్వరాలు లక్షణాలు ఒకటిగా ఉండవచ్చు
- వరుసగా మూడురోజుల పాటు జ్వరం ఉంటే తక్షణం డాక్టరును సంప్రదించాలి
- జనరద్దీ ప్రాంతాల్లోకి వెళ్లినప్పుడు మాస్కు ధరించాలి
- బయటకు వెళ్లి వచ్చాక చేతులను సబ్బుతో తరచూ శుభ్రం చేసుకోవాలి
- నీరు, ద్రవాహారం ఎక్కువగా సేవించాలి.

19న ఉగాది తెలుగు సాహితీ పురస్కారాల ప్రదానం

బనశంకరి: తెలుగు సాహిత్యరంగంలో విశేషసేవలందిస్తున్న కవులు, రచయితలకు శోభకృత్‌నామ ఉగాది పర్వదినం సందర్భంగా జాతీయ స్థాయి సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మెన్ బొగ్గవరపు మల్యాద్రి, ప్రధాన కార్యదర్శి కళ్లే వెంకటేశ్వరశాస్త్రి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య, ఇండోఏషియన్ అకాడమీ, డీఆర్ అకాడమి అధ్వర్యంలో ఇండోఏషియన్ అకాడమి ఆవరణలో 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన రచయితలకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరిస్తారు. బెంగళూరు యూనివర్శిటీ తెలుగుశాఖ అధ్యక్షురాలు డాక్టర్ కొలకలూరి ఆశాజ్యోతి, డాక్టర్ ఏకాంబరం, పీ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు.

కన్నడిగుల రక్షణలో సీఎం విఫలం

- సిద్దరామయ్య ధ్వజం

హుబ్లీ: కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు విషయంలో ప్రభుత్వం చచ్చిపోయిందా? రాష్ట్రం, కన్నడిగులను రక్షించడంలో ముఖ్యమంత్రి బొమ్మై విఫలమయ్యారు, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని సీఎల్పీ నేత సిద్దరామయ్య డిమాండ్ చేశారు. హుబ్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహాజన్ నివేదికే అంతిమం అని 1966లో నివేదిక సమర్పించారన్నారు. అప్పటి నుంచి కర్ణాటక దాన్ని అంగీకరించిందన్నారు. అయితే మహారాష్ట్ర వివాదం చేస్తూనే ఉందన్నారు. ఇప్పుడు మళ్లీ 865 గ్రామాలను మహారాష్ట్రలో చేర్చాలంటున్నారు. రాష్ట్రంలోని ఒక్క ఇంచు భూమిని కూడా వదలమన్నారు. భాష, సంస్కృతి భూమి నీరు 6.5 కోట్ల ప్రజల హక్కు, దీనికి భంగం వచ్చినప్పుడు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉదాశీనంగా ఉన్నాయన్నారు. మహారాష్ట్ర ఉద్యోగులు మన రాష్ట్రంలోని గ్రామాల్లోకి వచ్చి ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్నారంటే దాని అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఇది మన సార్వభౌమత్వానికి సవాల్ అన్నారు. ఏకనాథ్ షిండే ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలన్నారు.


పైప్‌లైన్ లీకేజీ నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళలు. బుధవారం బెంగళూరు చామరాజపేటెలో కనిపించిన దృశ్యం. ఎండాకాలం రావడంతో నీటికి డిమాండ్ పెరిగింది

బ్యాగులో భారీగా నగదు, నగలు


నగదుతో పట్టుబడిన అక్షయ్

బనశంకరి: సిటీ మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన అక్షయ్ అనే వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.28 లక్షల నగదు, రూ.20 లక్షల విలువచేసే 319 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల విలువచేసే 15 కిలోల వెండిని సిటీమార్కెట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి సిటీ మార్కెట్‌లో అనుమానాస్పదంగా బ్యాగు పట్టుకుని తిరుగుతున్న ఆ వ్యక్తిని పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. బ్యాగులో నగదు, బంగారు, వెండి ఆభరణాలు లభించగా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని ప్రశ్నించగా, ఒక జ్యువెలరి షాప్‌కు ఇవ్వడానికి వచ్చానని తెలిపారు. అయితే నగదు, నగలకు ఎలాంటి రికార్డులు అతని వద్ద లభించలేదు. ఐటీ శాఖ అధికారులకు పోలీసులు సమాచారం అందించగా, వారు అక్షయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ఉన్నతాధికారి వేధింపులకు మహిళ బలి


నిందితుడు వినయ్


కంప్యూటర్ ఆపరేటర్ సౌమ్య (ఫైల్)

- కొడగు జిల్లాలో దారుణం

మైసూరు: అందం ఆమె పాలిట శాపమైంది, చదువుకుని ఖాళీగా ఉండడం ఎందుకని ఓ చిన్నపాటి ఉద్యోగంలో చేరితే పై అధికారి కామాంధునిగా మారాడు. సెస్కాంలో ఉన్నతాధికారి వేధింపులను తట్టుకోలేక మహిళా కంప్యూటర్ ఆపరేటర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కొడగు జిల్లా మడికెరి వద్ద మంగళవారం జరిగింది.

ఫోన్ చేయి, వాట్సప్ చాట్ అని ఒత్తిడి

వివరాలు.. మడికెరి తాలూకా కగ్గోడ్లు గ్రామానికి చెందిన సౌమ్య అనే మహిళ గతేడాది మేలో మడికెరి సెస్కాం కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరారు. అయితే సహాయక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) వినయ్ ఆమెపైన కన్నేశాడు. నాకు ఫోన్ చేయి, వాట్సాప్ చాట్ చేయి అంటూ సౌమ్యను తరచూ వేధించేవాడని సౌమ్య భర్త, విశ్రాంత జవాన్ తెలిపారు. వినయ్ వేధింపులు అలాగే కొనసాగుతుండడంతో విరక్తి చెందిన సౌమ్య ఇంట్లో పురుగుల మందును తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త మడికెరి మహిళా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఏఈఈ వినయ్‌పై కేసు నమోదు చేశారు.

సేద్యానికి సాంకేతిక పరిజ్ఞానం వెన్నుదన్ను

యశవంతపుర: వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానం వెన్నుదన్నుగా నిలిచిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర తోమర్ అన్నారు. జీకేవీకేలో బుధవారం ఏర్పటు చేసిన అఖిల భారత అంతర వ్యవసాయ వర్శిటీల యువజనోత్సవం, చతుర వ్యవసాయ అభివృద్ధి, నావీన్యతా యోజనను ప్రారంభించి మాట్లాడారు. పీఎం కిసాన్ యోజనతో రూ.2.4 లక్షల కోట్లను కేంద్రం రైతుల ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. డిజిటల్ పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకొని అధిక దిగుబడి సాధించాలన్నారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె, మంత్రి బీసీ పాటిల్, డాక్టర్ సీఆర్ అగరవాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ లెక్కాధికారి మృతి కేసు.. భర్త, బంధువులు పరారీ


కృష్ణబాయి (ఫైల్)

మైసూరు: మైసూరు జిల్లా హుణసూరు తాలూకా బిళికెరె హోబళిలో మహిళ గ్రామ లెక్కాధికారిగా ఉన్న కృష్ణబాయి తుకారం పడ్కే అనుమానాస్పద మృతి కేసులో భర్త పరారయ్యాడు. వరకట్న వేధింపుల వల్లే తమ కుమార్తె మరణించిందని మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఏడుమందిపై బిలికెరె పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాయి తుకారం పడ్కే మామ బాళప్ప, బావ అమరనాథ్ పాటిల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలి భర్తతోపాటు మరో ఐదు మంది ఆచూకీ లేదు. మృతురాలి భర్త హనూరులో ఫారెస్టు గార్డుగా పని చేస్తున్న సుభాష్ బోస్లేతో పాటు మరో ఐదు మంది పరారీలో ఉన్నట్లు డీఎస్పీ మహేశ్ తెలిపారు. బెళగావి జిల్లా అథణి తాలూకా ఎస్‌గల్లి గ్రామానికి చెందిన కృష్ణబాయి శ్యానుబోగనహళ్లి జోన్ గ్రామ లెక్కాధికారిగా పని చేస్తున్నారు.

40 రోజుల క్రితమే బిజాపురకు చెందిన ఫారెస్ట్ గార్డు సుభాష్ బోస్లేను పెళ్లి చేసుకున్నారు. వారం కిందట పెళ్లి సెలవులను పూర్తిచేసి ఆమె విధులకు హాజరయ్యారు. గత శనివారం బిళికెరె అద్దె ఇంట్లో అనుమానాస్పద రీతిలో ఉరి వేసుకుని కృష్ణబాయి మరణించింది.

బీజేపీ ఎమ్మెల్సీ శంకర్‌కు షాక్


భారీ మొత్తంలో సరుకుల నిల్వలు


చీరల ప్యాకెట్లు

- రాణిబెన్నూరులో నివాసంలో ఐటీ సోదాలు
- భారీ మొత్తంలో చీరలు, ప్లేట్లు, గ్లాసులు, బ్యాగులు సీజ్
- సరుకు విలువ రూ. 8 కోట్లు ఉండవచ్చని అంచనా

బనశంకరి: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో హావేరి జిల్లా రాణిబెన్నూరు బీరలింగేశ్వరనగరలో బీజేపీ ఎమ్మెల్సీ ఆర్.శంకర్ నివాసంపై మంగళవారం అర్ధరాత్రి ఐటీ అధికారులు దాడిచేశారు. శంకర్ నివాసం, ఆఫీసులో ప్రజలకు పంచడానికి ఆయన ఫోటోలతో కూడిన చీరలు, స్టీల్ తట్టలు, ఎల్‌కేజీ నుంచి డిగ్రీ కాలేజీ వరకు విద్యార్థులలకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. వాటి రికార్డులు, బిల్లులు, స్టాక్‌చెక్‌లను పరిశీలించారు. 6 వేలకు పైగా చీరలు, 9 వేలకు పైగా స్కూల్ బ్యాగులు, తట్టలు, గ్లాసులు ఉన్నాయి. మరో రూ.30–40 లక్షలు విలువ చేసే గృహోపకరణాలను గుర్తించారు.

7 గంటల పాటు తనిఖీలు

సుమారు 7 గంటల పాటు ఐటీ సోదాలు కొనసాగాయి. సుమారు రూ.8 కోట్ల విలువచేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అంచనా. ఈ వస్తువులు కొనుగోలు బిల్లులు అడుగగా ఆర్.శంకర్ గడువు కోరారు. బిల్లులు, జీఎస్‌టీ రసీదులు లేకపోతే జరిమానా విధించే అవకాశం ఉంది. అన్ని రికార్డులను కోర్టుకు అందజేసి కోర్టు ఆదేశం మేరకు కేసు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ రఘునందనమూర్తి తెలిపారు.

అభిమానులు, శంకర్ ఆగ్రహం

- ఆర్.శంకర్ నివాసంపై ఐటీదాడి విషయం తెలియగానే అతడి అభిమానులు మద్దతుదారులు వచ్చి ధర్నాకు దిగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం బొమ్మైకి శంకర్ గట్టి మద్దతుదారు అని, ఇటువంటి ఐటీ దాడులు బీజేపీకే ఇబ్బందికరమని అభిమానులు ఆరోపించారు.


ఎమ్మెల్సీ శంకర్

- ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎవరి కుమ్మక్కుతోనో దాడి జరిగింది. నేను కష్టపడి సంపాదించిన డబ్బుతో సమాజసేవ చేస్తున్నానని తెలిపారు. ఓ వ్యక్తి ప్రోద్బలంతో ఈ దాడులు జరిగాయని ఆరోపించారు. అసలు ఎన్నికల కోడ్ అమల్లోకి రాకుండానే తనిఖీలు చేయడం ఏమిటని మండిపడ్డారు.

ఇద్దరు తెలుగు విద్యార్థుల దుర్మరణం


మృతిచెందిన కార్తీక్ , భగీరథరెడ్డి (ఫైల్)

- బెంగళూరులో కారు ప్రమాదం
- మృతులు అనంతపురం, ప్రకాశం జిల్లా వాసులు



ప్రమాదంలో నుజ్జయిన కారు, దెబ్బతిన్న బస్సు

బనశంకరి: వాయువేగంతో కారు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదానికి గురికావడంతో ఇద్దరు తెలుగు విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ ఘటన బెంగళూరు మడివాళ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉన్నత చదువులు చదివి కంటి వెలుగులు అవుతారనుకున్న కుటుంబాల ఆశలు చిదిమిపోయాయి.

ఒకే హాస్టల్లో స్నేహితులు

వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ చెందిన కార్తీక్ (23), బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో ఒక ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ కోరమంగలలో సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భగీరథరెడ్డి (17) బెంగళూరులో ఒక ప్రైవేటు కాలేజీలో పీయూసీ చదువుతూ అదే ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇద్దరి మధ్య స్నేహం ఉండేది.

డివైడర్‌ను ఢీకొని మళ్లీ బస్సును

మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో కార్తీక్ తన కారులో భగీరథరెడ్డి కలిసి బయలుదేరారు. కారులో వేగంగా వెళ్తూ సిల్క్‌బోర్డు సమీపంలో రోడ్డు డివైడరును అదుపుతప్పి ఢీకొని దూసుకెళ్లి అవతల లేన్లో ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అంతలోగా ఇద్దరు మృతిచెందారు. బస్సులోని కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై మడివాళ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను సెయింట్ జాన్స్ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

పాత పాటలు సుమధురాలు



సిద్దేశ్‌ను సన్మానిస్తున్న నేతలు

రాయచూరు రూరల్‌: పాత పాటలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే ఏ.పాపారెడ్డి పిలుపు ఇచ్చారు. నగరంలోని వాల్కట్‌ మైదానంలో దిగ్గజరు సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి యువతరం మొబైల్‌కు అంటిపెట్టుకోవడం వల్ల పాత కాలం నాటి సుమధుర పాటలకు కాలం చెల్లిందన్నారు. ఈ విషయంలో ప్రజల సహకారం ఉంటే కళాకారులను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. అనంతరం 25 ఏళ్ల మెడికల్‌ రెప్రజెంటేటివ్‌ సాంస్కృతిక రాయబారిగా పని చేసిన సిద్దేశ్‌ విరక్తమఠ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నరసారెడ్డి, తారానాథ్‌, సుభాష్‌ శంభాజీ, రవి, రమేష్‌ మేటి, శరణయ్య, రాజేష్‌ తదితరులున్నారు.

ఈశ్వరప్పపై కేసు నమోదుకు డిమాండ్‌



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్‌: బీజేపీ ఎమ్మెల్యే ఈశ్వరప్పపై కేసు నమోదు చేయాలని ఎస్‌డీపీఐ డిమాండ్‌ చేసింది. బుధవారం టిప్పుసుల్తాన్‌ ఉద్యానవనంలో ఆందోళన చేపట్టిన జిల్లాధ్యక్షుడు సయ్యద్‌ ఇషాక్‌ హుసేన్‌ మాట్లాడారు. అజాన్‌, అల్లాలను అవమానపరిచేలా వ్యాఖ్యానించిన మాజీ మంత్రి ఈశ్వరప్పను సరిహద్దు బహిష్కరణ చేయాలని డిమాండ్‌ చేశారు. ఈశ్వరప్ప రాష్ట్రంలో కుల మతాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడారన్నారు. అలాంటి వారిపై జిల్లాధికారి కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కుమార కోసం తిరుపతికి అభిమాని మోకాలి నడక



తిరుపతి మెట్లెక్కిన అభిమాని

రాయచూరు రూరల్‌: వచ్చే ఎన్నికల్లో జేడీఎస్‌ గెలుపొంది హెచ్‌డీ కుమారస్వామి సీఎం కావాలని కోరుకుంటూ ఓ అభిమాని తిరుపతి తిరుమలలో వెలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయ మెట్లెక్కిన ఘటన చోటు చేసుకుంది. బుధవారం యాదగిరి జిల్లా గురుమఠ్కల్‌ నుంచి శరణేగౌడ, రామనగర నుంచి మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామిలు ఎమ్మెల్యేలుగా ఎన్నికవ్వాలని, కుమారస్వామి ముఖ్యమంత్రి కావాలని చిత్రదుర్గ జిల్లా హిరియూరుకు చెందిన అభిమాని అజయ్‌ మోక్లాళ్లపై హిరియూరు నుంచి నడుచుకుంటూ ఫొటోలను పట్టుకొని తిరుమల మెట్లెక్కి ప్రార్థన చేశారు.

ఉపాధ్యాయులను నియమించాలి



మాట్లాడుతున్న రాఘవేంద్ర కుష్టిగి

రాయచూరు రూరల్‌: తాలూకాలోని దేవసూగూరు పాఠశాలలో ఉపాధ్యాయులను తిరిగి నియమించుకోవాలని హైదరాబాద్‌ కర్ణాటక జనాందోళన జిల్లా సంచాలకుడు రాఘవేంద్ర కుష్టిగి పేర్కొన్నారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన మాట్లాడారు. దేవదాయ శాఖ ఆధీనంలోని పాఠశాలలో పాలక మండలి చేసిన అక్రమాలపై మండలిని రద్దు చేసి ప్రైవేట్‌ వారికి అప్పగించారన్నారు. నూతన యాజమాన్యం పాత ఉపాధ్యాయులను తొలగించేందుకు కోర్టు నుంచి మధ్యంతర ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కోర్టు ఆదేశాలను రద్దు చేసి ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలన్నారు.

మాకు న్యాయం చేయండి

- బీజేపీ నేతలకు రైతుల వేడుకోలు

కంప్లి: బీజేపీ విజయసంకల్ప యాత్రలో భాగంగా బుధవారం కుడితినికి విచ్చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నళీన్‌కుమార్‌ కటీల్‌, మాజీ ముఖ్యమంత్రి జగదీశ్‌ శెట్టర్‌లకు గతంలో కర్మాగారం స్థాపిస్తామని తమ వద్ద నుంచి భూములు తీసుకొని 13 ఏళ్ల క్రితం భరోసా ఇచ్చి ఇంతవరకు ఉలుకూ పలుకూ లేదని, తాము నిరవధిక పోరాటం చేస్తున్నా ఫలితం లేదని, మీరే తమకు న్యాయం చేయాలని రైతులు వినతిపత్రం అందించి వేడుకున్నారు. రైతుల ఆవేదనపై స్పందించిన మాజీ సీఎం జగదీశ్‌ శెట్టర్‌ పరిశ్రమల శాఖ మంత్రి మురుగేష్‌ నిరాణి, కేఐఏడీబీ సీఈఓ, అధికారులతో మాట్లాడి సమాచారం అందుకొని త్వరలో సంబంధించిన పరిహారం అందించాలని సూచిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ దేవేంద్రప్ప, జీటీ పంపాపతి, భూములు కోల్పోయిన రైతులు నాగదేవ గౌనూరు, అంజినప్ప, తిమ్మప్ప, కామేష్‌ పాల్గొన్నారు.

అందని నీరు..రైతన్న బేజారు

- ఎండుతున్న వాణిజ్య పంటలు
- నాలుగు లక్షల హెక్టార్లలో నష్టం



నీటి ప్రవాహం లేని తుంగభద్ర ఎడమ కాలువ



ఎండుతున్న పత్తి పంట

రాయచూరు రూరల్‌: తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు సాగునీరందక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. నీటి కొరతతో జిల్లాలో లక్షలాది హెక్టార్లలో పంట నష్టం జరిగే అవకాశం ఉంది. నీటి గేజ్‌ నిర్వహణ, సామర్థ్యాన్ని బట్టి ఆయకట్టు భూములకు నీరందేలా అధికారులు జాగ్రత్తలు పాటించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. గతంలో ముఖ్యమంత్రి యడియూరప్ప ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లఘించినందువల్లే నేడు ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు ఎండుముఖం పట్టాయని రైతులు వాపోతున్నారు.

పంట నష్టం వివరాలివే

సింధనూరు, మస్కి, కవితాళ, మాన్వి తాలూకాల్లో వరి, పత్తి, మిరప పంటలు పండిస్తున్నారు. దాదాపు రెండు లక్షల హెక్టార్లలో వరి పంటను, రాయచూరు, సిరవార తాలూకాల్లో లక్ష హెక్టార్ల చొప్పున పత్తి, మిరప పంటలను పండిస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు రోజు 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే పంటలు చేతికొచ్చే వీలుంది. కాలువ సామర్థ్యం మేరకు నీటి గేజ్‌ నిర్వహణ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యత కరువైంది. భద్రా జలాశయం నుంచి తుంగభద్రకు ఆరు టీఎంసీల నీటిని విడుదల చేయిస్తే కష్టాల నుంచి గటెక్కవచ్చని రైతులంటున్నారు.

ఓటర్లకు కానుకలిస్తే కఠిన చర్యలు

- అక్రమంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు వేయొద్దు
- జిల్లాధికారి పవన్‌కుమార్‌ మాలపాటి



మాట్లాడుతున్న జిల్లాధికారి పవన్‌కుమార్‌

సాక్షిబళ్లారి: ఇక నుంచి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఓటర్లకు ఎలాంటి కానుకలు అందజేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాధికారి ఎం.పవన్‌కుమార్‌ పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని మర్చేడ్‌ హోటల్‌లో మీట్‌ ది ప్రెస్‌ కార్యక్రమంలో మాట్లాడారు. గత వారం బెంగళూరు నుంచి వచ్చిన ఎన్నికల సంఘం అధికారులు సమావేశం నిర్వహించి సూచించిన మేరకు రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు. ఓటర్లకు పెద్ద ఎత్తున ప్రలోభాలు పెడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి చోట ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఓటర్లకు కానుకలు అందజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే తమ దృష్టికి చీరలు, కుక్కర్లు పంపిణీ చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. నేటి నుంచి పంపిణీ చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా అక్రమంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఏర్పాటు చేయరాదన్నారు. ఇప్పటికే నగరంలో 80 శాతానికి పైగా అక్రమంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారన్నారు. గతంలో కాంగ్రెస్‌ భారత్‌ జోడో యాత్ర, బీజేపీ ఎస్టీ మోర్చా సమావేశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలను తొలగించారన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తాం

జిల్లాలోని ఓటర్లకు పెద్ద ఎత్తున కానుకలు, డబ్బులు పంపిణీ చేస్తారనే ఫిర్యాదు ఉన్నందున ఎన్నికలను నిష్పక్షపాతంగా జరిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఆంధ్రప్రదేశ్‌ సరిహద్దున ఉన్న నేపథ్యంలో, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఆయా జిల్లాధికారులతో కూడా చర్చించి గట్టి బందోబస్తు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 11,33,000 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 1191 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో రాష్ట్రంలోనే ఎక్కువ మంది కొత్త ఓటర్ల నమోదు జరిగిందన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన 31 వేల కొత్త ఓటర్లు నమోదు జరిగిందన్నారు. 1.15 లక్షల మందిని ఓటర్‌ జాబితా నుంచి తొలగించామన్నారు. గత ఎన్నికల్లో 72 శాతం పోలింగ్‌ జరగగా, ఈ సారి 82 శాతం జరిగేలా ప్రోత్సహిస్తామన్నారు. జిల్లాలో కేఎంఆర్‌సీ, డీఎంఎఫ్‌ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

మహిళా స్వసహాయ గ్రూపులకు శిక్షణ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అభియాన్‌ వ్యవస్థాపకురాలు సౌమ్య తదితరులు

సిరుగుప్ప: నగరంలోని సీడీపీఓ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన స్వసహాయ సంఘాలకు పది సూత్రాలు అనే అంశంపై ఒక రోజు సామర్థ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా అభియాన్‌ వ్యవస్థాపకురాలు సౌమ్య మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళల సబలీకరణ కోసం అనేక పథకాలను అమలులోకి తెచ్చాయన్నారు. నగరసభ సముదాయ సమన్వయాధికారి అమరేశప్ప, సంఘాల సంపన్మూల వ్యక్తి ఉమా, సమాఖ్య అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, హంపమ్మ, అన్ని సహాయ సంఘాల పదాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై తర్ఫీదు

సిరుగుప్ప: నగరంలోని జూనియర్‌ కాలేజీ సభాంగణంలో బుధవారం ఎన్నికల అధికారి కె.హెచ్‌.సతీశ్‌ వచ్చే ఎన్నికల నిర్వహణపై ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌, సెక్టర్‌, ఏఏటీ, బీబీటీ స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా తాలూకా అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిలర్‌ కాంగ్రెస్‌లో చేరిక

కంప్లి: పట్టణంలోని 17వ వార్డు కౌన్సిలర్‌ రఘునాయక్‌ బుధవారం తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే గణేష్‌ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం రఘునాయక్‌ మాట్లాడుతూ 17వ వార్డులో కౌన్సిలర్‌గా తాను ఎంతో అభివృద్ధి చేశానన్నారు. పార్టీ కోసం శ్రమించిన తన పట్ల ఎక్కడా గౌరవం చూపలేదని, దీంతో మనస్తాపం చెంది కాంగ్రెస్‌లో చేరానన్నారు.

విజయపురలో 'గాలి' ముమ్మర ప్రచారం



పార్టీ ప్రణాళికను ప్రదర్శిస్తున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: విజయపుర(బిజాపుర) జిల్లాలో కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. విజయపుర దక్షిణ నియోజకవర్గానికి భీమా శంకర్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కేఆర్‌పీపీ అధికారంలోకి వస్తే పేద బడుగు బలహీన వర్గాలతో సహా అన్ని వర్గాలకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. తాము ప్రకటించిన ఎన్నికల ప్రణాళికను తూచ తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రజలు తమ గత పాలనను గమనించి ఈ ఎన్నికల్లో తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు విజయపుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానంగా యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీ కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

మడకశిర: మండలంలోని బుళ్లసముద్రం సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనాన్ని బెంగళూరుకు చెందిన ఓ ఎంపీ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకిస్టు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వివరాలు.. పావగడలో బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటైంది. ఇందుకు హాజరు కావడానికి బెంగళూరు సెంట్రల్‌ బీజేపీ ఎంపీ పీసీ మోహన్‌ బెంగళూరు నుంచి మడకశిర మీదుగా పావగడకు వెళ్తున్నారు. ఆయన కారు బుళ్లసముద్రం సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది, బీ రాయాపురం గ్రామానికి చెందిన బైకిస్టు నరసింహమూర్తి (38) కింద పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఎంపీ సహాయకులు ఆస్పత్రికి తరలించారు. కేంద్రమంత్రి నారాయణస్వామి మడకశిర ఆస్పత్రికి వచ్చి బాధితున్ని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరికి..

బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్‌ బుధవారం కూడేరు వద్ద అనంతపురం– బళ్లారి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అనంతపురం నుంచి బళ్లారికి వెళుతుండగా కూడేరు వద్దకు రాగానే మూర్ఛ రావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందాడు.

మహిళలు స్వతంత్ర జీవనం సాగించాలి



మాట్లాడుతున్న పవిత్రగౌడ

కంప్లి: మహిళలు స్వతంత్ర జీవితం సాగించాలని పవిత్ర చారిటబుల్‌ ట్రస్ట్‌ అధ్యక్షురాలు పవిత్రగౌడ తెలిపారు. బుధవారం ట్రస్ట్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మహిళలు పిల్లలను లింగవివక్షతో పెంచరాదన్నారు. ట్రస్ట్‌ ఉపాధ్యక్షులు శివనగౌడ, కోళూరు టైలరింగ్‌ శిక్షకురాలు విద్యాశ్రీ, సిబ్బంది స్వాతి, గంగ, ఆశాకుమారి, ప్రముఖులు వివేకానంద, బేవినహాళ్‌ బసవరాజ్‌గౌడ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుమూర్తి

చెళ్లకెరె రూరల్‌: అన్ని వర్గాల ప్రజల ఎదుగుదల కోసం పార్టీని అధికారంలోకి తేవడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే టీ.రఘుమూర్తి తెలిపారు. ఆయన శాసకర భవనంలో జేడీఎస్‌, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కాంగ్రెస్‌ ఎమ్మెల్యేగా తనకు నిధులు విడుదల చేయకుండా సవతితల్లి ప్రేమను చూపారన్నారు. చెళ్లకెరెకు నూతన బస్టాండ్‌, ఇంజినీరింగ్‌ కళాశాల, చెక్‌ డ్యాంలు, సముదాయ భవనాలను తన అవధిలో పూర్తి చేశానన్నారు. నగరాభివృద్ధి, శాంతియుత జీవనం సాగించడానికి కాంగ్రెస్‌ పార్టీని బలపరచాలన్నారు. బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు వీరభద్రప్ప, రాజన్న, తిప్పేస్వామి, విరుపాక్షప్ప, శశిధర్‌లు పాల్గొన్నారు.

పోస్టుమార్టం గదిని వేరే చోటకు తరలించండి

గంగావతి: కారటగి పట్టణంలోని 18వ వార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శవ పంచనామ గదిని తరలించాలని స్థానికులు, కన్నడ రక్షణ సేన పదాధికారులు అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎం.కరియప్ప చౌడికి మాట్లాడుతూ ఈ ఆస్పత్రి చుట్టు పక్కల పాఠశాలలు, ఆలయాలతో పాటు ప్రజలు నివాసం ఉంటున్నారన్నారు. ఇక్కడ ఆస్పత్రి ఉండటం వల్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒక్కోసారి రెండు మూడు రోజులు ఉంచుతుండడం వల్ల వాటి నుంచి దుర్వాసన వెలువడి పక్కన ఉన్న పాఠశాలల్లోని విద్యార్థులకు, ఆలయానికి వచ్చిన భక్తులకు, నివాసులకు ఇబ్బందిగా మారుతోందన్నారు. అందువల్ల ఇక్కడి గదిని మరో చోటకు తరలించాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా శివప్ప మ్యాగి, గాళేశ్‌, నాగరాజ్‌లు పాల్గొన్నారు.

ఆ నిధులిచ్చింది కాంగ్రెస్‌ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే గణేష్‌



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జేఎన్‌.గణేష్‌

కంప్లి: కంప్లి, కురుగోడుల్లో వందపడకల ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు అందించింది గత కాంగ్రెస్‌ ప్రభుత్వమే తప్ప ప్రస్తుత బీజేపీ సర్కార్‌ కాదని ఎమ్మెల్యే జేఎన్‌.గణేష్‌ తెలిపారు. బుధవారం దేవలాపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కురుగోడులో మంగళవారం జరిగిన విజయసంకల్ప యాత్రలో కంప్లి, కురుగోడు పట్టణాల్లో వంద పడకల ఆస్పత్రికి రూ.40 కోట్లను బీజేపీ ప్రభుత్వం మంజూరు చేసిందని మాజీ సీఎం జగదీశ్‌ శెట్టర్‌ చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా డీకే.శివకుమార్‌ హయాంలో కంప్లి, కురుగోడులకు తలా రూ.20 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇంతవరకు కంప్లి కోట వద్ద తుంగభద్ర నదిపై నూతన వంతెన నిర్మాణానికి ఈ ప్రభుత్వంలో నిధులు విడుదలై ఉంటే భూమిపూజ చేయాలని సవాల్‌ విసిరారు. అంతకు ముందు రూ.6.40 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు, చెక్‌ డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దేవలాపుర గ్రామ ప్రముఖులు, కాంగ్రెస్‌ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేనెందుకు రాజీనామా చేయాలి? : సీఎం బొమ్మై



మాట్లాడుతున్న సీఎం బసవరాజ్‌ బొమ్మై

హుబ్లీ: రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతానికి మహారాష్ట్ర సర్కారు నుంచి నిధులు కేటాయిస్తే తానెందుకు రాజీనామా చేయాలని సీఎం బొమ్మై ప్రశ్నించారు. బెళగావిలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీకే.శివకుమార్‌ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని సరిహద్దు గ్రామాలకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.54 కోట్లను విడుదల చేసిన అంశంపై కేపీసీసీ అధ్యక్షులు డీకే.శివకుమార్‌ తన రాజీనామాకు డిమాండ్‌ చేసిన విషయంపై సీఎం పైవిధంగా స్పందించారు. తాము కూడా మహారాష్ట్రలోని పండరాపుర, తులజాపుర వెళ్లిన కర్ణాటక వారికి నిధులు విడుదల చేశామన్నారు. మహారాష్ట్ర సర్కారు ఏ నిధులు మంజూరు చేసిందో పరిశీలిస్తానన్నారు. మహారాష్ట్ర అభ్యంతరాలను ఏ విధంగా ఎదుర్కోవాలో సమీక్షిస్తానన్నారు. నేల, నీరు, భాష సరిహద్దు రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్‌ నేతలు అనవసరంగా రాష్ట్ర ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఆ తర్వాత ఆయన హుబ్లీకి వచ్చి స్వగ్రామం కమడొళ్లిలోని బంధువులను, స్నేహితులను కలిసి ఎంతో ఉద్వేగానికి గురయ్యారు.

బళ్లారి గ్రామీణ నుంచే పోటీ చేస్తా

- బీజేపీకి మళ్లీ అధికారం ఖాయం
- రవాణా శాఖా మంత్రి శ్రీరాములు



మాట్లాడుతున్న మంత్రి శ్రీరాములు

సాక్షి బళ్లారి: తాను బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని మంత్రి శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని తన నివాసగృహంలో విలేకరులతో మాట్లాడారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచే పోటీ చేయాలని భావించానన్నారు. పలు మార్లు ఎక్కడి నుంచో గెలిచానని, మళ్లీ పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. పార్టీ పెద్దలు కూడా బళ్లారి గ్రామీణ నుంచే పోటీ చేయాలని సూచిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సహకారం కూడా తనకు ఉన్నందున కచ్చితంగా గెలుస్తాననే నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రాక ముందే సీఎం పదవి కోసం సిగపట్లు పడుతున్నారన్నారు. డీకేశి, సిద్దరామయ్య మధ్య సీఎం కుర్చీ కోసం గొడవలు ప్రారంభం అయ్యాయన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ పార్టీకి ఎట్టి పరిస్థితిలోను పట్టం కట్టబోరన్నారు. ఈసారి పూర్తి మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. గత ఎన్నికల్లో కన్నా ఉత్తర కర్ణాటకలో ఈసారి బీజేపీకి మంచి అత్యధిక స్థానాలు లభిస్తాయన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు మంచి స్థానం దొరుకుతుందనే నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో రవాణా శాఖ సిబ్బంది చేపడుతున్న ధర్నా నేపథ్యంలో వారిని పిలిచి మాట్లాడామన్నారు. సీఎంతో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన అన్నారు.

కోలారు వార్తలు...

జాతీయ పార్టీలను నమ్మొద్దు

కోలారు : జాతీయ పార్టీలైన కాంగ్రెస్‌, బీజేపీలు ఒకే నాణేనికి రెండు ముఖాలని, వాటి స్వార్థ రాజకీయాల కోసం దళితులను బలి పశువులను చేస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోను ఈ పార్టీలను నమ్మొద్దని జేడీఎస్‌ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రామసంద్ర తిరుమలేష్‌ తెలిపారు. బుధవారం తాలూకాలోని నరసాపురంలో ఫిర్కా స్థాయి జేడీఎస్‌ సంఘటనా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ జేడీఎస్‌ అన్నారు. జిల్లాలో దళిత సంఘాల నాయకులు తమ స్వార్థం కోసం దళితులను బలి పశువులను చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే జాతీయ పార్టీలకు దళితులు గుర్తుకొస్తారన్నారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చేసుకున్నారన్నారు. జేడీఎస్‌ నాయకులు దేవేగౌడ, హెచ్‌డీ కుమారస్వామిలు దళితులను గుర్తించి తగిన స్థానం అందించారన్నారు. ఈ సందర్భంగా బెళమారనహళ్లి జీపీ సభ్యుడు విజయకుమార్‌, మాజీ సభ్యుడు రామసంద్ర హనుమంతరాయప్ప, ఖాజీకల్లహళ్లి రాజణ్ణ, సుదర్శన్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం



బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు : నగర దేవత కోలారమ్మ బ్రహ్మరథోత్సవ వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. రథోత్సవ వేడుకలను పురస్కరించుకుని కోలారమ్మ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రత్యేక పూలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించి రథోత్సవం జరిపారు. రథోత్సవం సందర్భంగా భక్తులు రథానికి అరటి పండ్లు, దవనం విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పానకం, పెసరబేడలు అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

పథకాలతో జీవితాల్లో మార్పులు



లబ్ధిదారుడికి తాళం చెవిని అందిస్తున్న మంత్రి, ఎంపీ

కోలారు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు సౌలభ్యాలు ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మునిరత్న తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి లబ్ధిదారుల సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ, రాష్ట్ర ప్రజల జీవితాలను మెరుగు పర్చడానికి ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేశాయన్నారు. ఇందుకోసం లక్షల కోట్లను విడుదల చేశారన్నారు. లబ్ధిదారులందరిని ఒకచోట చేర్చి సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా సౌలభ్యాలను అందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి, పేదల పట్ల శ్రద్ధ తమ ప్రభుత్వ ఉద్దేశాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎస్‌ మునిస్వామి, ఎమ్మెల్యే కె శ్రీనివాసగౌడ, ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి, కలెక్టర్‌ వెంకటరాజ, సీఈఓ యుకేష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పాల ధర పెంపుతో రైతుకు లాభం



అమృత భవన కట్టడాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాలూరు: కోచిముల్‌ పాల ధరను రూ.2.10 ల మేర పెంచడం ద్వారా పాడి రైతులకు ఉగాది పండుగ కానుకను అందించిందని కోచిముల్‌ పాల సమాఖ్య అధ్యక్షుడు, ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. బుధవారం తాలూకాలోని దొడ్డశివార గ్రామంలో పాల రైతుల సహకార సంఘం నుంచి నిర్మించిన నూతన అమృత భవన కట్టడాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో రాజకీయాలను పక్కనబెట్టి సంఘ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. పాల ఉత్పత్తిని పెంచడానికి కోచిముల్‌ పాడి రైతులకు పశువుల మేతను కత్తిరించే కట్టర్‌, పాలు పితికే యంత్రాలు, మ్యాట్‌ అందిస్తున్నట్లు తెలిపారు. పాల సహకార సంఘాల్లో నివృత్తి పొందిన కార్యదర్శులకు, పాల పరీక్షకులకు, సహాయకులకు, పాడి రైతులకు బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

సిద్దరామయ్య పోటీపై విపక్షాల దుష్ప్రచారం

కోలారు: కోలారు నుంచి మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య పోటీపై విపక్షాలు అనవసర దుష్ప్రచారం చేస్తున్నాయని, దీనిని పార్టీ కార్యకర్తలు పట్టించుకోవద్దని ఎమ్మెల్సీ ఎంఎల్‌ అనిల్‌కుమార్‌ తెలిపారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో ఈనెల 20, 21 తేదీల్లో సిద్దరామయ్య కోలారులో చేపట్టనున్న పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దరామయ్య కోలారు నుంచి గెలిస్తే కార్యకర్తలకు అందుబాటులో ఉండరని, ఆయన కోసం బెంగళూరు వెళ్లాల్సి ఉంటుందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. విపక్షాల కుట్రలను తలదన్నేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్దరామయ్యను భారీ మెజార్టీతో గెలిపించి సీఎంని చేయాలన్నారు. సిద్దరామయ్య రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. పార్టీ గ్యారెంటీ కార్డులను ప్రతి ఇంటికీ చేర్చే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ పరిషత్‌ ఉప సభాపతి వీఆర్‌ సుదర్శన్‌, ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ, కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

జలజీవన్‌ పథకంతో ప్రతి ఇంటికీ నీరు

శ్రీనివాసపురం : జలజీవన్‌ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నీటి సౌకర్యాన్ని కల్పించామని ఎమ్మెల్యే కె ఆర్‌ రమేష్‌కుమార్‌ తెలిపారు. బుధవారం దొడ్డబందార్లహళ్లిలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, అంబేడ్కర్‌ భవనం, పాఠశాల ప్రహరీగోడను ప్రారంభించి ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను తమ పిల్లలుగా భావించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామీణ ప్రాంతంలో పార్టీల కతీతంగా తన అవధిలో ఇళ్లను నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. స్త్రీశక్తి సంఘాలకు త్వరలో రుణాలు అందిస్తామన్నారు. ఏడాదిలోగా ఎత్తినహొళె నీటిని తాలూకాకు తెచ్చి వ్యవసాయ అవసరాలకు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ అధ్యక్షుడు ఎం శ్రీనివాసన్‌, జీపీ అధ్యక్షురాలు గౌతమి మునిరాజు, సభ్యుడు బీఆర్‌ రమణారెడ్డి, సీడీపీఓ నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల సమ్మె ఉపసంహరణ

- వేతనం పెంపునకు ప్రభుత్వం అంగీకారం

శివాజీనగర: ఇంధన శాఖ ఉద్యోగుల వేతనాన్ని పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో గురువారం నుంచి చేపట్టాల్సిన సమ్మెను ఉద్యోగులు ఉపసంహరించుకున్నారు. కేపీటీసీఎల్, అన్ని ఎస్కాంల ఉద్యోగులు వేతన పెంపు కోసం గురువారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో వేతనాన్ని 20 శాతం పెంచుతూ 2022 ఏప్రిల్ నుంచి వర్తింపజేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో సమ్మెను ఉపసంహరించుకున్నట్లు కేఈబీ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు శివణ్ణ మీడియాకు తెలిపారు.

మధ్యంతర నివేదిక అందజేత

శివాజీనగర: వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి మధ్యంతర నివేదికను సమర్పించినట్లు రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్ అధ్యక్షుడు జయప్రకాష్ హెగ్డే తెలిపారు. బుధవారం దేవరాజ అరసు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టిన నాటినుంచి అనాథలైన వారిది ఏ కులమనేది తెలియదని, అందుచేత వారికి కేటగిరి 1లో రిజర్వేషన్ ఇవ్వాలని, అదే విధంగా పుట్టిన తరువాత కొన్ని సంవత్సరాల్లో తల్లిదండ్రులను కోల్పోయినవారికి కులం తెలిసి ఉంటుందని, కావున ఆ కులం ఆధారంగా రిజర్వేషన్ ఇవ్వాలని సిఫార్సు చేసినట్లు తెలిపారు.

స్పీకర్‌కు చేదు అనుభవం

యశవంతపుర: అభివృద్ధి పనులకు వెళ్లిన స్పీకర్‌కు స్థానికులనుంచి చుక్కెదురైంది. ఉత్తరకన్నడ జిల్లా సిద్దాపుర తాలూకాలో బేడ్కణి గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయటానికి స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి బుధవారం వెళ్లారు. అయితే అక్కడ గతంలో చేసిన సీసీ రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నట్లు స్థానికులు వాదనకు దిగారు. దీంతో శంకుస్థాపన చేయకుండానే స్పీకర్ వెనుదిరిగారు.

కన్నడలో మాట్లాడాలని నటుడికి వేధింపులు

యశవంతపుర: నటుడు సల్మాన్ యూసుఫ్ ఖాన్‌కు అవమానం జరిగింది. దుబాయ్‌కు వెళ్తున్న విమానంలో కన్నడంలో మాట్లాడాలని విమాన సిబ్బంది వేధించినట్లు బుధవారం ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నాడు. 'దుబాయ్‌కు వెళ్తుండగా విమాన సిబ్బంది కన్నడలో మాట్లాడారు. అదే భాషలో మాట్లాడటానికి యత్నించినా సాధ్యం కాలేదు. తాను బెంగళూరుకు చెందిన వ్యక్తినని పాస్‌పోర్టు చూపించా...నీ తండ్రి బెంగళూరులో పుట్టారు. నీకెందుకు కన్నడరాదు' అంటూ హేళనంగా మాట్లాడినట్లు సల్మాన్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను దుబాయ్‌లో పెరిగినందున కన్నడ రాదని చెప్పినా వినకుండా హేళన చేశారన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

శివమొగ్గ: పార్కులో గంజాయి విక్రయిస్తుండగా నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన శివమొగ్గ నగరం గుండప్ప షెడ్ మల్లేశ్వర నగర పబ్లిక్ పార్కులో మార్చి 14న జరిగింది. రాజీవ్ గాంధీ లేఔట్ నివాసి మహమ్మద్ హుస్సేన్ (23) అనే నిందితున్ని పోలీసులు పట్టుకున్నారు. ఇతని వద్ద నుంచి సుమారు రూ.5 వేల విలువ చేసే 204 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

చిల్లర కొట్టులో గంజాయి

మైసూరు: చిల్లర దుకాణంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు 890 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు హుణసూరు డీఎస్పీ మహేశ్ ఎంకే తెలిపారు. హెచ్‌డీ కోటె తాలూకా చక్కోడనహళ్లి శివణ్ణాచారి అనే వ్యక్తి చిల్లర అంగడిలో దాడి చేసి సోదాలు నిర్వహించగా గంజాయి ప్యాకెట్లు లభించాయి. తూకం యంత్రం కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మండ్య/మైసూరు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. బెంగళూరులోని మండ్య హాలహళ్లి లేఔట్‌కు చెందిన కృష్ణమూర్తి కుమారుడు సుహాస్ (25) బెంగళూరులోని సుకాన్ కంపెనీలో సైట్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఈయన బైక్‌పై వెళ్తుండగా మద్దూరు తాలూకా గెజ్జలగెరె కాలనీ సమీపంలో టిప్పర్ ఢీకొని మృతి చెందాడు. అదేవిధంగా మైసూరు దేవలాపుర సర్కిల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంజనగూడు తాలూకా చిక్కయ్యనఛత్ర నివాసి మహేశ్ (49) మృతి చెందాడు. స్నేహితుడు స్వామితో కలసి స్కూటర్‌లో హడజన గ్రామం నుంచి మైసూరు వైపు వెళ్తుండగా లారీ వెనుక భాగం బైక్‌కు తగిలి ఈ ప్రమాదం జరిగింది.

గోదాములో అగ్ని ప్రమాదం

దొడ్డబళ్లాపురం: పట్టణ పరిధిలోని రోజిపుర నివాసి నవీన్ పాలన్‌జోగ్లి వద్ద గోడౌన్ ఏర్పాటు చేసి ప్లాస్టిక్ డ్రమ్ములు నిల్వ ఉంచాడు. గోడౌన్ వెనుక ఎండుగడ్డికి నిప్పంటుకోగా మంటలు గోడౌన్‌కు వ్యాపించి డ్రమ్ములు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపకదళం సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. రూ.25 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని నవీన్ తెలిపాడు.

నగలు చోరీ

మైసూరు: మైసూరు తాలూకా బెళవత్త గ్రామంలో ఓదేశ్‌రాజే అరస్ వ్యక్తి ఇంటిలో దొంగలు చొరబడి రూ. 4.97 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 20 వేల నగదు దోచుకెళ్లారు.

మైసూరు: నంజనగూడు తాలూకా చుంచనహళ్లి గ్రామ శివార్లలోని మాదయ్యనగుడి మహదేశ్వర స్వామి ఆలయంలోకి మంగళవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. హుండీని పగులగొట్టి నగదు, నగలు దోచుకున్నారు.

రూ.4.33 కోట్ల చోరీసొత్తు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి



చోరీసొత్తు ను పరిశీలిస్తున్న సీహెచ్.ప్రతాప్‌రెడ్డి, సందీప్‌పాటిల్, శ్రీనివాసగౌడ, నారాయణస్వామి

బనశంకరి: బెంగళూరు నగరంలో కేంద్రవిభాగ పరిధిలోని అశోక్‌నగర, వివేక్‌నగర, హలసూరుగేట్, ఎస్‌జే.పార్కు, సంపంగిరామనగర, విల్సన్‌గార్డెన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. 11 మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.4 కోట్ల 33 లక్షల 93 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నగరపోలీస్ కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. అశోక్‌నగర పోలీసులు శంకర్ అనే దొంగను అరెస్ట్‌చేసి 223 గ్రాముల బంగారు, 232 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1.98 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వివేక్‌నగర పోలీసులు శ్రీనివాస్ అనే చోరీదారుడిని అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువైన 301 గ్రాముల బంగారు, 378 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు కొనుగోలు చేసిన భవర్‌లాల్‌ను అరెస్ట్ చేశారు. హలసూరుగేట్ పోలీసులు యాసిన్‌ఖాన్ అనే దొంగతోపాటు చోరీసొత్తును కొనుగోలు చేస్తున్న నూరుల్లా అలియాస్ సల్మాన్‌ను అరెస్ట్‌చేశారు. రూ.70 లక్షల విలువైన 1.522 గ్రాములు బంగారు, 100 గ్రాములు వెండి, 4 గడియారాలు, నీకుంచ్‌కుమార్ అనే దొంగను ఎస్‌జే పార్కుపోలీసులు అరెస్ట్ చేసి 6 కిలోల 500 బంగారు నగలు, సంపంగి రామనగర పోలీసులు ఖంబర్‌శెట్టి ఇరానీని అరెస్ట్‌చేసి రూ.2.50 లక్షల విలువైన బంగారు వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. విల్సన్‌గార్డెన్ పోలీసులు గుర్రప్పనపాళ్య సయ్యద్‌సబీర్, హర్మాన్‌ను అరెస్ట్‌చేసి రూ.90 లక్షల విలువైన బంగారు చైన్, స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. శేషాద్రిపురం పోలీసులు రూపేశ్‌సింగ్ అనే దొంగను అరెస్ట్ చేసి రూ.3 లక్షల విలువైన 70 గ్రాము బంగారు బిస్కెట్లు, యశవంతపుర ప్రశాంత్ అనే దొంగను అరెస్ట్‌చేసి 72 గ్రాముల బంగారు నగలు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఐదు చోట్ల విమానాశ్రయాలు

- మంత్రి మురుగేశ్‌నిరాణి

బనశంకరి: రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని దావణగెరె, బాగల్‌కోటె జిల్లా బాదామి, కొప్పళ,రాయచూరు, చిక్కమంగళూరులో విమానాశ్రయాల నిర్మాణానికి చర్యలు చేపడతామని భారీ మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి మురుగేశ్ నిరాణి బుధవారం తెలిపారు. హాసన, విజయపుర విమానాశ్రయ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధికి దోహదంచేసేలా మెగా టెక్స్‌టైల్‌పార్కును కేంద్రం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

20న ఆటో సంచారం బంద్

బనశంకరి: తమ జీవనోపాధికి గండి కొడుతున్న ర్యాపిడో బైక్ ట్యాక్సీని నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న బెంగళూరులో ఆటోల బంద్ నిర్వహించనున్నట్లు ఆదర్శ ఆటో యూనియన్ అధ్యక్షుడు మంజునాథ్ బుధవారం తెలిపారు. అదే రోజు సీఎం బసవరాజబొమ్మై ఇంటిని ముట్టడిస్తామన్నారు. ర్యాపిడో బైకు ట్యాక్సీ సంచారం నిలిపివేయాలని పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ప్రభుత్వంపై మండిపడ్డారు.

కుటుంబ కలహాలతో తండ్రి ఆత్మహత్య

- మనో వేదనతో కుమారుడు కూడా బలవన్మరణం



మృతులు నాగేగౌడ, మధు(ఫైల్)

మైసూరు: తండ్రి చనిపోయిన కాసేపటికే కొడుకు కూడా మరణించిన విషాద ఘటన హెచ్‌డీ కోటె జక్కళ్లి కాలనీలో జరిగింది. జక్కళి కాలనీకి చెందిన నాగేగౌడ(55) ఇంటిలో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. విసిగిపోయిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. తండ్రి మరణం విషయం తెలిసిన కుమారుడు మధు (24) మనస్తాపానికి గురై పొలానికి వెళ్లి అక్కడే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం తండ్రి, కుమారుల మృతదేహాలకు ఒకేసారి అంత్యక్రియలను నిర్వహించారు.

రూ.20 కోట్లతో పాలికె బడ్జెట్



బడ్జెట్ పత్రాలతో పాలికె కార్యాలయంలోకి అడుగు పెడుతున్న మేయర్ ప్రభావతి

తుమకూరు: ఆదాయ పన్ను పెంచకుండానే తుమకూరు నగర సమగ్రాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ 2023–2024 సంవత్సరానికి బడ్జెట్ రూపొందించారు. సుమారు రూ. 4.57 కోట్ల మిగులుతో రూ.20 కోట్లతో బడ్జెట్‌ను పాలికె ఆర్థిక శాఖ స్థాయీ సమితి అధ్యక్షురాలు నూరు ఉన్నిసాబాను బుధవారం పాలికె సభాభవనంలో ప్రవేశపెట్టారు. అనారోగ్య కారణాలతో మేయర్ ప్రభావతి సుధీశ్వర్‌ను చదవాలని ఆమె మనవి చేశారు. తాగు నీరు, ఆరోగ్యం, స్వచ్ఛత, రోడ్డు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి వంటి వాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారు. అంత్య క్రియలకు వినియోగించే వాహనం రుసుం, విద్యుత్ శ్మశాన వాటిక రుసుంకు మినహాయింపు ఇచ్చారు. అయితే ఈ సారి బడ్జెట్‌లో కొత్తదనం ఏమి లేదని ప్రతిపక్షాలు పెదవి విరిచాయి. మేయర్ ప్రభావతి మొత్తం రూ. 20,409 కోట్ల విలువ కలిగిన బడ్జెటను తీసుకొచ్చారు.

హత్యకేసులో యావజ్జీవ కారాగార శిక్ష

శివమొగ్గ: పొలం తగాదాల్లో సోదరుడిని హత్య చేసిన సొరబ తాలూకా కొలగుణస గ్రామానికి చెందిన మంజు అలియాస్ మంజునాథ్ (25)కు జీవిత ఖైదు, రూ. 1.40 లక్షల జరిమానా విధిస్తూ శివమొగ్గ మూడో అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం తీర్పువెలువరించింది. జరిమానా కట్టకపోతే ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ఇదే కేసుకు సంబంధించి మరో నలుగురికి నెల రోజుల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. శికారిపుర తాలూకా శిరాళకొప్ప పోలీసు స్టేషన్ పరిధిలోని కణసోగి గ్రామ నివాసి బంగారప్ప (40)కు, సోదరుడు మంజునాథ్ మధ్య పొలం వివాదం ఉంది. 2019 జూన్ 16న బంగారప్ప, మంజునాథ్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో ఐరన్ రాడ్‌తో బంగారప్ప తలపై మంజునాథ్ కొట్టి గాయపరిచాడు. బంగారప్పను ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మూడు రోజుల అనంతరం మరణించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శిరాళకొప్ప పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు మంజునాథ్, మరో నలుగురిని అరెస్ట్ చేశారు.

నవ వధువు అనుమానాస్పద మృతి



అక్షిత(ఫైల్)

యశవంతపుర: నవ వధువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కొడగు జిల్లా కుశాలనగర తాలూకా హోసకోట గ్రామంలో జరిగింది. హేమంత్, అక్షిత(18) రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. అయితే యువతి దళితురాలు రావడంతో వీరి వివాహానికి హేమంత్ పెద్దలు అంగీకరించలేదు. దీంతో ఈ జంట మూడు రోజుల క్రితం ఆలయంలో వివాహం చేసుకుంది. హేమంత్ తన భార్యను తీసుకొని ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు లోపలకు అనుమతించలేదు. ఈక్రమంలో అక్షిత బుధవారం ఉదయం రక్తపు మడుగులో ఉండగా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా హేమంత్ తల్లిదండ్రులే తమ కుమార్తె మృతికి కారణమని అక్షిత తల్లిదండ్రులు కుశాల నగర గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మడికేరి జిల్లా ఆస్పత్రిలో మృతదేహంకు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

నగరంలో కిరాతక ప్రియుడు

- ప్రియురాలిపై లైంగికదాడి చేసి హత్య
- వేరొకరితో పెళ్లి కుదిరిందని ఘోరం



శివాజీనగర: ప్రేమించిన యువతిపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడి ఆ తరువాత దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేసిన సంఘటన ఉద్యాననగరిలో విల్సన్ గార్డన్‌లో చోటు చేసుకుంది. విల్సన్ గార్డన్ వినాయకనగరకు చెందిన యువతి హతురాలు. ఆమె ప్రియుడు మనోజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

ఇంట్లో ఎవరూ లేనప్పుడు వెళ్లి

వివరాలు.. రోడ్డు నిర్మాణ పనుల కంపెనీలో పని చేస్తున్న మనోజ్, యువతి ఇద్దరు ప్రేమించుకొన్నారు. అయితే యువతికి తల్లిదండ్రులు మరో యువకునితో వివాహం నిశ్చయం చేశారు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. మంగళవారం సాయంత్రం యువతి ఇంటిలో ఎవరూ లేరని తెలుసుకొన్న మనోజ్ ఆమె ఇంటికి వచ్చాడు. గొడవపడి ఆమెను దిండుతో ఊపిరాడకుండా చేసి పరారై కే.పీ.అగ్రహారంలోని ఇంటికి వెళ్లి మనోజ్ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి అతన్ని ఆసుపత్రిలో చేర్చారు.

మృతదేహంపై గాయాలు

బయటకు వెళ్లినవారు ఇంటికి రాగా, యువతి శవమై పడి ఉంది. ఇంకా బతికి ఉందేమోనని ఆస్పత్రికి తరలించారు. తరువాత విల్సన్ గార్డన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి దేహం, ప్రైవేటు భాగాల్లో గాయాలు, రక్తస్రావం, గాయాలు బయటపడ్డాయి. బలవంతంగా లైంగిక దాడి తరువాత దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు వైద్య పరీక్షల్లో అనుమానం వ్యక్తమైంది. ఇన్‌స్పెక్టర్ రాజు కార్యచరణ చేపట్టి ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకొన్న నిందితున్ని అరెస్ట్ చేశారు.

తెలుగు పాఠశాలలకు చేయూత



గదుల భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రిజ్వాన్ స్థానిక నాయకులు

శివాజీనగర: బెంగళూరులో నగరంలోనే అత్యధికంగా తెలుగు ప్రజలు ఉన్న ప్రాంతమైన ఎంఆర్‌ఎస్ పాళ్యలో ప్రభుత్వ తెలుగు– కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలను అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్ తెలిపారు. బుధవారం ఈ పాఠశాలకు వివేక్ పథకం కింద మంజూరైన అదనపు తరగతి గదులకు భూమి పూజ చేసిన తరువాత మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రత్యేక తెలుగు పాఠశాల నిర్మాణమయ్యేలా చర్యలు తీసుకొంటానని తెలిపారు. ఈ ప్రాంతంలో తెలుగు పాఠశాలకు కేటాయించిన స్థలంలో కట్టడాలు నిర్మించకుండా కొందరు స్వార్థపరులు అడ్డుపడినట్లు తెలిసిందని, త్వరలోనే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కాగా, ఈ నెల 18న శివాజీనగర చాందిని చౌక్‌లో నిర్వహించే శివాజీనగర పండుగలో అందరూ పాల్గొనాలని కోరారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



భృగుతీర్థంలో శ్రీవారికి చక్రస్నానం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం(తీర్థవాది) బుధవారం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీవారి సుదర్శన చక్రానికి భృగుతీర్థంలో చక్రస్నానం చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ దివ్యాయుధం ముంచిన పుష్కరిణి జలంతో స్నానమాచరించారు. పక్షం రోజుల పాటు సాగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతమై లోకం క్షేమంగా ఉండటానికి, భక్తులు సుఖశాంతులతో ఉండేందుకు చక్రస్నానం నిర్వహిస్తామని అర్చక పండితులు వివరించారు.

చక్రస్నానంతో యజ్ఞఫలం

బ్రహ్మోత్సవాలు నిర్వహించిన వారికి.. ఇందుకు సహకరించిన వారికి ..ఉత్సవాల్లో శ్రీవారిని దర్శించుకున్న వారికి ఇలా..అందరికీ శ్రీవారి చక్రస్నానంతో ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుందని అర్చక పండితులు వివరించారు. చక్రస్నానానికి ముందు స్వామి వారికి విష్వక్సేన ఆరాధన, పుణ్య హవచనం, ముఖ ప్రక్షాళన, ధూప దీప నైవేద్యం, ఛత్ర, ఛామర, వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు.

ధ్వజావరోహణం

ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతా మూర్తులను ఆహ్వానించేందుకు ఉత్సవాల ప్రారంభం నాడు అర్చకులు ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం చేసి గరుడ పతాకం ఎగురవేశారు. శ్రీవారి చక్రస్నానం అనంతరం ఆ ధ్వజపటాన్ని అవరోహనం చేశారు. దీన్నే కదిరి ప్రాంతంలో కంకణాలు విప్పడం అంటారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ముక్కోటి దేవతలకు ధ్వజావరోహణంతో వీడ్కోలు పలికినట్లు అయ్యిందని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలియజేశారు.

4 గంటల నుంచి ఆలయం మూత

బ్రహ్మోత్సవాల అంకురార్పణ నాటి నుంచి తీర్థవాది వరకూ స్వామి వారు యాగశాలలోనే గడిపారు. తీర్థవాది ముగించుకొని బుధవారం స్వామి వారు తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం తలుపులు మూసివేశారు. తిరిగి గురువారం(నేటి) ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పుతారు. ఎప్పటిలాగానే శ్రీవారు ఆలయంలో యథాప్రకారం పూజలు అందుకొని భక్తులకు దర్శనమిస్తారు. తీర్థవాది ఉత్సవంలో ఈఓ పట్టెం గురుప్రసాద్, పాలక మండలి చైర్మన్ జెరిపిటి గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, పోలీసులుతో పాటు పాల్గొన్న భక్తులందరూ రంగులు చల్లుకొని ఆనందోత్సాహాలతో గడిపారు.



పాలు, తేనె, కొబ్బరి నీళ్లతో శ్రీవారికి స్నపనం

హోసూరు వార్తలు..

మహిళ మృతిపై పోలీసులకు ఫిర్యాదు

కెలమంగలం: కెలమంగలం సమీపంలో మహిళ మృతిపై ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కెలమంగలం సమీపంలోని యూ.పురం గ్రామానికి చెందిన గణేష్‌తో సూళగిరి తాలూకా ఏ.శెట్టిపల్లి సమీపంలోని ఎస్. తిమ్మసంద్రం గ్రామానికి చెందిన రామచంద్రన్ కూతురు కళ (26)కు 2016లో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొన్నిరోజుల క్రితం కళ తల్లిదండ్రులు కూతురిని కలిసి మాట్లాడి వెళ్లారు. కళ మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కెలమంగలం పరిశీలించి పోలీసులు కేసు నమోదు చేశారు. కూతురి మృతిపై సందేహం ఉన్నట్లు మృతురాలి తల్లిదండ్రులు కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెళ్లయి ఏడేళ్లలోపు కావడంతో హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య కేసు విచారణ చేపట్టారు.

మసాజ్ సెంటర్‌పై దాడి

హోసూరు: మసాజ్ సెంటర్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్న కేరళ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. హోసూరు పట్టణంలోని శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయానికెళ్లే మార్గంలో మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు తెలిసి మత్తిగిరి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సావిత్రి నేతృత్వంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. మసాజ్ సెంటర్‌ను నిర్వహిస్తున్న కేరళ రాష్ట్రం ఇడుక్కి జిల్లాకు చెందిన జిస్నామోల్ బేబి (28)ని అరెస్ట్ చేశారు.

అటవీశాఖ ఉద్యోగికి గాయాలు

మైసూరు: ఏనుగు దాడి నుంచి తప్పించుకునే క్రమంలో అటవీశాఖ ఉద్యోగి గాయపడ్డాడు. మడికేరి జిలాల పొన్నంపేట తాలూకా బేగూరు గ్రామంలో ఈఘటన జరిగింది. పిల్ల ఏనుగు మృతితో కొన్ని రోజులుగా తల్లి ఏనుగు మనో వేదనకు గురైంది. ఈక్రమంలో అటవీ సిబ్బంది కనిపించగా దాడికి యత్నించింది. తప్పించుకునే క్రమంలో తేజస్ అనే అటవీ ఉద్యోగి కిందపడి గాయపడగా సుళ్య ఆస్పత్రికి తరలించారు.

బాలుడి జలసమాధి



స్నేహితుడిని రక్షించేందుకు యత్నిస్తున్న బాలురు, (ఇన్‌సెట్‌లో) మృతుడు మనోజ్

చిక్కబళ్లాపురం: బాలుడు జల సమాధి అయ్యాడు. బుధవారం బెంగళూరుకు చెందిన పదిమంది బాలురు ఈశాఫౌండేషన్ ఆదియోగిని వీక్షించేందుకు వచ్చారు. తర్వాత కౌరనహళ్లిలో ఓ క్వారీలో ఈతకు వెళ్లారు. మనోజ్(17) అనే బాలుడు లోతు ఉన్న ప్రాంతంలో నీట మునిగిపోయాడు. స్నేహితులు రక్షించేందుకు యత్నించి విఫలమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు.

బోనులో పడ్డ చిరుత

దొడ్డబళ్లాపురం: నెలమంగల తాలూకా మల్లరబాణవాడి గ్రామ పరిసరాల్లో సంచరిస్తూ జంతువులను హతమారుస్తున్న చిరుత బుధవారం బోనులో పడింది. అటవీ సిబ్బంది చిరుతను తీసుకెళ్లారు.

భార్య, ఆమె ప్రియుని చేతిలో భర్త హత్య

క్రిష్ణగిరి: అక్రమ సంబంధానికి అడ్డుపడుతున్న భర్తను భార్య, ప్రియుడు కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన మంగళవారం రాత్రి నాగరసంబట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని ఎస్.తట్టకల్ గ్రామానికి చెందిన కందన్ (35) టైల్స్ వ్యాపారం చేస్తూ, టెంపో వ్యాన్ నడిపేవాడు. 5 ఏళ్ల క్రితం సంధ్య (27) అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొన్నాడు. కందన్ తరచూ వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాలకెళ్లేవాడు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన శివశక్తి (23)తో సంధ్యకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇది తెలుసుకొన్న కందన్ భార్యను నిలదీశాడు. మంగళవారం పనిమీద బయటకెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటికి రాగా, సంధ్య శివశక్తితో కలిసి ఉండడాన్ని గమనించి భార్యపై దాడి చేశాడు. అయితే భార్య, ప్రియుడు కలిసి కందన్‌ను అడ్డుకుని కత్తితో పొడిచారు. తీవ్ర గాయాలేర్పడిన అతన్ని స్థానికులు చికిత్స కోసం కావేరిపట్టణం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నాగరసంబట్టి పోలీసులు కేసు నమోదు చేసుకొని సంధ్య, శివశక్తిలను అరెస్ట్ చేశారు.

వ్యవసాయ శాఖ పథకాలపై ప్రచారం

హోసూరు: హోసూరు తాలూకా నాగొండపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందజేస్తున్న పథకాలపై సాంస్కృతిక ప్రదర్శనతో చైతన్యం కల్పించారు. హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జగదేవి శ్రీ వినాయక కళా బృందం పాల్గొని వరిసాగు, పంటల బీమా పథకం, సంయుక్త వ్యవసాయం , కంది నాట్లు వేయడంతో ఫలితాలు, వ్యవసాయ శాఖద్వారా రైతులకు అందజేసే యంత్రాలు, రాయితీలపై సాంస్కృతిక కార్యక్రమం ద్వారా వివరించారు.

నర్సరీ ఫాం పరిశీలన : జీనూరు వద్ద ఉద్యానవన, అటవీశాఖ ప్రభుత్వ నర్సరీ ఫాంను బుధవారం కలెక్టర్ దీపక్‌జేకబ్ పరిశీలించారు. నర్సరీలో ఉత్పత్తి చేస్తున్న మొక్కలు, అట్లు వేయడం, మామిడి, జామ, దానిమ్మ, ఉసిరి, బత్తాయి, కొబ్బరి, మునగ, తదితర మూలిక మొక్కల ఉత్పత్తిని పరిశీలించారు. ఉద్యానవన శాఖాధికారి భూపతి, సతీష్‌కుమార్ ఉన్నారు.

తిరుమలకు ఉచితయాత్ర

మైసూరు: ఎన్‌ఆర్ నియోజకవర్గం పరిధిలోని శ్రీ కల్యాణ లక్ష్మీ వెంకటరమణ స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరిధర్ నేతృత్వంలో తిరుమలకు ఉచిత యాత్రను నిర్వహించారు. 550 మంది యాత్రికులు పది బస్సుల్లో తరలివెళ్లారు.

రట్టిహళ్లిలో హైఅలర్ట్

యశవంతపుర: హావేరి జిల్లా రట్టిహళ్లిలో హైఅలర్ట్ ప్రకటించారు. సంగొళ్లి రాయణ్ణ విగ్రహం ఊరేగింపులో ఒక వర్గంపై మరో వర్గం వారు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఏడీజీపీ అలోక్ కుమార్ రట్టిహళ్లిలో పర్యటించారు. రెండు వర్గాల మధ్య శాంతిసభను నిర్వహించి భద్రతపై సమీక్షించారు. గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. రాళ్లు రువ్విన ఘటనలో 15 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి ఆత్మహత్య

యశవంతపుర: ప్రేమ వైఫల్యంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. గదగ తాలూకా కణగినహాళ్ళ గ్రామానికి చెందిన పార్వతి(24) మరో కులం వ్యక్తిని ప్రేమిస్తోంది. కుటుంబ సభ్యులు వ్యతిరేకించగా తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

నిందితుడి అరెస్ట్

యశవంతపుర: కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్న కావూరు కుంజత్తబైల్ నివాసి రోహన్‌రెడ్డి(36) అనే నిందితుడిని మంగళూరు పోలీసులు బెంగళూరులో అరెస్ట్ చేశారు. నిందితుడిపై మంగళూరులో దాడి, హత్యాయత్నం, హత్యకేసులున్నాయి.

విలువైన జీవితం..అర్ధాంతరం

- హోసూరు ప్రాంతంలో వేర్వేరుగా ముగ్గురు ఆత్మహత్య



హోసూరు: సమస్యలు వస్తే పరిష్కరించుకుని సాగిపోవాల్సిన జీవితాలను చిన్న చిన్న సమస్యలకే చాలించుకుంటూ అయినవారికి బతుకంతా విషాదం నింపుతున్నారు. హోసూరు ప్రాంతంలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యలు చేసుకొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని

హోసూరు సమీపంలోని వన్నలవాడి గ్రామానికి చెందిన శ్రీధర్ (34) కూలికార్మికుడు. భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవల్లో భార్య కోపగించుకొని పుట్టింటికెళ్లిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీధర్ నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. విషయం తెలుసుకొన్న హోసూరు పట్టణ పోలీసులు శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు.

సంతానం కలగలేదని వివాహిత

పట్టణంలోని పార్వతీనగర్‌కు చెందిన సేతుపతి భార్య సత్య (29). వీరికి పిల్లలు కలగకపోవడంతో కుటుంబంలో తరచూ గొడవలేర్పడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెందిన సత్య నిప్పంటుంచుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం గమనించిన స్థానికులు మెరుగైన చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక మృతి చెందింది.

నగల కుదువపై గొడవపడి

నగల కుదువపై భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవల్లో మహిళ ఉరివేసుకొంది. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని జి.కే.ఎస్.నగర్ ప్రాంతానికి చెందిన వెంకటేష్ భార్య ఉమ(49). బ్యాంకులో తాకట్టు పెట్టిన నగలను విడిపించి ఇవ్వాలని భర్తను ఒత్తిడి చేస్తూ వచ్చింది. భర్త పట్టించుకోకపోవడంతో విరక్తి చెందిన ఉమ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

గవర్నర్‌ను కలసిన ఏపీపీఎస్సీ చైర్మన్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సవాంగ్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్ దామోదర గౌతమ్ సవాంగ్ బుధవారం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కలిశారు. కమిషన్ కార్యకలాపాల గురించి గవర్నర్‌కు వివరించారు. ప్రస్తుతం జరుగుతోన్న రిక్రూట్‌మెంట్లు, నియామకాలను సకాలంలో పూర్తి చేసేందుకు అనుసరిస్తున్న విధానాల గురించి గవర్నర్‌కు విన్నవించారు.

గవర్నర్‌ను కలిసిన పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్



గవర్నర్‌తో జస్టిస్ రామలింగేశ్వరరావు

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్యానికి చేరువగా అల్బెండజోల్ మాత్రల పంపిణీ

సాక్షి, అమరావతి: పిల్లల్లో నులిపురుగుల నిర్మూలన కోసం వైద్య శాఖ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీని చేపట్టింది. అంగన్‌వాడీలు, ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లోని 1.07 కోట్ల మంది 1–19 ఏళ్లలోపు వారు, కిశోర బాల బాలికలకు మాత్రలు పంపిణీ చేయాలని వైద్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 99 లక్షల మందికి పంపిణీ పూర్తి చేసింది. దీనిపై థర్డ్ పార్టీతో కూడా వైద్య శాఖ ఆరా తీసింది. ప్రతి జిల్లా నుంచి ర్యాండమ్‌గా కొందరిని ఎంపిక చేసి వారికి నిజంగా మాత్రలు అందాయో, లేదో తెలుసుకుంది. మిగిలిన వారికి కూడా ఈ నెల 18న మాత్రలు పంపిణీ చేస్తామని ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎస్సీ కమిషన్ పరిధిలోకి సఫాయి కార్మికులు

సాక్షి, అమరావతి: సఫాయి కార్మికులను ఎస్సీ కమిషన్ పరిధిలోకి తీసుకువస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఎస్సీల సమస్యలు, హక్కులపై స్పందించి చర్యలు తీసుకునే ఎస్సీ కమిషన్ ఇకపై సఫాయి కర్మచారుల కోసం కూడా స్పందించి చర్యలు తీసుకుంటుంది. మాన్యువల్ స్కావెంజర్స్(పారిశుద్ధ్య కార్మికులు) ఉపాధిని నిషేధించడం, పునరావాస చట్టంలోని సెక్షన్ 31లోని సబ్ సెక్షన్(1)లో పేర్కొన్న జాతీయ కమిషన్ అధికారాలను ఏపీ స్టేట్ షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) కమిషన్ నిర్వహిస్తుంది.

వక్ఫ్‌బోర్డు ప్రత్యేక అధికారిగా షెరీన్ బేగం

సాక్షి, అమరావతి: ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారిగా షేక్ షెరీన్ బేగంను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. వక్ఫ్ బోర్డు పాలకవర్గ పదవీకాలం పూర్తికావడంతో సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షెరీన్ బేగంను ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా నియమించింది. వక్ఫ్ బోర్డు కొత్త పాలకవర్గం ఏర్పటయ్యే వరకు ఆమె ప్రత్యేక అధికారిగా కొనసాగుతారు.

అబద్ధాలు అచ్చేసిన రామోజీని సభకు పిలిచి విచారించాలి

తప్పు కేశవ్‌దో.. రామోజీదో తేలాలి

సభా హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గవర్నర్‌ను అవమానించారంటూ ఈనాడు కథనంపై అధికారపక్ష సభ్యుల మండిపాటు
- గవర్నర్‌కు స్వాగతం పలికిన దృశ్యాల వీడియో సభలో ప్రదర్శన
- ఎల్లో మీడియా దుష్ప్రచారంపై సభలో ప్రత్యేక చర్చ జరపాలని విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: చట్ట సభను, రాజ్యాంగ వ్యవస్థను, గవర్నర్‌ను కించపరిచేలా అబద్ధాలను ఈనాడులో అచ్చేసి రామోజీరావు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని, ఆయన్ను సభకు పిలిచి విచారించి, కఠిన చర్యలు తీసుకోవాలని శాసనసభలో అధికారపక్షం డిమాండ్ చేసింది. సీఎం రాకకోసం గవర్నర్ వేచి ఉండాలా అని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నట్టు ప్రస్తావిస్తూ ఈనాడు రాసిన తప్పుడు కథనంపై బుధవారం శాసనసభ అట్టుడికింది. గవర్నర్‌ను కించపరుస్తూ ఈనాడు అచ్చేసిన కథనంపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ కమిటీ విచారణ చేపట్టి కేశవ్ తప్పు మాట్లాడారా.. రామోజీ తప్పు రాశారా.. అనే విషయం తేల్చాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు పట్టుబట్టారు. ఈనాడు వార్త క్లిప్పింగ్‌లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించిన సభ్యులు.. ఎల్లో మీడియాను ఏకిపారేశారు. అలాంటి వ్యాఖ్యలు తాను చేయలేదని దమ్ముంటే నిరూపించాలని పయ్యావుల కేశవ్ అనడంపై అధికారపక్ష సభ్యులు మండిపడ్డారు. సభకు దమ్ము ధైర్యం అని సవాలు చేయవద్దని, కేశవ్ తప్పు మాట్లాడినా, ఈనాడు తప్పు రాసినా ప్రివిలేజ్ కమిటీ విచారణలో నిర్ధారణ అయితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ చర్చకు అడుగడుగునా టీడీపీ సభ్యులు అడ్డుతగలడంతో సభ దృష్టికి వాస్తవాలు తెచ్చేందుకు తొలిరోజున గవర్నర్‌కు స్వాగతం పలికిన వీడియోను ప్రదర్శించి సభ్యులకు వాస్తవాలు చూపించారు. అయినప్పటికీ పయ్యావుల కేశవ్ పదే పదే వాదనకు దిగడంతో గవర్నర్ విషయంలో ఆయన చేసిన కామెంట్ల వీడియో సైతం సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, అధికారపార్టీ నేతలు మాట్లాడారు.

రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే: మంత్రి బుగ్గన



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలకడంలో ప్రొటోకాల్ పాటించలేదంటూ అబద్ధపు రాతలు రాయడం రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా వెళ్లి గవర్నర్‌కు ఘనస్వాగతం పలికి సభలోకి తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్ ఉదయం 9.45 గంటలకు అసెంబ్లీకి వచ్చారు. 9.53కు గవర్నర్ వచ్చారు. గవర్నర్‌ను రిసీవ్ చేసుకున్న సీఎం 10.02 గంటలకు స్పీకర్ చాంబర్‌కు తీసుకొచ్చారు. గవర్నర్‌కు గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన అభ్యర్థన మేరకు కొంత సేపు ఆగి ఆయన రెడీ అయిన తర్వాత గౌరవ సభలోకి తీసుకొచ్చాం. ప్రభుత్వ పనితీరు, విజన్‌ను గవర్నర్ చదివితే.. ఆ ప్రసంగాన్ని సైతం టీడీపీ సభ్యులు చాలా హేళన చేశారు. తప్పుడు వార్తలతో గౌరవ సభను, గవర్నర్‌ను అవమానిస్తూ కథనాలు రాసిన ఈనాడుపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా స్పీకర్‌ను కోరుతున్నా.

చంద్రబాబు, ఎల్లో మీడియా తోడుదొంగలు: మాజీ మంత్రి కన్నబాబు



టీడీపీకి విషపుత్రికలుగా ఎల్లో మీడియా రోజురోజుకు దిగజారిపోతోంది. చంద్రబాబు, ఎల్లోమీడియా తోడుదొంగలుగా కలిసి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ రాష్ట్రంలో భయానక పరిస్థితులు సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారు. ఎల్లో మీడియా వక్రీకరణపై అసెంబ్లీలో చర్చ జరపాలి. టీడీపీ, ఎల్లోమీడియా అబద్ధాలు ప్రచారం చేస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచేలా వ్యవహరిస్తున్నాయి.

విలువలులేని టీడీపీ: మంత్రి నాగార్జున



ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై గౌరవం ఉంటే గవర్నర్ ప్రసంగం కాగితాలను చించివేసి టీడీపీ సభ్యులు మధ్యలోనే వెళ్లిపోయేవారు కాదు. విలువలు, విశ్వసనీయత లేని రాజకీయం చేస్తున్న టీడీపీ సభ్యులు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. సభా హక్కుల ఉల్లంఘన విషయంలో రామోజీరావుపై చర్యలు తీసుకోవాలి.

చర్చ జరగాల్సిందే: మంత్రి అంబటి



సభలో చర్చ జరగకపోతే ఈనాడు రాసిందే నిజమని ప్రజలు అనుకుంటారు. ప్రజలకు వాస్తవాలను ఈ సభ ద్వారా తెలియచేయాలి. టీడీపీ సభ్యులు సభా సంప్రదాయాలను మర్చిపోతున్నారు. సీనియర్ నాయకుడు పయ్యావుల కేశవ్ సభలో దమ్ము ఉందా అంటూ మాట్లాడటం శోచనీయం. మాకు దమ్ముంది కాబట్టే 151 స్థానాలు ఇచ్చారు. మిమ్మల్ని ప్రజలు దుమ్ముదుమ్ముగా ఓడించారు. మళ్లీ మిమ్మల్ని ఓడించడం ఖాయం. స్పీకర్‌ను దమ్ముందా అంటూ మాట్లాడిన వారికి సభలో ఉండే అర్హత లేదు.

దమ్ము లేకనే బాబు పారిపోయాడు: మంత్రి జోగి రమేశ్



చంద్రబాబుకు చాదస్తం పెరిగిపోయింది. ఆ పార్టీ సభ్యుడు పయ్యావుల కేశవ్‌కు పైత్యం పుట్టుకొచ్చింది. దమ్ములేకనే మీ నాయకుడు చంద్రబాబు సభ నుంచి పారిపోయాడు. బయట చంద్రబాబు, సభలో టీడీపీ సభ్యులు అసత్యాలతో ప్రభుత్వంపైన, సీఎంపైన బురద జల్లుతున్నారు. రాజ్యాంగ వ్యవస్థను కించపరిచినట్టు అంగీకరిస్తే కేశవ్‌ను, లేకుంటే ఈనాడులో అసత్యాలు ప్రచురించినందుకు రామోజీరావును సభకు పిలిపించి మోకాళ్లపై నిలబెట్టాలి.

రాష్ట్రానికి శని ఎల్లో మీడియా: మంత్రి దాడిశెట్టి రాజా



రాష్ట్రానికి ఎల్లో మీడియా శనిలా పట్టుకుంది. పూర్తి అసత్యాలతో కూడిన పేపర్లు నిత్యం ప్రభుత్వంపై విషం చిమ్ముతూనే ఉన్నాయి. అటువంటి సంస్థలను కచ్చితంగా శిక్షించాలి. రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా ఈనాడులో రాతలు రాసిన రామోజీరావును తీసుకొచ్చి సభలో నిలబెట్టాలి.

బీసీలంటే బాబుకు అలుసు: మంత్రి అప్పలరాజు



ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి స్పీకర్‌గా అవకాశం కల్పిస్తే ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబు సభలో ఉండి కూడా మిమ్మల్ని (స్పీకర్) చైర్‌లో కూర్చోబెట్టడానికి రాలేదు. ఇప్పుడు ఆ పార్టీ సభ్యుడు దమ్ముందా అంటూ చైర్ పట్ల దురుసు ప్రవర్తన కూడా బీసీలను కించపరిచేలా ఉంది. రాజ్యాంగ వ్యవస్థలు, ప్రభుత్వం, సీఎంను అవమానించేలా మాట్లాడిన కేశవ్‌ను ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారించి కఠినంగా శిక్షించాలి.

కేశవ్ ప్రవర్తనను సభ ఖండిస్తోంది: మంత్రి చెల్లుబోయిన వేణు



టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ దురుసు ప్రవర్తనను సభ మొత్తం ఖండిస్తోంది. సభా వ్యవహారాల్లో అధికార పక్షం సమన్వయం పాటిస్తూ, ప్రజలకు మేలు చేసే అంశాలను ప్రస్తావిస్తుంటే ప్రతిపక్షం అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. సభా మర్యాదకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారు.

చర్యలు తీసుకోవాల్సిందే: మంత్రి బొత్స



రాజ్యాంగ వ్యవస్థను కించపరిచేలా వ్యవహరించడం దారుణం. ఇటువంటి తప్పు కేశవ్ చేసినా, ఈనాడు పేపర్ చేసినా చర్యలు తీసుకోవాల్సిందే.

ఆ రాతలు గవర్నర్, సీఎంలను అవమానపరిచేవే..

- ఈనాడు రాతలను సీరియస్‌గా పరిగణించాలి
- వాటిపై స్పష్టమైన, కఠిన చర్యలు ఉంటాయి
- తప్పు ఎవరిదో ప్రివిలేజ్ కమిటీ తేలుస్తుంది
- అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం రూలింగ్



సాక్షి, అమరావతి: సీఎం కోసం గవర్నర్ ఎదురు చూడాలా? అంటూ ఈనాడు పత్రికలో వచ్చిన కథనాన్ని చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గవర్నర్‌కు స్వయంగా ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికినప్పటికీ, అవాస్తవ అంశాలతో టీడీపీ సభ్యుడు పయ్యావుల కేశవ్ మాట్లాడినట్లుగా ఈనాడు ప్రచురించిన కథనంపై స్పీకర్ తమ్మినేని రూలింగ్ ఇస్తూ.. గవర్నర్, ముఖ్యమంత్రి పదవుల ఔన్నత్యాన్ని, మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌తో పాటు మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమానపరిచే ఆ రాతలపై స్పష్టమైన, కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. బుధవారం సభలో స్పీకర్ మాట్లాడుతూ.. ''గవర్నర్ కార్యక్రమంలో నేనే ప్రత్యక్ష సాక్షిని. ముఖ్యమంత్రి, నేను, మండలి చైర్మన్ వెళ్లి ఆయనను సగౌరవంగా రిసీవ్ చేసుకున్నాం. గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన డైరెక్షన్ ప్రకారమే గవర్నర్ స్పీకర్ చాంబర్ వద్ద ఆగి లోపలికి వచ్చి గొంతు సమస్యకు వేడి నీటిని తాగి సభకు బయలుదేరారు (గవర్నర్ కార్యాలయం డైరెక్షన్ వివరాలను స్పీకర్ సభలో చదివి వినిపించారు). వాస్తవం ఇలా ఉంటే, ఈ రోజు ఈనాడులో తప్పుడు కథనం చూశాక, ఇది చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అంశం అని భావిస్తున్నాను. మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమానపరిచే ఈ రాతలను సభ సీరియస్‌గా తీసుకుంటుంది. భవిష్యత్‌లో ఇలాంటివి మళ్లీ రాయాలంటే ఆలోచించుకునేలా చర్యలు ఉండాలి. గవర్నర్ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కాదు. దీనిని చిన్నదిగానో, సాధారణ అంశంగానో శాసనసభ చూడటం లేదు. తప్పు కేశవ్‌దా, పత్రికదా అనే విషయం ప్రివిలేజ్ కమిటీ సిఫార్సులు సూచిస్తాయి. ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రివిలేజ్ కమిటీ హియరింగ్స్ తర్వాత తప్పనిసరిగా సభలో ప్రకటన చేస్తాను. ఆ మాటలు మాట్లాడిన సభ్యుడు అన్నీ ప్రివిలేజి కమిటీ ముందు చర్చించవచ్చు'' అని చెప్పారు.

రాజ్యసభ | ఏపీ ఇన్ పార్లమెంట్

స్కిల్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ అవసరం లేదు

ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (నైపుణ్యాభివృద్ధి సూచిక)ను రూపొందించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు బుధవారం కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. నైపుణ్య లోపాలపై పలు సంస్థల అధ్యయనాల ద్వారా ఆయా రంగాల్లో నైపుణ్యాభివృద్ధి అవసరాలు, లోపాలకు సంబంధించి సమగ్ర సమాచారం అందుతోందన్నారు. ఈ సమాచారం ఆధారంగా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీలు, జిల్లా స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రణాళికలను రూపొందించి తద్వారా కింది స్థాయిలో డీసెంట్రలైజ్డ్ ప్లానింగ్, ఇంప్లిమెంటేషన్ ప్రక్రియను ప్రోత్సహించే వీలు కలుగుతుందన్నారు. డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ (డీఎస్‌డీపీ) ద్వారా ఏయే రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో, నైపుణ్యాలకు డిమాండ్ ఎక్కడ ఉన్నదీ గుర్తించవచ్చన్నారు.

'మిషన్ వాత్సల్య'లో ఏపీకి నిధులు



చిన్నారుల హక్కులకు భంగం కలగకుండా చూడటం తదితర అంశాలతో తీసుకొచ్చిన మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా ఏపీకి నిధులు విడుదల చేస్తున్నామని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2020–21లో రూ.18.27 కోట్లు, 2021–22లో రూ.4.76 కోట్లు విడుదల చేశామన్నారు. వేమిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి నిరంజన్ జ్యోతి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఏపీకి 2022–23 ఆర్థిక సంవత్సరంలో 2023 మార్చి 1 నాటికి మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.819.12 కోట్లు, వేజ్ కాంపొనెంట్ కింద రూ.205.24 కోట్ల మేర ఉపాధి హామీ నిధులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు.

క్యాంపస్ లేనందునే..



ఏపీలో నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్‌టీఐ) క్యాంపస్ లేనందునే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఈఎస్‌బీయూడీ) సెంటర్ లేదని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

స్థానిక సంస్థల్లో 85,634 మంది మహిళల ప్రాతినిధ్యం



ఏపీలోని స్థానిక సంస్థల్లో 85,634 మంది మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి నిరంజన్ జ్యోతి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల సీట్లు 1,58,135 ఉండగా.. 3,721 స్థానాలకు సంబంధించి ఎన్నికలు విత్‌హోల్డ్‌లో ఉన్నాయన్నారు.

మూడేళ్లలో 134 ప్రాజెక్టులు



హైవేల అభివృద్ధిలో భాగంగా ఏపీలో మూడేళ్లలో 134 ప్రాజెక్టులు చేపట్టినట్టు జాతీయ రహదారులు, రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. రానున్న మూడు నుంచి ఐదేళ్లకు ఎలాంటి ప్రాజెక్టులు ప్రస్తుతం అనుమతి దశలో లేవన్నారు. నత్వానీ అడిగిన మరో ప్రశ్నకు హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా సమాధానమిస్తూ.. ఏపీ జైళ్లలో 8,761 మంది సామర్థ్యం ఉండగా.. 7950 మంది ఉన్నారన్నారు.

లోక్ సభ

ఆహార భద్రతలో 2.68 కోట్ల మంది



జాతీయ ఆహార భద్రత పథకంలో ఏపీలోని 2.68 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని కేంద్ర ఆహార, వినియోగదారుల శాఖ సహాయ మంత్రి నిరంజన్ జ్యోతి తెలిపారు. మూడేళ్లుగా లబ్ధిదారుల సంఖ్య అదేనని వైఎస్సార్‌సీపీ సభ్యుడు మిథున్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు మార్గాని భరత్‌రామ్, చింతా అనూరాధ, గోరంట్ల మాధవ్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. లక్షిత జనాభాకు ఏకరీతిన పోషక ప్రభావం ఉండేలా వారికి జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఫోర్టిఫైడ్ రైస్ అందిస్తున్నామన్నారు.

మహిళా పరిశోధకులు 56,747 మంది



దేశవ్యాప్తంగా 56,747 మంది మహిళ పరిశోధకులు ఉన్నారని కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యురాలు బీవీ సత్యవతి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. మొత్తం పరిశోధకుల్లో 16.6శాతం మహిళలు ఉన్నారన్నారు.

పార్టీ కార్యాలయానికి భూమి కేటాయించండి

కేంద్రమంత్రికి వైఎస్సార్‌సీపీ ఎంపీల విజ్ఞప్తి



కేంద్రమంత్రికి జ్ఞాపిక ఇస్తున్న విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురికి ఆ పార్టీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ నేత విజయసాయిరెడ్డి, లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఎంపీలు రంగయ్య, చంద్రశేఖర్, బి.వి.సత్యవతి, పోచ బ్రహ్మానందరెడ్డి, ఎం.వి.వి.సత్యనారాయణ, మోపిదేవి వెంకటరమణారావు, గోరంట్ల మాధవ్ కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చి పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు.

న్యాయమంత్రి రిజిజుతో భేటీ

కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజుతో ఆయన క్యాంపు కార్యాలయంలో విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై కేంద్రమంత్రితో చర్చించారు.

రాష్ట్రపతి భవన్‌లో సమావేశం

రాష్ట్రపతిభవన్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ ఎంపీలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ నేత విజయసాయిరెడ్డి, లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి, పార్టీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్, పార్టీ ఎంపీలు హాజరయ్యారు.

ఆరోగ్య శ్రీలో 16.47 లక్షల మందికి లబ్ధి

డిసెంబర్ వరకు రూ.4,999.66 కోట్లు వ్యయం

- 2.14 లక్షల మంది కోవిడ్ రోగులకు రూ.743.22 కోట్లతో చికిత్స
- ఆరోగ్య ఆసరా కింద 17.06 లక్షల మందికి రూ.903.9 కోట్లు
- 108 అంబులెన్స్‌ల ద్వారా 27,00,942 ఎమర్జెన్సీ కేసుల తరలింపు
- ఇందులో 2,54,600 కోవిడ్ కేసులు.. 24.46 లక్షలు నాన్ కోవిడ్ కేసులు
- 2022–23 రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా గత డిసెంబర్ వరకు 16,47,782 మందికి లబ్ధి చేకూరింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,999.66 కోట్లు వ్యయం చేసింది. కోవిడ్–19 చికిత్సలను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి.. 2,14,135 మందికి రూ.743.22 కోట్లతో ఉచిత చికిత్స అందించింది. ఈ పథకం కింద చికిత్స అనంతరం కోలుకునే సమయంలో రోగుల జీవనోపాధి కోసం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద గత డిసెంబర్ ఆఖరు వరకు 17,06,023 మందికి రూ.903.90 కోట్లు సాయంగా అందజేసింది. ఈ విషయాలను 2022–23 రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడించింది. ఈ ప్రభుత్వం వచ్చాక 108 అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి, కొత్తగా 432 అంబులెన్స్‌లను కొనుగోలు చేసింది. 108 అంబులెన్స్‌ల ద్వారా 2021 జూలై నుంచి 2022 డిసెంబర్ వరకు అత్యవసర వైద్యం అవసరమైన 27,00,942 మందిని ఆస్పత్రులకు తరలించింది. ఇందులో 2,54,609 కోవిడ్ కేసులు కాగా, మిగతా 24,46,333 నాన్ కోవిడ్ కేసులు.

2022 డిసెంబర్ వరకు ఆరోగ్య శ్రీలో లబ్ధిపొందిన వారు

జిల్లా పేరు	లబ్ధిదారులు	చికిత్స వ్యయం (రూ.కోట్లలో)
శ్రీకాకుళం	68,439	221.13
విజయనగరం	97,417	244.45
పార్వతీపురం మన్యం	28,588	63.70
అల్లూరి సీతారామరాజు	19,649	39.98
విశాఖపట్నం	61,359	183.61
అనకాపల్లి	50,084	135.88
కాకినాడ	64,427	188.10
అంబేడ్కర్ కోనసీమ	43,164	157.31
తూర్పు గోదావరి	80,598	255.54
పశ్చిమ గోదావరి	55,990	193.29
ఏలూరు	61,880	196.68
కృష్ణా	74,375	254.47
ఎన్టీఆర్	35,394	123.96
గుంటూరు	80,777	283.61
బాపట్ల	40,387	152.23
పల్నాడు	67,748	210.72
ప్రకాశం	62,557	212.72
నెల్లూరు	67,416	237.52
కర్నూలు	92,404	232.01
నంద్యాల	82,645	237.34
అనంతపురం	81,103	229.27
శ్రీ సత్యసాయి	50,539	130.26
వైఎస్సార్	86,317	244.60
అన్నమయ్య	54,693	157.57
చిత్తూరు	82,543	235.92
తిరుపతి	57,789	178.21

2022 ఏప్రిల్ నుంచి 2022 నవంబర్ వరకు ఆస్పత్రుల్లో చికిత్సలు	కార్యకలాపాలు	సంఖ్య
	అవుట్ పేషెంట్లు	1,51,36,566
	ఇన్ పేషెంట్లు	14,70,415
	మేజర్ సర్జరీలు	65,102
	డెలివరీలు	1,06,604

పుష్కలంగా ఆహార ధాన్యాలు

2022-23 ఆర్థిక ఏడాదిలో 9.3 శాతం వృద్ధి

- 169.30 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి
- 2022 డిసెంబర్ వరకు 109.33 లక్షల మెట్రిక్ టన్నుల పాలు ఉత్పత్తి
- 2023–24లో రూ.1,66,390 కోట్లతో వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళిక
- రూ.1,395.45 కోట్లతో కొత్తగా 11.50 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్
- 2022–23 రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

2019-20 నుంచి 2022-23 మధ్య ఆహార ధాన్యాల ఉత్పత్తి

ఆర్థిక ఏడాది	ఆహార ధాన్యాల ఉత్పత్తి (లక్షల మెట్రిక్ టన్నులు)
2019-20	175.12
2020-21	165.04
2021-22	154.84
2022-23	169.30

సాక్షి, అమరావతి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 9.3 శాతం వృద్ధి నమోదైంది. సాగువిస్తీర్ణం స్వల్పంగా తగ్గినప్పటికీ ఆహారధాన్యాల ఉత్పత్తి మాత్రం గణనీయంగా పెరిగింది. 2020–21 ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 9.3 శాతం వృద్ధి నమోదైనట్లు 2022–23 రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ధాన్యం ఉత్పత్తిలో కూడా 9.8 శాతం వృద్ధి నమోదైంది. గత ఆర్థిక ఏడాది ఖరీఫ్, రబీలో కలిపి 121.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా 2022–23 ఆర్థిక ఏడాదిలో 133.65 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని తొలి ముందస్తు అంచనాల్లో సర్వే పేర్కొంది. డిసెంబర్ ఆఖరు వరకు రాష్ట్రంలో 109.33 లక్షల మెట్రిక్ టన్నుల పాలు, 7,34,157 మెట్రిక్ టన్నుల మాంసం, 1784.01 లక్షల గుడ్లు ఉత్పత్తి జరిగినట్లు సర్వే పేర్కొంది. 2021–22లో రాష్ట్రం 2645.03 లక్షల గుడ్ల ఉత్పత్తితో అగ్రస్థానంలో, 1025.59 లక్షల మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తితో రెండో స్థానంలో, 154.03 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తితో ఐదో స్థానంలో నిలిచిందని సర్వే స్పష్టం చేసింది. 2021–22లో రాష్ట్రంలో 48.13 లక్షల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరిగితే, 2022–23 ఆర్థిక ఏడాది డిసెంబర్ వరకు 37.18 లక్షల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరిగిందని చెప్పింది. 2023–24 ఆర్థిక ఏడాదిలో రూ.1,66,390 కోట్లు వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికగా నిర్ణయించినట్లు నివేదిక పేర్కొంది. ఇది గత ఆర్థిక ఏడాదితో పోల్చితే పది శాతం అదనం అని తెలిపింది. 2023–24లో రూ.1,395.45 కోట్ల వ్యయంతో కొత్తగా 1.50 లక్షల హెక్టార్ల విస్తీర్ణాన్ని మైక్రో ఇరిగేషన్ కిందకు తీసుకురానున్నట్లు తెలిపింది. ఇందులో రూ.1,171.81 కోట్లు సబ్సిడీగా ఉంటుందని వెల్లడించింది.


నిక్ జాస్మిన్

రోడ్లు బాగుండవు
వాతావరణం సరిగా ఉండదు.
అదీ గాక గంటల కొద్దీ
ప్రయాణించే సమయం ఉండదు.
అలాంటప్పుడు ప్రాణం పోసే
మందులు అందాలంటే?
డ్రోన్లే దారి.
అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన
నిక్ జాస్మిన్ మొత్తం ఈశాన్య రాష్ట్రాలకే
మొదటి మహిళా డ్రోన్ ఆపరేటర్.
గాల్లో మందులు పంపే ఈ సవాలును
ఆమె సమర్థంగా స్వీకరించింది.

ఈశాన్యంలో విరిసిన జాస్మిన్

● ఆకాశ మార్గాన ఔషధ సేవ...


నిక్ జాస్మిన్

ఈ సన్నివేశం ఎప్పుడూ జరిగేదే. రోడ్డు కూడా సరిగా లేని అటవీ ప్రాంతాల్లో విషజ్వరాలు పాకుతాయి. రోగి కదల్లేడు. అంబులెన్స్ రావడానికి సమయం పడుతుంది లేదా రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యి దగ్గరిలోని ఆస్పత్రికి వెళ్లాలన్నా గంటలు గంటలు పడుతుంది. లేదా ఏదో వాగు పొంగి రోడ్డు బ్లాక్ అవుతుంది. కొండ చరియలో, చెట్ల కొమ్మలో విరిగి పడతాయి. సరైన మందు పడితే రోగి ప్రాణాలు దక్కుతాయి. అప్పుడు ఏం చేయాలి?

డ్రోన్ల ద్వారా మందులు చేరవేయడం సరైనదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహనకు వచ్చాయి. ఇందుకు అనేక స్టార్టప్ కంపెనీలు, డ్రోన్ల తయారీ సంస్థలు ప్రతిపాదనలు చేశాయి. సేవారంగంలో ఉన్న సంస్థలు కూడా ప్రభుత్వంతో భాగస్వామ్యం అవుతున్నాయి. దాంతో డ్రోన్ల ద్వారా మందుల పంపిణీ రెండేళ్ల క్రితం నుంచి ఉత్సాహంగా జరుగుతోంది. తెలంగాణలోని వికారాబాద్‌లో 'మెడిసిన్ ఫ్రమ్ ది స్కై' కార్యక్రమం మొదలెట్టడం అందరికీ గుర్తే.

ఈశాన్య రాష్ట్రాలలో డ్రోన్లు

ఈశాన్య రాష్ట్రాలలో కొండ ప్రాంతాలకు, మారుమూల ప్రాంతాలకు ప్రాణాధార మందులు సకాలంలో చేరవేయడం ఎప్పుడూ సవాలే. కొండ దారుల్లో ప్రయాణం ఆలస్యం అవుతుంది. అదీ గాక వాహనాలు వెళ్లలేని చోట్ల కూడా ఆదివాసీలు నివాసాలు ఉంటారు. వీళ్లను కాపాడాలంటే సరైన సమయంలో మందులు చేరవేయడం చాలా అవసరం. అందుకే 'సస్టెయినబుల్ యాక్సెస్ టు మార్కెట్ అండ్ రిసోర్సెస్ ఫర్ ఇన్నోవేటివ్ డెలివరీ ఆఫ్ హెల్త్ కేర్' (సమృద్ధ్) సంస్థ ఐపిఇ గ్లోబల్, నీతి అయోగ్‌లతో కలిసి మరికొన్ని దాతృత్వ సంస్థల భాగస్వామ్యంతో 'మెడిసిన్ ఫ్రమ్ ది స్కై' ప్రాజెక్ట్‌లో భాగంగా అక్కడ డ్రోన్ల ద్వారా మందుల పంపిణీ మొదలెట్టింది. అరుణాచలప్రదేశ్‌లో సాగుతున్న ఈ కార్యక్రమంలో డ్రోన్ ఆపరేట్ చేస్తున్న తొలి మహిళ నిక్ జాస్మిన్ సేవలు అందిస్తోంది.

ఆమె మొదట పారాగ్లైడర్

అరుణాచల్ ప్రదేశ్‌లోని తూర్పు కమెంగ్ జిల్లా నుంచి నిక్ జాస్మిన్ డ్రోన్ల ద్వారా మందులు సరఫరా చేస్తుంది. ఇందుకోసం అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద మందులు నిల్వ చేసే మందులు నిల్వ చేసే ఫ్రీజర్లు, ఫ్రిజ్‌లు ఉన్న మినీ హెలిపాడ్ వంటి స్టేషన్ వద్ద ఆమె విధులు నిర్వర్తించాలి. యాప్ ద్వారా ఫలానా చోటుకు మందులు పంపాలి అనే సందేశం రాగానే స్పందించాలి. 'డ్రోన్లు 400 అడుగుల ఎత్తు నుంచి ప్రయాణం చేస్తాయి. 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం వరకూ కచ్చితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకుంటాయి. రోజుకు పది ట్రిప్పులు వేయగలవు. మందుల ఉష్ణోగ్రతను మెయిన్‌టెయిన్ చేస్తూ ప్రయాణిస్తాయి. తమ సామర్థ్యాన్ని బట్టి బరువును మోస్తాయి' అని తెలిపింది నిక్. 'నేను ఎయిర్‌లైన్స్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. పారాగ్లైడింగ్ చేసేదాన్ని. మెడిసిన్ ఫ్రమ్ ది స్కై కోసం డ్రోన్ ఆపరేటర్ల ఉద్యోగం ఉందని తెలిసి అప్లై చేశాను. నా పారాగ్లైడింగ్ అనుభవం దృష్ట్యా ఉద్యోగం వచ్చింది' అని తెలిపింది నిక్.

ఊరు కదిలి వచ్చింది

ఈ ఉద్యోగం కోసం నిక్‌కు శిక్షణ ఇచ్చారు. 'డ్రోన్‌లోని అన్ని భాగాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. అవసరమైన మందులు జాగ్రత్తగా ప్యాక్ చేయడం, ప్రీ ఫ్లైట్ పరీక్షలు, గాలి స్థితి, ఆడియో పైలట్ సిస్టమ్, జీపీఎస్ ట్రాక్ ఇవన్నీ సక్రమంగా ఉన్నాయనుకున్నాక డ్రోన్‌ను బయలుదేరదీయాలి' అని తెలిపింది నిక్. ఆమె ఉద్యోగం మొదలెట్టిన రోజు ఆమెను చూడటానికి ఊరు ఊరంతా వచ్చింది. 'విమానాలు దగ్గరి నుంచి ఎగరడం మా ఊరి వాళ్లు చూడలేదు. ఒక బుల్లి విమానం లాంటిది పైగా ఒక అమ్మాయి ఎగుర వేయడం వారికి వింత. అందుకని ఊరంతా కదిలి వచ్చి చూసింది' అని నవ్వింది నిక్.


'ఇది సరదా ఉద్యోగం కాదు. చాలా బాధ్యత. నాకు ఈ ఉద్యోగం ఎంతో నచ్చింది' అని చెప్పిందామె.

●

కళలకు సాంకేతిక విషయాలు చాలా దూరం అని కొద్దిమంది నమ్ముతారు.
'అదేమీ కాదు' అనే ఎంతోమంది నిరూపిస్తుంటారు.
అలాంటి వారిలో ఒకరు వైశాలిని పాలివాల్.
కథక్ నృత్యం, గానం, పెయింటింగ్‌లలో ప్రతిభ ఉన్న వైశాలిని ఎంటర్‌ప్రెన్యూర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటోంది...

మల్టీ టాలెంట్




వైశాలిని పాలివాల్

జెట్‌స్పీడ్ ట్రబుల్ షూటర్

చిన్న వయసు నుంచే కథక్ నృత్యం, పెయింటింగ్, గానంలో ప్రతిభ చూపుతున్న వైశాలిని పాలివాల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవుతుందని ఎవరూ అనుకోలేదు. వైశాలినికి కళల పట్ల ఉండే అమితమైన ఆసక్తి దీనికి కారణం.

పుణెకు చెందిన వైశాలి ఐఐటీ–రూర్కీ(ఉత్తరాఖండ్)లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేసింది. చదువులో ఎంత ప్రతిభ ప్రదర్శించేదో ఆటపాటల్లో కూడా అంతే!

చదువు పూర్తయిన తరువాత డెవలపర్‌గా తన సాఫ్ట్‌వేర్ కెరీర్‌ను ప్రారంభించింది. మోటరోలాలాంటి ఎన్నో ప్రసిద్ధ కంపెనీలలో పనిచేసింది. ఆ సమయంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లు ఎదుర్కొనే సమస్యలపై లోతైన అవగాహన వచ్చింది.

ఒకానొక రోజు తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాలని నిర్ణయిం తీసుకుంది. వేరే సమయంలో అయితే ఇది పెద్ద విషయం కాకపోవచ్చు... కాని అది కరోనా కాలం. పెద్ద పెద్ద కంపెనీలే కుప్పకూలుతున్న కాలం.

'బంగారంలాంటి ఉద్యోగాన్ని వదులుకొని రిస్క్ చేయడం ఎందుకు?' అన్నవాళ్లే ఎక్కువ.


వైశాలిని పాలివాల్ వేసిన పెయింటింగ్స్

'ఏ రిస్క్ చేయకపోవడమే అతి పెద్ద రిస్క్' అనేమాట ఆమెకు తెలియనిదేమీ కాదు కదా! రంగంలోకి దిగింది.

పుణె, సిలికాన్‌వ్యాలీ కేంద్రంగా 'జీపీ.ఏఐ' పేరుతో డిజిటల్ ఎక్స్‌పీరియెన్స్ అండ్ అబ్జర్వబుల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించింది. 'ఫిక్స్ వాట్ మ్యాటర్ విత్ జీపీ' అనేది కంపెనీ నినాదం.

'ఏ ధైర్యంతో ముందుకు వెళ్లావు?' అనే ప్రశ్న వచ్చినప్పుడు– 'ఆత్మస్థైర్యం' అని సమాధానం వినిపిస్తే ఇక తిరుగులేదనే. వైశాలిని నోటి నుంచి కూడా ఈ జవాబే వినిపించింది.

ఒక ఇ–కామర్స్ కంపెనీ, పేమెంట్ యాప్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యను మెరుపు వేగంతో పరిష్కరించి తనదైన గుర్తింపు తెచ్చుకుంది జీపీ.ఏఐ

'జీప్పీ' అనే పదానికి వేగం, తాజాదనం, ప్రకాశవంతం, శక్తిమంతం అనే అర్థాలు ఉన్నాయి. కంపెనీ పనితీరులో ఈ అర్థాలు ప్రతిఫలించి వేగంగా దూసుకుపోయేలా చేశాయి.

పాపులర్ ప్రాడక్స్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ 'ప్రాడక్ట్ హంట్' నిర్వహించిన సర్వేలో 'జీపీ.ఏఐ' నెంబర్‌వన్‌గా నిలిచింది. ప్రాడక్ట్ వాల్యూ రావడంతో అమెరికా నుంచి ఐరోపా వరకు ఎన్నో ప్రాంతాలలో కంపెనీ దూసుకుపోయింది.

'ఒక సమస్య పరిష్కారం విషయానికి వస్తే ఎలా పరిష్కరించాం అనే విషయంతో పాటు ఎంత వేగంగా పరిష్కరించాం అనేదాన్ని పరిగణలోకి తీసుకుంటాను. పెద్ద బృందం మాత్రమే కాదు సింగిల్ డెవలపర్ కూడా పరిష్కరించాలనుకుంటాను' అంటుంది వైశాలిని.

కోడింగ్ ప్రపంచంలోకి వెళ్లి లాజికల్ ఎర్రర్, నెట్‌వర్క్ ఎర్రర్... మొదలైన వాటి గురించి అధ్యయనం చేసే వైశాలిని ప్రతి యూజర్ అనుభవాన్ని తన కేస్‌స్టడీగా చేసుకుంటుంది.

కోడ్స్‌ను కనెక్ట్ చేసుకోవడం అనేది తన విధానం. 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అనే కోణంలో డాట్స్‌ను కనెక్ట్ చేసుకొని సంపూర్ణ చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది. పరిష్కారాన్ని కనుగొంటుంది.

'ఆర్థిక మాంద్యం దూసుకువచ్చే ప్రమాదం ఉంది అంటున్నారు కదా...' అనే ప్రశ్న పూర్తికాకుండానే ఇలా జవాబు ఇస్తుంది వైశాలిని...

'సానుకూల కోణంలో చూస్తే ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన గురించి తాను తెలుసుకునే విలువైన అవకాశం లభిస్తుంది. ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఎలా ముందుకు వెళ్లాలి? అనే దాని గురించి అవగాహన ఏర్పర్చుకోవడానికి ఉపకరిస్తుంది'

ఇది సరే, కథక్ నృత్యం, చిత్రకళ, గానం మాటేమిటి?!

'ఎంత బిజీగా ఉన్నా వాటికి దూరంగా జరిగేదే లేదు. వీటి ద్వారా నేను రిలాక్స్ అవుతాను. జటిలమైన సాంకేతిక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు వెదకడానికి ఆ శక్తులు ఉపయోగపడతాయి' అంటుంది వైశాలిని పాలివాల్.

●

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ మొదలైన ప్రాంతాల్లో రాజులకు సంబంధించి ఎన్నో విషయాలు వినిపిస్తుంటాయి.
ఆ ముచ్చట్లు 'రాజ కుటుంబాలు ఆకాశం దిగి నేలకు రావు' అన్నట్లుగా ఉండేవి.
అదేమీ కాదని నిరూపించింది ఉదయ్‌పూర్ రాకుమారి పద్మజ కుమారి మేవార్.
ఆమెకు పల్లె గుండె తెలుసు.
పక్షులను, పచ్చదనాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసు...

సామాన్యుల రాకుమారి


రాకుమారి పద్మజ కుమారి మేవార్

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ రాజకుటుంబంలో పుట్టింది పద్మజ కుమారి మేవార్. అమ్మ, నాన్నమ్మల నుంచి ఎన్నో జానపదకథలు విన్నది. ఆ కథల్లో ఎన్నో అందమైన అడవులు, అపురూపమైన జంతుజాలం ఉండేవి. కాల్పనిక ప్రపంచం దాటి బయటికి వస్తే పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది.

అడవులు కన్నీళ్లు పెట్టుకుంటున్న దృశ్యాల గురించి నాన్న మాటల్లో ఎన్నోసార్లు విన్నది.

హైస్కూల్ చదువు నుంచి డిగ్రీ వరకు అమెరికాలో చదువుకున్న పద్మజ కుమారి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది.

చదువు పూర్తయిందో లేదో ఆమె 'భగీర' క్యాంపులోకి అడుగుపెట్టింది.

సామాజిక సేవా కార్యక్రమాల కోసం తల్లిదండ్రులు రాణి దుర్గేష్ నందిని, మహారాజా రాజేంద్రసింగ్ ఈ క్యాంపుకు శ్రీకారం చుట్టారు. ఈ క్యాంప్‌లోని గదులను స్థానికులే, స్థానికంగా దొరికే వనరులతో నిర్మించారు. గోద్వారీ ప్రాంతంలో ఉన్న ఈ క్యాంపు కేంద్రంగా వనసంరక్షణ, స్త్రీ సాధికారత, ఆరోగ్యం, జలసంరక్షణ... మొదలైన కార్యక్రమాలు చేపట్టారు.

పద్మజ కుమారి ఈ క్యాంప్‌లోకి అడుగు పెట్టిన తరువాత క్యాంపుకు కొత్త శక్తి వచ్చి చేరింది. ఆమెకు ఆ ప్రాంతంలో ప్రతి ఊరూ కొట్టిన పిండే.

గోద్వారీ ప్రాంతం 235 రకాల పక్షులకు, 35 రకాల ఔషధ మొక్కలకు నిలయం.

'మన దగ్గర అపూర్వమైన సంపద ఉంది. వాటిని పరిరక్షించుకోవాలి' అంటూ ఊరువాడా తిరిగింది. గిరిజన ప్రాంతాల్లో స్కూల్స్ మొదలుపెట్టడం ద్వారా పిల్లల్లో చైతన్యం తీసుకువచ్చింది.

సామాజిక చైతన్యానికి సంబంధించిన కార్యక్రమాలే కాదు స్థానికులకు ఉపాధి కల్పించే పనులకు శ్రీకారం చుట్టింది.

'ఈ క్యాంపులోకి అడుగు పెడితే ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. ఎంతో ధైర్యం వస్తుంది' అంటారు స్థానికులు.

ఇప్పుడు వారికి రకరకాల పక్షుల పేర్లు, వాటి పుట్టు పూర్వోత్తరాలు, ఔషధ మొక్కల పేర్లు, వాటి ఉపయోగాలు తెలియడం మాత్రమే కాదు వాటిని ఎలా కాపాడుకోవాలో కూడా బాగా తెలుసు.

'పెద్ద చదువులు చదువుకున్నావు. ఇక్కడికి ఎందుకు తల్లీ' అని తల్లిదండ్రులు అనలేదు. అదే తనకు మహాబలం అయింది.

ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలు తిరిగిన పద్మజ కుమారికి, సామాజికసేవలో కొత్త ప్రపంచం కనిపించింది. ఎన్నో లక్ష్యాలు ఏర్పడ్డాయి. అందులో ఒకటి వైల్డ్‌లైఫ్ టూరిజం కేంద్రంగా గోద్వారీ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని.

స్థానికుల స్పందన,చైతన్యం పద్మజ కుమారి సంకల్పబలం చూస్తుంటే అదేమీ కష్టం కాదు అనిపిస్తుంది.

●

బ్యూటిప్స్



చర్మం మృదువుగా, ముడతలు పడకుండా, మచ్చలు ఏర్పడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్‌ను ఉపయోగించాలి. దీనిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

ఒక కప్పు పెరుగు, టేబుల్‌స్పూన్ ఆరెంజ్ జ్యూస్, టేబుల్‌స్పూన్ నిమ్మరసం ఒక గిన్నెలోకి తీసుకుని, బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించాలి. తర్వాత సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రంగా కడిగేయాలి.

ఇంటిప్

కడగండి కానీ పారబోయకండి



అన్నం వండేముందు మనం బియ్యాన్ని రెండు మూడుసార్లు కడుగుతాం కదా... మొదటిసారి కడిగిన నీళ్లను పారబోయాలి. రెండోసారి కడిగిన నీళ్లను పారబోయకూడదు. వీటినే బియ్యం కడుగు నీళ్ల అంటాం. ఇది ఎన్నో పోషకాలున్న ద్రవపదార్థం. ఈ బియ్యం కడుగు నీళ్లను తాగుతుంటే.. మూత్రం సులభంగా విడుదల అవుతుంది. మూత్రకోశ వ్యాధులూ రావు. అంతేకాదు, బీ 12 సమృద్ధిగా లభిస్తుంది.

సైబర్ టాక్

మెసేజ్ లింక్స్‌తో జాగ్రత్త..!


ప్రతీకాత్మక చిత్రం

ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే పూర్ణిమ(పేరుమార్చడమైనది) ప్రతి పైసా జాగ్రత్తగా ఖర్చుపెడుతుంది. రాత్రి పడుకునే ముందు సోషల్‌మీడియా అకౌంట్స్‌తో పాటు, మెయిల్‌కి వచ్చిన నోటిఫికేషన్స్ చూడటం అలవాటు. వాటిలో తన ఆఫీసు నుంచి, స్నేహితుల నుంచి వచ్చిన మెసేజ్‌లకు రిప్లై చేసింది. అదే సమయంలో మరో మెసేజ్ వచ్చింది. గోల్డ్‌స్కీమ్‌కి సంబంధించిన సమాచారం అది. ఆసక్తిగా అనిపించడంతో దానిని ఓపెన్ చేసింది. ఆ స్కీమ్‌లో చేరితే తక్కువ ధరలో బంగారం కొనుగోలు చేయవచ్చు. అది, పేరున్న కంపెనీ వెబ్‌సైట్ నుంచి వచ్చింది. లిమిటెడ్ టైమ్‌లో వచ్చిన ఆఫర్ అది. మంచి అవకాశాన్ని ఎందుకు వదులుకోవడం అని, అప్లికేషన్‌లో తన వివరాలను పొందుపరిచి, సెండ్ చేసింది. మిగతావి ఏమైనా ఉంటే రేపు చూసుకుందాం అని ఫోన్ పక్కన పెట్టేసి పడుకుంది. ఉదయం పనిచేసుకుంటూనే ఫోన్ చేతిలోకి తీసుకుంది. వచ్చిన బ్యాంక్ మెసేజ్‌లు చూసి షాక్ అయ్యింది. యాభై వేల రూపాయలు డెబిట్ అయినట్టుగా బ్యాంక్ మెసేజ్ అది. నిన్నరాత్రి ఆ డబ్బు ట్రాన్స్‌ఫర్ అయింది. స్కీమ్‌లో చేరినట్టుగా వివరాలు ఇచ్చింది కానీ, బ్యాంక్ అకౌంట్స్‌కి సంబంధించిన సమాచారం ఏమీ ఇవ్వలేదు తను. తన డబ్బు మరెలా పోయినట్టు? మెయిల్ ఐడీలో ఉన్న కస్టమర్ కేర్‌కి మెసేజ్ చేసింది. ఫోన్ చేసింది. కానీ, ఎలాంటి సమాచారమూ లేదు.

●●●

పూర్ణిమ మాదిరే చాలామంది మెసేజ్‌లు లేదా మెయిల్స్‌కు వచ్చిన ఆకర్షణీయమైన పథకాలతో ఉన్న లింక్స్‌ను ఓపెన్ చేయడం, వాటి ద్వారా మోసాలకు గురికావడం అతి సాధారణంగా జరుగుతున్నాయి. దీనికి కారణం అధికారిక కంపెనీల నుంచి వచ్చినట్టుగా మెసేజ్ లింక్స్ ఉండటం ప్రధాన కారణం.

●●●

ఈ రోజుల్లో స్పూఫింగ్ అనేది మన భద్రత, గోప్యతకు తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తుంది. ఈ రకమైన దాడుల గురించి తెలుసుకోవడం, వాటి నుండి తమను తాము రక్షించుకోవడానికి అందరం సిద్ధపడాల్సిన సమయం ఇది. పేరున్న కంపెనీల పేరుతో అధికారిక వెబ్‌సైట్లనుంచి వచ్చినట్టు మెసేజ్‌లు మెయిల్స్‌కు వస్తుంటాయి. అయితే, వాటిలో ఏవి కరెక్ట్ అనేది పెద్ద సంశయం.

ఇలాగే, క్రెడిట్ కార్డ్ నంబర్లు, ఓటీపీ, లాగిన్ ద్వారా మోసగాళ్లు మన సమాచారాన్ని బయటపెట్టేలా చూస్తుంటారు. లాటరీ వచ్చింది, డబ్బు డిపాజిట్ చేయడానికి బ్యాంక్ వివరాలు ఇవ్వమని అడగడం, ఓటీపీ చెప్పమని కోరడం, బ్యాంక్ లేదా ఏదైనా ఇతర సంస్థ నుండి ఫోన్ కాల్స్ చేస్తుంటారు. ఈ కాల్స్ ద్వారా బ్యాంకుకు సంబంధించిన సమాచారాన్ని మనం బయటపెట్టేలా మోసం చేసే అవకాశం ఉంది. మనలో నమ్మకాన్ని కలిగించడానికి సులువైన, ఆకర్షణీయమైన పద్ధతులను మోసగాళ్లు ఎంచుకుంటారు కాబట్టి, మనమే జాగ్రత్త వహించాలి.

ఇ-మెయిల్ ద్వారా..

ఫేక్ మెయిల్ ఐడీతో మన ఇన్‌బాక్స్‌లో ఓ మెసేజ్ వస్తుంది. అది వేరొకరి నుండి వచ్చినట్లు కనిపిస్తుంది. ఇది సాధారణంగా ఫిషింగ్ దాడులలో ఉపయోగించబడుతుంది, ఇక్కడ దాడి చేసే వ్యక్తి సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేయడానికి లేదా హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయడానికి, మోసగించడానికి ప్రయత్నిస్తాడు.

- పంపినవారి ఇ-మెయిల్ చిరునామా అనుమానాస్పదంగా ఉండచ్చు. ఉదాహరణకు.. మనకు వచ్చిన ఫేక్ మెయిల్ ఐడీలో లెక్కకు మించి, అక్షర దోషాలు లేదా వింత భాష ఉండచ్చు. గమనించాలి.
- మోసపూరిత ఇ-మెయిల్‌లు ఎలా ఉంటాయంటే.. తరచుగా క్రెడిట్ కార్డ్ నంబర్లు, సోషల్ సెక్యూరిటీ నంబర్లు లేదా పాస్‌వర్డ్‌ల వంటి వ్యక్తిగత సమాచారం కోసం రిక్వెస్ట్‌లు కోరుతుంటాయి.
- ఇ-మెయిల్‌లోని అనుమానాస్పద లింక్‌లు చట్టబద్ధమైన వెబ్‌సైట్‌లా కనిపించే నకిలీ వెబ్‌సైట్‌కి దారితీయవచ్చు. లేదా అవి అసాధారణమైన అక్షరాలను కలిగి ఉండవచ్చు. లేదా వేరే వెబ్‌సైట్‌కి దారి మళ్లించవచ్చు.

ఫోన్ ద్వారా దాడులు

- ఫోన్ ద్వారా దాడులకు పాల్పడే వ్యక్తులు ఉంటారు. వీరు వినియోగదారుడిని రకరకాల ఆకర్షణీయ పథకాల ద్వారా అతని వ్యక్తిగత, బ్యాంకు వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- మీ ఫోన్‌కి బయటి దేశాల నుంచి కూడా ఫోన్‌లు వస్తుంటాయి.
- మీకు తక్కువ సమయంలో ఎక్కువ కాల్స్ వచ్చినా, పగలు లేదా రాత్రి అసాధారణ సమయాల్లో మీకు కాల్స్ వచ్చినా, అది కాలర్ ఐడీ స్పూఫింగ్‌కు సంకేతం కావచ్చు.
- మీరు గుర్తించని కంపెనీలు లేదా వ్యక్తుల నుండి అయాచిత కాల్స్‌ను స్వీకరిస్తే, అది కాలర్ ఐడీ స్పూఫింగ్‌కు సంకేతం కావచ్చు.
- కాలర్ ఐడీ స్పూఫింగ్ తరచూ క్రెడిట్ కార్డ్ నంబర్లు లేదా సామాజిక భద్రతా నంబర్ల వంటి వ్యక్తిగత సమాచారం కోసం రిక్వెస్ట్‌లు ఉంటాయి.
- ఫోన్ కాల్‌లో అవతలి వారి మాటల్లో ఏ మాత్రం క్వాలిటీ లేకపోయినా, కాల్ సమయంలో అసాధారణ శబ్దాలు లేదా అంతరాయాలు ఉంటే, అది కాలర్ ఐడీ స్పూఫింగ్‌కు సంకేతం కావచ్చు.

●

ఇలా సురక్షితం...

- అపరిచిత ఇ-మెయిల్‌లు, మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి.
- బ్రౌజర్ అడ్రస్ బార్‌లో లాక్ గుర్తు ఉండదు. అడ్రస్ బార్‌పై అక్షరాల్లో చిన్న చిన్న తేడాలు ఉంటాయి. ఈ చిన్న అక్షరాలను కూడా గమనించాలి.
- యుఆర్‌ఎల్ అక్షరాలు సరిగా ఉన్నా డిజైన్‌లలో కూడా తేడాలు ఉంటాయి. గమనించాలి.
- బ్యాంక్, డిజిటల్ రెండు రకాల కార్యకలాపాలకు రెండు కారకాల ఫోన్ ప్రమాణీకరణను ప్రారంభించడం శ్రేయస్కరం.



ఇన్‌పుట్స్
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) పురుషుల టోర్నీలో బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ-నిక్కీ పునాచా (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ రిత్విక్-నిక్కీ పునాచా ద్వయం 6-1, 6-3తో జేకబ్ బ్రాడ్‌షా (ఆస్ట్రేలియా)-బోరిస్ బుతుల్యా (సెర్బియా) జోడీని ఓడించింది. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిక్కీ గత ఏడాది ఐటీఎఫ్ సర్క్యూట్‌లో విశేషంగా రాణించి ఏడు డబుల్స్ టైటిల్స్, ఈ ఏడాది ఒక డబుల్స్ టైటిల్‌ను సాధించారు.

'టాప్' ర్యాంక్‌లో అశ్విన్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత మేటి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన టాప్ ర్యాంక్‌ను పటిష్టం చేసుకున్నాడు. అహ్మదాబాద్‌లో ఆసీస్‌తో 'డ్రా'గా ముగిసిన నాలుగో టెస్టులో అశ్విన్ 91 పరుగులిచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు. గతవారం జేమ్స్ అండర్సన్ (ఇంగ్లండ్)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచిన అశ్విన్ తాజా ప్రదర్శనతో అండర్సన్‌ను రెండో ర్యాంక్‌కు నెట్టేసి ఒంటరిగా టాప్ ర్యాంక్‌లో నిలిచాడు.

నిఖత్‌పైనే దృష్టి

నేటి నుంచి ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్


నిఖత్ లవ్లీనా

న్యూఢిల్లీ: సొంతగడ్డపై 'పసిడి పంచ్' కొట్టాలనే లక్ష్యంతో భారత స్టార్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనుంది. బుధవారం ప్రారంభోత్సవ వేడుకలు జరగ్గా... నేటి నుంచి బౌట్‌లు మొదలవుతాయి. 50 కేజీల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ తొలి రౌండ్‌లో అనాఖానిమ్ ఇస్మెయిలోవా (అజర్‌బైజాన్)తో తలపడుతుంది. నిఖత్‌తోపాటు సాక్షి చౌదరీ (52 కేజీలు), ప్రీతి (54 కేజీలు), నుపుర్ (ప్లస్ 81 కేజీలు) తొలి రోజు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. గాయం కారణంగా భారత జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. 70 కేజీల విభాగంలో సనామాచ చాను స్థానంలో శ్రుతి యాదవ్ జట్టులోకి వచ్చింది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు)కు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. 65 దేశాల నుంచి 324 మంది బాక్సర్లు ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

గాయత్రి-ట్రెసా జోడీ సంచలనం

- ఎనిమిదో ర్యాంక్ ద్వయంపై విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి
- తొలి రౌండ్‌లోనే సింధు పరాజయం
- ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీ


ట్రెసా జాలీ
పుల్లెల గాయత్రి

బర్మింగ్‌హామ్: కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 17వ ర్యాంక్ జోడీ గాయత్రి-ట్రెసా జాలీ 21-18, 21-14తో ఎనిమిదో ర్యాంక్ జోంగ్‌కోల్ఫన్ కితితారాకుల్-రవింద ప్రజోంగ్‌జై (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 46 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో గాయత్రి, ట్రెసా పూర్తి సమన్వయంతో ఆడి ఆద్యంతం తమ ఆధిపత్యం చాటుకున్నారు. గతంలో ఈ థాయ్‌లాండ్ జోడీతో ఆడిన నాలుగు సార్లూ ఓటమి పాలైన గాయత్రి-ట్రెసా ఐదో ప్రయత్నంలో మాత్రం విజయఢంకా మోగించారు. గత ఏడాది ఈ మెగా టోర్నీలో సెమీఫైనల్ చేరి సంచలనం సృష్టించిన గాయత్రి-ట్రెసా ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ ఫకుషిమా-సయాకా హిరోటా (జపాన్)లతో తలపడతారు.


సింధు

మళ్లీ తొలి రౌండ్‌లోనే...

ఈ ఏడాది భారత స్టార్ షట్లర్ పీవీ సింధు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. వరుసగా మూడో టోర్నమెంట్‌లోనూ ఆమె తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్ సింధు 17-21, 11-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ జాంగ్ యి మాన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. 39 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధు పలుమార్లు అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. తొలి గేమ్‌లో ఒకదశలో సింధు 16-13తో ఆధిక్యంలోకి నిలిచింది. ఈ దశలో జాంగ్ యి మాన్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు గెలిచింది. 13-16 నుంచి జాంగ్ యి మాన్ 20-16తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం సింధు ఒక పాయింట్ గెలిచినా, ఆ వెంటనే జాంగ్ మరో పాయింట్ నెగ్గి తొలి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలో ఇద్దరు 5-5తో సమంగా ఉన్నారు. ఆ తర్వాత సింధు మళ్లీ తడబడి వరుసగా ఐదు పాయింట్లు కోల్పోయింది. ఆ తర్వాత సింధు తేరుకోలేకపోయింది. ఇటీవల దక్షిణ కొరియాకు చెందిన తన వ్యక్తిగత కోచ్ పార్క్ తే సాంగ్‌తో విడిపోయిన సింధు ఈ ఏడాది మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్ టోర్నీల్లోనూ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. ప్రస్తుతం తనకు ఎవరూ వ్యక్తిగత కోచ్ లేరని, త్వరలోనే కొత్త కోచ్‌ను నియమించుకుంటానని మ్యాచ్ అనంతరం సింధు వ్యాఖ్యానించింది.

శ్రమించిన శ్రీకాంత్

పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోవడానికి కష్టపడ్డాడు. టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 19-21, 21-14, 21-5తో గెలుపొందాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ 21-13, 21-13తో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ (భారత్) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

బెంగళూరు బోణీ...

- ఆరో మ్యాచ్‌లో తొలి విజయం
- రాణించిన పెరీ, కనిక, రిచా


కనిక అహూజా

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ టి20 టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఎట్టకేలకు ఆరో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది. యూపీ వారియర్స్‌తో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ 19.3 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. గ్రేస్ హారిస్ (32 బంతుల్లో 46; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలువగా... బెంగళూరు బౌలర్లు ఎలీస్ పెరీ (3/16), సోఫీ డివైన్ (2/23), శోభన ఆశ (2/27) యూపీ వారియర్స్‌ను కట్టడి చేశారు. అనంతరం బెంగళూరు జట్టు 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసి గెలిచింది. స్మృతి మంధాన (0) డకౌట్‌కాగా... కనిక అహూజా (30 బంతుల్లో 46; 8 ఫోర్లు, 1 సిక్స్), రిచా ఘోష్ (32 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) ఐదో వికెట్‌కు 60 పరుగులు జోడించి బెంగళూరు విజయంలో కీలకపాత్ర పోషించారు. బెంగళూరు విజయానికి 16 పరుగుల దూరంలో కనిక అవుటైనప్పటికీ రిచా అజేయంగా నిలిచి తమ జట్టును గెలుపు తీరానికి చేర్చింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ X గుజరాత్
రాత్రి గం. 7:30 నుంచి
స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: హీలీ (సి) ఆశ (బి) సోఫీ డివైన్ 1; దేవిక (ఎల్బీడబ్ల్యూ) (బి) సోఫీ డివైన్ 0; నవ్‌గిరే (సి) రిచా (బి) ఆశ 22; తాలియా (సి) రిచా (బి) షుట్ 2; గ్రేస్ హారిస్ (సి) రిచా (బి) ఎలీస్ పెరీ 46; సిమ్రన్ (సి) కనిక (బి) ఆశ 2; దీప్తి శర్మ (సి) శ్రేయాంక (బి) ఎలీస్ పెరీ 22; శ్వేత (బి) ఎలీస్ పెరీ 6; సోఫీ ఎకిల్‌స్టోన్ (రనౌట్) 12; అంజలి శర్వాణి (సి) కనిక (బి) శ్రేయాంక 8; రాజేశ్వరి (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు** 12; **మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 135. వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-5, 4-29, 5-31, 6-100, 7-101, 8-112, 9-133, 10-135. **బౌలింగ్:** సోఫీ డివైన్ 4-0-23-2, మేగన్ షుట్ 4-0-21-1, రేణుక 2-0-20-0, శోభన ఆశ 4-0-27-2, పెరీ 4-0-16-3, శ్రేయాంక 1.3-0-21-1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సోఫీ డివైన్ (సి) తాలియా (బి) గ్రేస్ హారిస్ 14; స్మృతి (బి) దీప్తి శర్మ 0; పెరీ (సి) ఎకిల్‌స్టోన్ (బి) దేవిక 10; హీథెర్ నైట్ (సి) కిరణ్ నవ్‌గిరే (బి) దీప్తి శర్మ 24; కనిక (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 46; రిచా (నాటౌట్) 31; శ్రేయాంక (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (18 ఓవర్లలో 5 వికెట్లకు) 136. వికెట్ల పతనం:** 1-14, 2-14, 3-43, 4-60, 5-120. **బౌలింగ్:** గ్రేస్ హారిస్ 3-0-28-1, దీప్తి శర్మ 4-0-26-2, రాజేశ్వరి 4-0-35-0, సోఫీ ఎకిల్‌స్టోన్ 4-0-20-1, అంజలి శర్వాణి 1-0-4-0, దేవిక 2-0-19-1.

'షూటౌట్'లో భారత్ గెలుపు

ఆస్ట్రేలియాకు మరో ఓటమి



రూర్కెలా: సొంతగడ్డపై ప్రొ హాకీ లీగ్ దశను భారత పురుషుల జట్టు విజయంతో ముగించింది. ఆస్ట్రేలియా జట్టుతో బుధవారం జరిగిన రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 'షూటౌట్'లో 4-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. అంతకుముందు నిర్ణీత సమయం పూర్తయ్యాక రెండు జట్లు 2-2తో సమఉజ్జీగా నిలిచాయి. రెగ్యులర్ టైమ్‌లో భారత్ తరఫున వివేక్ సాగర్ ప్రసాద్ (2వ ని.లో), సుఖ్‌జీత్ సింగ్ (47వ ని.లో)... ఆస్ట్రేలియా తరఫున నాథన్ ఎఫార్మస్ (37వ ని.లో), టిమ్ హోవర్డ్ (52వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 'షూటౌట్'లో తొలి ఐదు షాట్‌లలో భారత్ నుంచి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్ సఫలమవ్వగా... హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్ విఫలమయ్యారు. ఆస్ట్రేలియా తరఫున జేక్ హార్వీ, క్రెయిగ్ మర్రైస్, జాక్ వెల్ప్ గోల్స్ చేయగా... జేక్ వెటన్, నాథన్ ఎఫార్మస్ గురి తప్పారు. దాంతో 'షూటౌట్'లో రెండు జట్లు 3-3తో సమంగా నిలిచాయి. 'సడెన్‌డెత్'లో తొలి షాట్‌ను హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచగా... ఆస్ట్రేలియా ప్లేయర్ జాక్ వెల్ప్ షాట్‌ను భారత గోల్‌కీపర్ శ్రీజేశ్ నిలువరించడంతో టీమిండియా విజయం ఖాయమైంది.

సినిమా


రవితేజ

వెయ్యిన్నొక్క జిల్లాల వరకు...

'వెయ్యిన్నొక్క జిల్లాల వరకు వింటున్నాము నీ కీర్తినే.. ముల్లోకాల ఏ మూల ఉన్నా నీ అందాల సంకీర్తనే' అని పాడుతున్నారు రావణాసుర. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'రావణాసుర'. సుశాంత్ కీ రోల్ చేసిన ఈ చిత్రంలో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ హీరోయిన్లు. రవితేజ, అభిషేక్ నామా నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఈ చిత్రంలోని 'వెయ్యిన్నొక్క జిల్లాల..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. వెంకటేశ్ 'సూర్య ఐపీఎస్' చిత్రంలోని 'వెయ్యిన్నొక్క జిల్లాలకు..' పాటకు ఇది రీమిక్స్ వెర్షన్. అప్పట్లో ఈ పాటకు 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి లిరిక్స్ అందించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో అనురాగ్ కులకర్ణి ఈ లేటెస్ట్ వెర్షన్‌ను పాడారు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్.



ఓ భారతీయుడిగా గర్వపడుతున్నాను

- ఎన్టీఆర్

''ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషం ఇచ్చింది. అదొక అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్. మాటల్లో వర్ణించలేని అనుభూతి. ప్రేక్షకుల అభిమానం, ప్రేమ, ఆశీర్వచనాల మూలంగానే ఆస్కార్ అవార్డు సాధించడం సాధ్యమైంది. ఇండస్ట్రీ సహకారం కూడా తోడుగా నిలిచింది. 'రౌద్రం..రణం ..రుధిరం' (ఆర్ఆర్ఆర్) మూవీని ప్రోత్సహించిన ప్రతి భారతీయుడికి ధన్యవాదాలు'' అని ఎన్టీఆర్ అన్నారు. ఈ నెల 12న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13)న లాస్ ఏంజిల్స్‌లో జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డు దక్కిన విషయం తెలిసిందే. సంగీత దర్శకుడు కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్ ఈ అవార్డును అందుకున్నారు. అవార్డ్ ప్రదానోత్సంలో పాల్గొన్న ఎన్టీఆర్ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ – ''మనకు అవార్డు వచ్చినందుకు ఓ భారతీయుడిగా, ఓ తెలుగువాడిగా గర్వపడుతున్నాను. వేదికపై కీరవాణిగారు, చంద్రబోస్‌గారు అవార్డును అందుకున్న క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. ఆస్కార్ వచ్చిన విషయాన్ని నేను తొలిసారిగా నా భార్య (లక్ష్మీప్రణతి)తో పంచుకున్నాను. అలాగే నేను ఆస్కార్ అవార్డును పట్టుకున్నప్పుడు ఈ దేశం ఎంత బరువుందో అవార్డు కూడా అంత బరువున్నట్లుగా అనిపించింది'' అని అన్నారు. ఈ పాట కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ మాట్లాడుతూ– ''ఆస్కార్ వేదికపై 'నాటు నాటు'పాటకు స్టాండింగ్ ఒవేషన్ దక్కగానే నాకు కన్నీళ్లు వచ్చాయి. ఆస్కార్ అవార్డు దక్కిన తర్వాత కీరవాణిగారు నన్ను ఆలింగనం చేసుకున్నారు. నేను ఆస్కార్ ప్రదానోత్సవంలో పాల్గొనడం అనేది 'ఆర్ఆర్ఆర్' సపోర్ట్ వల్లే సాధ్యమైంది'' అన్నారు. మరోవైపు 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఈ పాట కోసం జరిగిన గూగుల్ సెర్చ్ వెయ్యి శాతానికిపైగా పెరిగిందని జపాన్‌కు చెందిన ఓ సంస్థ పేర్కొంది. కాగా ప్రస్తుతం జపాన్‌లో 'ఆర్ఆర్ఆర్' ఇంకా ప్రదర్శితమవుతున్న సంగతి తెలిసిందే.

రంగమార్తాండ వచ్చేస్తున్నాడు


● ప్రకాశ్ రాజ్

థియేటర్స్‌కు రావడానికి రెడీ అయ్యాడు రంగ మార్తాండ. ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రంగ మార్తాండ'. కృష్ణవంశీ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ''ఈ మార్చి 22న రంగమార్తాండుడి జీవన నాటకం..' అని పేర్కొన్నారు దర్శకుడు కృష్ణవంశీ. రాహుల్ సిప్లిగంజ్, అనసూయ భరద్వాజ్, ఆదర్శ్ బాలకృష్ణ, శివాత్మిక రాజశేఖర్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు ఇళయరాజా సంగీతం అందించారు. మరాఠీ ఫిల్మ్ 'నటసామ్రాట్'కు తెలుగు రీమేక్‌గా 'రంగమార్తాండ' రూపొందింది.

ఇతనే చెంగారెడ్డి


● జోజు జార్జ్

వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నూతన దర్శకుడు ఎస్.శ్రీకాంత్ రెడ్డి ఓ సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఎస్.నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని చెంగారెడ్డి పాత్రలో మలయాళ నటుడు జోజు జార్జ్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేసింది చిత్రయూనిట్. ''పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో వైష్ణవ్ తేజ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారు. 'జోసెఫ్, నాయట్టు, ఇరాట్ట' వంటి మలయాళ హిట్ ఫిల్మ్స్‌లో నటించిన జోజు జార్జ్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

మీటర్ అలాంటి ప్రయత్నమే

- కిరణ్


● రమేష్, కిరణ్

''ఏ కథానాయకుడైనా పెద్ద కమర్షియల్ హీరో అవ్వాలంటే అన్ని రకాల సినిమాలు చేయాలి. నేను కూడా అలా ఒకటి ప్రయత్నించాను.. అదే 'మీటర్'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. రమేష్ కాదూరి దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా తెరకెక్కిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదలకానుంది. సాయి కార్తీక్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చమక్ చమక్ పోరి..' అనే పాటని అభిమానుల మధ్య థియేటర్‌లో విడుదల చేశారు. ''అందరూ ఏప్రిల్ 7న మా సినిమా చూసి పెద్ద విజయం అందించాలి'' అన్నారు చిరంజీవి (చెర్రీ). ''సమ్మర్‌కి కూల్‌గా ఉండే సినిమా 'మీటర్'' అన్నారు రమేష్ కాదూరి. ఈ వేడుకలో సంగీత దర్శకుడు సాయి కార్తీక్, ఆర్ట్ డైరెక్టర్ జేవీ తదితరులు పాల్గొన్నారు.

పల్లెటూరుని సహజంగా సృష్టించాం

- అవినాష్ కొల్ల



''దసరా' కథకు తగ్గట్టు భారీ విలేజ్ సెట్ వేశాం. ఇల్లు, స్కూల్, మైదానం, బార్.. ఇలా ఐదు వందల మంది నివసించే పల్లెటూరుని సహజంగా సృష్టించాం. 98 శాతం షూటింగ్ ఈ సెట్‌లోనే జరిగింది'' అని ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల అన్నారు. నాని హీరోగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'దసరా'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కీర్తీ సురేశ్ హీరోయిన్. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ అవుతోంది. ఈ మూవీ ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల మాట్లాడుతూ– ''నానీ గారితో 'కృష్ణగాడి వీర ప్రేమగాథ, జెర్సీ, శ్యామ్ సింగరాయ్' సినిమాలు చేశాను. నాకు పేరు వచ్చే కంటెంట్ ఉన్న సినిమాలు నానీగారి వల్లే వచ్చాయి. ఆయన గత సినిమాలతో పోల్చితే 'దసరా' చాలా డిఫరెంట్ మూవీ. సంస్కృతి పరంగా 25 ఏళ్ల క్రితం నాటి ఊరు ఇందులో కనిపిస్తుంది. ఈ సెట్ కోసం గోదావరిఖని రిఫరెన్స్ తీసుకున్నా. దాదాపు 22 ఎకరాల్లో రెండున్నర నెలలు 800మందికిపైగా పనిచేసి సెట్ వేశాం. శ్రీకాంత్ ఓదెలకి తొలి సినిమా అయినా అన్ని విషయాలపై చాలా క్లారిటీ ఉంది. ప్రస్తుతం శంకర్– రామ్ చరణ్‌గారి మూవీ, నానీగారి 30వ చిత్రం, అఖిల్ 'ఏజెంట్' సినిమాలు చేస్తున్నాను'' అన్నారు.

గౌరవిస్తుంటే భయంగా ఉంది


- వేణు ఎల్దండి



''బలగం' సినిమా తర్వాత నా క్లోజ్ ఫ్రెండ్స్ కూడా నన్ను అరేయ్ అని పిలవటం లేదు. సరదాగా జోకులు వేసుకుని తిరిగే బ్యాచ్ సడెన్‌గా గౌరవం ఇస్తుంటే చాలా కొత్తగా, భయంగా ఉంది. దాన్ని జీర్ణించుకోవటానికి కాస్త సమయం పడుతుంది'' అని డైరెక్టర్ వేణు ఎల్దండి అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు వేణు ఎల్దండి మాట్లాడుతూ– ''నేను 20 ఏళ్లుగా నటిస్తున్నాను. రెండు వందల సినిమాలు చేసినా మంచి కమర్షియల్ సక్సెస్ రాలేదు. నన్ను నేను ప్రమోట్ చేసుకుందామని కథలు రాయడం మొదలుపెట్టాను. రొటీన్‌కి భిన్నంగా వెళ్లాలనిపించి 'బలగం' కథను తయారు చేసుకున్నాను. మా నాన్నగారు చనిపోయినప్పుడు జరిగిన కొన్ని ఘటనలు, నా లైఫ్‌లో నేను చూసిన సంఘటనలతో 'బలగం' రాసుకున్నాను. చిరంజీవిగారు మా సినిమా గురించి మాట్లాడటం ఆనందంగా అనిపించింది. ఇకపై నన్ను డైరెక్టర్‌గా, యాక్టర్‌గానూ చూస్తారు'' అన్నారు.

ఫొటోలు తీయబడును

చైతన్యరావు, లావణ్య హీరో హీరోయిన్లుగా చెందు ముద్దు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. 'ఇచ్చట అందమైన ఫోటోలు తీయబడును' అనేది ఉపశీర్షిక. బిగ్‌బెన్ సినిమాస్‌పై యశ్ రంగినేని నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేసి, సినిమా హిట్ సాధించాలని ఆకాంక్షించారు. చైతన్యరావు మాట్లాడుతూ –''ఇప్పుడున్న ఫాస్ట్‌లైఫ్ నుంచి దూరంగా ప్రేక్షకులను 1980 నేపథ్యంలోకి తీసుకువెళ్లే సినిమా ఇది'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథే ఈ చిత్రం. కథలో ఉన్న ట్విస్టులు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను అలరిస్తాయి'' అన్నారు చందు. ''ఫన్, థ్రిల్లింగ్, క్రైమ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు నిర్మాత యశ్ రంగినేని.


● సురేష్ బాబు, చైతన్య

మిథునం నిర్మాత ఇక లేరు


● ఆనందరావు

'మిథునం' వంటి మంచి చిత్రాన్ని నిర్మించిన ముయిద ఆనందరావు (57) ఇక లేరు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. విజయనగరం జిల్లా రేగిడి మండలం వావిలవలస గ్రామానికి చెందిన ఆనందరావు ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి, వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. సంఘ సేవకుడిగానూ మంచి గుర్తింపు పొందారాయన. సాహిత్యమంటే ఆయనకు మక్కువ. పర్యావరణ హిత పద్యాలను రాసి కోటిగాడు పేరుతో ప్రచురణ చేసేవారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మి కీలక పాత్రల్లో తనికెళ్ల భరణి దర్శకత్వంలో ఆనందరావు నిర్మించిన చిత్రం 'మిథునం'. 2012లో విడుదలైన ఈ సినిమా 2017లో నంది అవార్డును సొంతం చేసుకుంది. ఆనందరావు మృతితో వావిలవలస గ్రామంలో విషాదం అలముకుంది. ఆయనకు భార్య పద్మినితో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆనందరావు మృతిపై విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. నేడు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

సాక్షి బిజినెస్
గురువారం
16-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 344	నిఫ్టీ ▽ 71
57,556	16,972

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	11,351	▽	77
డోజోన్స్	31,632	▽	524
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,345	▽	293
డాక్స్	14,735	▽	496
షాంఘై	3,263	△	18
నికాయ్	27,229	△	7

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

హోండా 100 సీసీ షైన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్ సైకిల్, స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) తాజాగా 100 సీసీ షైన్ 100 బైక్‌ను ఆవిష్కరించింది. మహారాష్ట్ర ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్ ధర రూ.64,900 ఉంది. డెలివరీలు మే నుంచి మొదలు కానున్నాయి. ఏడాదిలో 3 లక్షల యూనిట్ల విక్రయం లక్ష్యంగా చేసుకున్నట్టు కంపెనీ తెలిపింది. వచ్చే మూడు ఏళ్లలో దీనిని 6 లక్షల యూనిట్లకు తీసుకువెళతామని వివరించింది. దేశంలో టూవీలర్ల మార్కెట్లో 100 సీసీ విభాగం మూడింట ఒక వంతు కైవసం చేసుకుంది. ద్విచక్ర వాహనాలకు డిమాండ్ తిరిగి పుంజుకోవడంతో గుజరాత్ ప్లాంటులో కొత్త తయారీ లైన్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా ఎండీ, ప్రెసిడెంట్, సీఈవో అట్సుషి ఒగటా తెలిపారు. షైన్ 100 రాకతో కంపెనీ చరిత్రలో తొలిసారిగా వచ్చే ఏడాది పూర్తి తయారీ సామర్థ్యంతో ప్లాంట్లు నడిచే అవకాశం ఉందన్నారు. దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో హెచ్‌ఎంఎస్‌ఐకి 35 శాతం వాటా ఉంది. 2024 మార్చినాటికి భారత్‌లో హోండా ఎలక్ట్రిక్ స్కూటర్ రంగ ప్రవేశం చేయనుంది.

యూపీఐలో కెనరా బ్యాంక్ రూపే క్రెడిట్ కార్డ్




హైదరాబాద్: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ తన రూపే క్రెడిట్ కార్డులను యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) పరిధిలోకి తీసుకొచ్చింది. బ్యాంక్ కస్టమర్లందరూ తమ యాక్టివ్ రూపే క్రెడిట్ కార్డ్‌ను యూపీఐకి అనుసంధానం చేసుకోవచ్చు. ఖాతా ఆధారిత యూపీఐ లావాదేవీల తరహాలోనే కార్డ్‌ని భౌతికంగా వినియోగించకుండానే చెల్లింపులు జరపవచ్చు. పీఓఎస్ మెషీన్‌లు లేని వ్యాపారులు యూపీఐతో అనుసంధానమైన రూపే క్రెడిట్ కార్డు కలిగి ఉన్న కస్టమర్ల నుంచి చెల్లింపులు పొందవచ్చు. దీనివల్ల చిన్న వ్యాపారులు తక్కువ ఖర్చుతో విక్రయాల టర్నోవర్‌ను, వ్యాపారాన్ని పెంచుకోవచ్చు.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	57,902	▲ 297
బంగారం (99.5 స్వచ్ఛత)	57,671	▲ 297
వెండి (కిలో)	66,861	▲ 685

శక్తికాంత్‌కు '2023 సెంట్రల్ బ్యాంకర్' అవార్డు

కీలక సవాళ్లను అధిగమించినట్లు ఇంటర్నేషనల్ పబ్లికేషన్ ప్రశంసలు



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్‌కు 'గవర్నర్ ఆఫ్ ది ఇయర్ 2023 అవార్డు' లభించింది. మహమ్మారి కరోనా సంక్షోభం, ఉక్రెయిన్‌పై రష్యా దాడి, భౌగోళిక ఉద్రిక్తతల వంటి అనిశ్చిత ఆర్థిక పరిస్థితుల్లో ఫైనాన్షియల్ మార్కెట్లను సమర్థవంతంగా నడిపిస్తున్నందుకుగాను ఇంటర్నేషనల్ పబ్లికేషన్ సెంట్రల్ బ్యాంకింగ్ శక్తికాంతదాస్‌ను ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికచేసింది. భారత దేశం నుంచి 2015లో మొట్టమొదటిసారి అప్పటి సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ రఘురామ్ రాజన్‌కు ఈ అవార్డు దక్కింది. కీలక సమయాల్లో గవర్నర్ శక్తికాంతదాస్ పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని ఇంటర్నేషనల్ పబ్లికేషన్ తాజాగా పేర్కొంది. పేమెంట్ వ్యవస్థసహా పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయన శ్రీకారం చుట్టారని తెలిపింది. కరోనా మహమ్మారిని ప్రస్తావిస్తూ, కీలక సవాలును భారత్ ఎదుర్కొనగలిగినట్లు పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లు అందరూ భిన్నమైన ప్రాధాన్యతలను కలిగి ఉన్న ప్రభుత్వాలతో కలిసి పనిచేయడంలో సాధారణంగా కష్టాలు ఎదుర్కొంటుంటారని పేర్కొన్న పబ్లికేషన్, ఆయా సమన్వయ చర్యల్లో దాస్ చక్కటి ప్రగతి సాధించగలిగారని వివరించింది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో దాస్ మాట్లాడుతూ, వైరస్‌ను ఎదుర్కొనడానికి నిరంతర పోరాటం అవసరం అన్నారు. ఇటు సాంప్రదాయ పద్ధతుల్లో అటు అసాధరణమైన రీతిలో ఈ పోరాట చర్యలు ఉండాలన్నారు.

ఎగుమతులు.. మూడో నెలా మైనస్

- ఫిబ్రవరిలో 8.8 శాతం క్షీణత
- విలువలో 33.88 బిలియన్ డాలర్లు
- దిగుమతుల బిల్లు 51.31 బిలియన్ డాలర్లు
- వెరసి వాణిజ్య లోటు 17.43 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: ప్రపంచ, దేశీయ తాజా ఆర్థిక అనిశ్చితి పరిస్థితులకు భారత్ వస్తు ఎగుమతి, దిగుమతి గణాంకాలు అద్దం పడుతున్నాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే.. ఎగుమతులు వరుసగా మూడవ నెల ఫిబ్రవరిలోనూ వృద్ధిలేకపోగా క్షీణతనే నమోదుచేశాయి. 2022 ఇదే నెలతో పోల్చితే ఎగుమతుల విలువ 8.8 శాతం పడిపోయి, 33.88 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇక దిగుమతుల్లోనూ 8.21 శాతం క్షీణత నమోదుకావడం గమనార్హం. 2022 ఇదే నెలతో పోల్చితే ఈ విలువ 55.9 బిలియన్ డాలర్ల నుంచి 51.31 బిలియన్ డాలర్లకు పడిపోయింది. వెరసి అధికారిక గణాంకాల ప్రకారం ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్యలోటు 17.43 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య...

2022–23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య 11 నెలల్లో వస్తు ఎగుమతులు 7.5% పెరిగి, 406 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇదే కాలంలో దిగుమతులు 18.82% పెరిగి 653 బిలియన్ డాలర్లుగా నమోదైంది. వెరసి వాణిజ్యలోటు 247 బిలియన్ డాలర్లుగా ఉంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో భారత్ ఎగుమతుల విలువ 422 బిలియన్ డాలర్లు తాకాయి. 2022–23లో ఈ విలువను అధిగమిస్తున్నామన్న హర్షాతిరేకాలు భారత్ ఎగుమతి సంఘాల సమాఖ్య (ఎఫ్‌ఐఈఓ)సహా సంబంధిత వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

- 11 నెలల్లో పెట్రోలియం ప్రొడక్టులు, రసాయనాలు, ఫార్మా, ఎలక్ట్రానిక్ గూడ్స్, బియ్యం, రెడీమేడ్ దుస్తుల ఎగుమతులు పెరగ్గా, ఇంజనీరింగ్ గూడ్స్, రత్నాభరణాలు, కాటన్ యార్న్, ఫ్యాబ్రిక్స్, ప్లాసిక్, లినోలియం ఎగుమతులు క్షీణించాయి.
- పసిడి దిగుమతులు ఇదే కాలంలో భారీగా పడిపోయి, 45.12 బిలియన్ డాలర్ల నుంచి 31.72 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ఇక క్రూడ్ ఆయిల్ దిగుమతుల బిల్లు 11 నెలల్లో 140.67 బిలియన్ డాలర్ల నుంచి 193.47 బిలియన్ డాలర్లకు ఎగసింది.

అంతర్జాతీయ బ్యాంకింగ్ సంక్షోభం!

- వారం రోజుల్లో మూతబడిన రెండు అమెరికన్ బ్యాంకులు
- తాజాగా క్రెడిట్ సూసీపైనా నీలినీడలు
- షేరు 27 శాతం పతనం



సాక్షి, బిజినెస్ డెస్క్: దాదాపు పదిహేనేళ్ల క్రితం తరహాలో అంతర్జాతీయంగా మరో బ్యాంకింగ్ సంక్షోభం ముప్పు ముంచుకు రాబోతోందా? అమెరికా, యూరప్‌వ్యాప్తంగా బ్యాంకుల పరిస్థితి చూస్తే అలాగే కనిపిస్తోందంటున్నారు విశ్లేషకులు. ఇప్పటికే వారం రోజుల వ్యవధిలో అమెరికాలో రెండు బ్యాంకులు మూతబడగా తాజాగా స్విట్జర్లాండ్‌కి చెందిన క్రెడిట్ సూసీ భవిష్యత్తుపై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. బ్యాంకులో మరింతగా ఇన్వెస్ట్ చేసేది లేదంటూ కీలక ఇన్వెస్టరు ప్రకటించడంతో క్రెడిట్ సూసీ షేర్లు బుధవారం 27 శాతం పతనమయ్యాయి. గత రెండేళ్లలో బ్యాంకు షేరు సుమారు 85 శాతం క్షీణించింది. డిఫాల్ట్ అయ్యే అవకాశాలు 40 శాతం మేర ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ కూడా అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగం పరిస్థితులపై ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.

సమస్యలతో సతమతం..

వాస్తవానికి క్రెడిట్ సూసీ గత కొన్నాళ్లుగా సమస్యలతో సతమతమవుతూనే ఉంది. 2019లో సంస్థ సీవోవో పియరీ ఆలివర్ కొందరు ఉన్నత స్థాయి ఉద్యోగులపై నిఘా పెట్టేందుకు ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమించుకున్నారు. అయితే సదరు డిటెక్టివ్ అనుమానాస్పద రీతిలో మరణించిన తర్వాత ఆలివర్‌ను క్రెడిట్ సూసీ తొలగించింది. ఇదంతా బ్యాంకు వ్యవహారంపై సందేహాలు రేకెత్తించింది. అటుపైన 2021లో ఆర్కిగోస్ క్యాపిటల్ అనే అమెరికన్ హెడ్జ్ ఫండ్ సంస్థ మూతబడటంతో దాదాపు 5 బిలియన్ డాలర్ల భారీ నష్టం మూటకట్టుకుంది. ఆ కంపెనీకి క్రెడిట్ సూసీ బ్రోకరేజి సర్వీసులు అందించేది. అటు పైన గ్రీన్‌సిల్ క్యాపిటల్ అనే మరో సంస్థ మూతబడటంతో.. దాని ప్రభావాల కారణంగా ఇన్వెస్టర్లు 3 బిలియన్ డాలర్ల దాకా నష్టపోయారు. గతేడాది ఫిబ్రవరిలో దాదాపు 100 బిలియన్ డాలర్ల పైగా డిపాజిట్లు ఉన్న 30,000 మంది పైచిలుకు ఖాతాదారులపై మనీలాండరింగ్, అవినీతి తదితర ఆరోపణలు రావడంతో సంస్థ ప్రతిష్ట మరింత మసకబారింది. దీంతో క్రమంగా డిపాజిట్ల విత్‌డ్రాయల్స్ మొదలయ్యాయి. 2019 నుంచి టాప్ లీడర్‌షిప్ ఇప్పటికి అనేక సార్లు మారింది. గతేడాది క్రెడిట్ సూసీ పెట్టుబడుల కోసం అన్వేషిస్తుండగా.. సౌదీ నేషనల్ బ్యాంక్ 1.5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. సంస్థలో మరింతగా ఇన్వెస్ట్ చేసే యోచన లేదని సౌదీ నేషనల్ బ్యాంక్ చైర్మన్ అమ్మార్ అల్ ఖుదైరీ ప్రకటించడం తాజాగా క్రెడిట్ సూజీ షేర్ల పతనానికి దారి తీసింది. 2018లో 16 స్విస్ ఫ్రాంకులుగా ఉన్న షేరు ప్రస్తుతం 1.70 ఫ్రాంకులకు (ఒక స్విస్ ఫ్రాంక్ విలువ సుమారు రూ. 89). పడిపోయింది.

మార్కెట్లలో ప్రకంపనలు..

ఇప్పటికే అమెరికాలో సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ) మూతబడటం, తాజాగా క్రెడిట్ సూసీ పరిణామాలతో ఇతరత్రా బ్యాంకులపైనా ప్రభావం పడింది. బుధవారం పలు యూరోపియన్ బ్యాంకుల షేర్లు రెండంకెల స్థాయిలో క్షీణించాయి. ఫ్రాన్స్‌కు చెందిన సొసైటీ జనరల్ 12 శాతం, బీఎన్‌పీ పారిబా 10 శాతం, జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్.. బ్రిటన్ సంస్థ బార్‌క్లేస్ బ్యాంక్ మొదలైనవి సుమారు 8 శాతం పడిపోయాయి. రెండు ఫ్రెంచ్ బ్యాంకుల్లోనూ కొంత సమయం పాటు ట్రేడింగ్‌ను నిలిపివేశారు. అటు అమెరికాలో బ్యాంకులూ అదే బాటలో పయనించాయి. ప్రధానంగా డిపాజిటర్లు ఎకాయెకిన డిపాజిట్లను వెనక్కి తీసుకునే రిస్కులు ఉన్న చిన్న, మధ్య రకం బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ 17 శాతం, ఫిఫ్త్ థర్డ్ బ్యాంకార్ప్ 6 శాతం, జేపీమోర్గాన్ చేజ్ 4 శాతం పతనమయ్యాయి.

17 వేల దిగువకు నిఫ్టీ

సెన్సెక్స్ నష్టం 344 పాయింట్లు



ముంబై: ఆరంభ లాభాలను కోల్పోయిన స్టాక్ సూచీలు వరుసగా అయిదోరోజూ నష్టపోయాయి. వడ్డీరేట్ల పెంపు భయాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, బ్యాంకుల ఆర్థిక స్థితిగతులపై ఆందోళనలు, అధిక ద్రవ్యోల్బణ పరిస్థితులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫైనాన్స్, బ్యాంకింగ్, టెలికాం షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 344 పాయింట్లు నష్టపోయి 57,556 వద్ద స్థిరపడింది. నిఫ్టీ గతేడాది(2022) అక్టోబర్ 11 తర్వాత తొలిసారి 17వేల స్థాయి దిగువన ముగిసింది. మొత్తంగా 71 పాయింట్లను కోల్పోయి 16,972 వద్ద నిలిచింది. మెటల్, ఫార్మా, వినిమయ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించింది. డాలర్‌తో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. కాగా, ఐపీఓ ముగింపు నాటికి గ్లోబల్ సర్ఫేసెస్ 12.21 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. 77.49 లక్షల షేర్లను జారీ చేయగా, మొత్తం 9.46 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి.

డాక్టర్ అంజిరెడ్డి తొలి స్మారకోపన్యాసం..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్‌ఎల్) తమ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కె. అంజిరెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా తొలి స్మారకోపన్యాస కార్యక్రమం నిర్వహించింది. ఇందులో నోబెల్ బహుమతి గ్రహీత .. ఇజ్రాయెల్‌కు చెందిన ప్రొఫెసర్ అడా ఇ. యోనత్, భారత ప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారు కె. విజయ రాఘవన్, ఇగ్నైట్ లైఫ్ సైన్స్ ఫౌండేషన్ సీఈవో స్వామి సుబ్రమణియన్, కాంటినెంటల్ హాస్పిటల్స్ సీఎండీ గురు ఎన్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఔషధాలను చౌకగా అందుబాటులోకి తేవాలన్నది అంజి రెడ్డి విజన్ అని డాక్టర్ రెడ్డీస్ సహ చైర్మన్ జి.వి. ప్రసాద్ తెలిపారు. శాస్త్రీయ, సామాజిక అంశాలపై పెద్ద స్థాయిలో చర్చలు జరగడం అంజి రెడ్డికి నిజమైన నివాళి కాగలదని కంపెనీ చైర్మన్ సతీష్ రెడ్డి తెలిపారు. తదుపరి తరం యాంటీబయోటిక్స్ రూపకల్పనలో తన పరిశోధనలు ఏ విధంగా తోడ్పడగలవన్నది యోనత్ ఈ సందర్భంగా వివరించారు.

మీడియా పాయింట్

సభా సంప్రదాయాలు దిగజార్చేలా
ప్రతిపక్ష నేతల ప్రవర్తన

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రెండోరోజు బుధవారం పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు.

ప్రతిపక్షం తీరు గర్హనీయం



అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలు ప్రవర్తించిన తీరు సభా సంప్రదాయాలను దిగజార్చేలా ఉంది. వారి ప్రవర్తనను ప్రజాస్వామ్య వాదులు గమనించాలి. గవర్నర్ సందేశంపై ఒక ప్రముఖ తెలుగు పత్రికలో వచ్చిన వార్తను పీఏసీ చైర్మన్ ఆమోదించాలి లేదా ఖండించాలి. అలా కాకుండా సభలో అనవసర విమర్శలు చేసి సభా సమయాన్ని వృథా చేశారు. రాష్ట్రంలో ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రతిపక్షం లేనిపోని విమర్శలు చేస్తోంది.

– శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సమాచార శాఖ మంత్రి

పవన్ ఉద్దేశం అర్థమైంది



పార్టీ పెట్టి పదేళ్లయిన సందర్భంగా నిర్వహించిన సభలో ఉత్తమ నాయకులు ఎవరైనా కార్యకర్తలకు, అభిమానులకు దిశా నిర్దేశం చేస్తారు. పవన్ మాత్రం బందరు సభలో 'మిమ్మల్ని అమ్ముతాను సిద్ధంగా ఉండండి' అని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. వెన్నుపోటు రాజకీయ నాయకుడు చంద్రబాబును పవన్ సమర్థుడిగా కీర్తించడం చూస్తుంటే ప్రజలకు ఏం చెప్పదలచుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. తనకు కులం లేదు, మతం లేదు.. అంటూనే నిరంతరం కుల నామస్మరణ చేస్తున్నారు.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

సభకు ఆటంకం కలిగించడమే వారి పని



ప్రతిపక్ష టీడీపీ సభ్యులు ఓ ప్రణాళిక ప్రకారం సభలో గందరగోళం సృష్టించి సస్పెండ్ అవ్వాలనే వచ్చారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సభలో నిరసన తెలియజేశారు. ఆయనకు షుగర్, బీపీ వంటి ఆరోగ్య సమస్యలున్నాయి. దాంతో ఆయన్ను కూర్చోవాల్సిందిగా పలుమార్లు విజ్ఞప్తి చేసినా అనైతిక విధానానికే ఆయన తెరలేపారు. కోటంరెడ్డి చట్టసభలో అడుగుపెట్టడానికి కారణం సీఎం జగన్ కాదా? కోటంరెడ్డికి దమ్ముంటే తన పదవికి రాజీనామా చేసి సభకు రావాలి.

– పీజేఆర్ సుధాకర్‌బాబు, ఎమ్మెల్యే


రంగాను చంపిన వాళ్లను పవన్ సమర్థిస్తున్నారు..



జనసేన పార్టీకి దశ, దిశ ఏమైనా ఉందా? వంగవీటి రంగాను హత్యచేయించింది చంద్రబాబేనని హరిరామజోగయ్య తన పుస్తకంలో రాశారు. రంగాను హత్య చేసిన వారినే పవన్ సమర్థిస్తున్నారు. వాళ్లకు అనుకూలంగా మాట్లాడాలని పవన్ జనసేన పార్టీ శ్రేణులకు సూచనలిస్తున్నారు. రంగాను చంపిన వాళ్లను పవన్ సమర్థిస్తున్నారా? ఐదేళ్ల చంద్రబాబు పాలనలో ఒక్క రోడ్డయినా వేశారా? సీఎం జగన్ ప్రజలకు మంచి చేస్తుంటే ఆయనపై విమర్శలా?

– కారుమూరి నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి

సీఎం జగన్ వెంటే కాపులు



పవన్ కళ్యాణ్ ముమ్మాటికీ ప్యాకేజీ స్టారే. రాజకీయాల్లో ఎవరైనా కులాన్ని నమ్ముకుంటారు.. కానీ పవన్ కళ్యాణ్ కులాన్ని అమ్ముకున్నారు. పవన్ పరిస్థితి మూడు నెలలకు మూడు మెరుపులు.. ఆరు నెలలకు ఆరు అరుపులు అన్న చందంగా ఉంది. కులం లేదన్న పవన్ మొత్తం కులం మీదే మాట్లాడుతున్నారు. సీఎం వైఎస్ జగన్ వెంటే కాపులున్నారు. పవన్ తన పార్టీని చంద్రబాబుకు తాకట్టు పెట్టారు.

– ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చర్చకు పదేపదే అడ్డు

- టీడీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్
- ప్రస్తుత సమావేశాలు కొనసాగినన్ని రోజులు సస్పెండైన కేశవ్, నిమ్మల
- ఎమ్మెల్యే కోటంరెడ్డిపైనా సస్పెన్షన్ వేటు
- మరో పది మంది టీడీపీ ఎమ్మెల్యేలు ఒక రోజు పాటు..



సాక్షి, అమరావతి: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు అడ్డుపడుతున్న కారణంగా టీడీపీ ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడులను ప్రస్తుత శాసనసభా సమావేశాలు కొనసాగినన్ని రోజులూ సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. ఈ మేరకు శాసన సభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రతిపాదనకు సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. కాగా, పార్టీకి సంబంధించిన ఇద్దరు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం సభకు హాజరైన మిగిలిన పది మంది టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి స్పీకర్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేశవ్, నిమ్మలతో కలిసి టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం పైకి ఎక్కి ఆందోళన చేశారు. సస్పెండ్ అయిన ఇద్దరిని మార్షల్స్ బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా మిగిలిన టీడీపీ సభ్యులు అడ్డుపడ్డారు. స్పీకర్ సూచనలను బేఖాతరు చేస్తూ టీడీపీ సభ్యులు నినాదాలు కొనసాగించారు. ప్లాన్ ప్రకారమే టీడీపీ సభ్యులు నినాదాలు చేస్తున్నారని మంత్రి బుగ్గన తప్పుపట్టారు. ఎంత వారించినా టీడీపీ సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో.. పది మంది టీడీపీ ఎమ్మెల్యేలను ఒక రోజు పాటు సస్పెండ్ చేయాలని మంత్రి బుగ్గన ప్రతిపాదించారు. సభ ఆమోదంతో అచ్చెన్న, అశోక్, భవాని, గద్దె రామ్మోహన్‌రావు, సాంబశివరావు, గొట్టిపాటి రవి, డోలా వీరాంజనేయులు, చిన రాజప్ప, మంతెన రామరాజు, గణబాబులను ఒక రోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. స్పీకర్ సస్పెండ్ ప్రకటన పూర్తి కాకముందే పోడియం వద్ద ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు బయటకు వెళ్లిపోవడం గమనార్హం.

ప్రస్తుత సమావేశాలన్ని రోజులు కోటంరెడ్డి సస్పెన్షన్..

టీడీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్ అనంతరం, స్పీకర్ తమ్మినేని పలుమార్లు వారించినా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సీటులో కూర్చొనేందుకు నిరాకరించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా టీడీపీ వారితో కలిసి ప్లాన్ ప్రకారమే గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. శ్రీధర్‌రెడ్డి స్పీకర్ పోడియం వద్దకు కూడా వెళ్లి ఆందోళన చేయడంతో ఆయనను కూడా ప్రస్తుత శాసనసభా సమావేశాలు కొనసాగినన్ని రోజులు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

కోటంరెడ్డి నమ్మకద్రోహి: మంత్రి అంబటి

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నమ్మకద్రోహి అని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సభను అడ్డుకునేందుకు ప్రయత్నించిన కోటంరెడ్డి తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, టీడీపీ కోసం ఆయన పని చేస్తున్నారన్నారు. ఇన్నాళ్లూ గుర్తు లేని సమస్యలు ఇప్పుడు ఒక్కసారిగా ఆయనకు గుర్తుకు వచ్చాయా అని నిలదీశారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ వ్యక్తిగత అంశాలకు సభలో చోటులేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత మంత్రులు, అధికారులకు వినతిపత్రం ఇస్తే పరిష్కరిస్తామని కోటంరెడ్డికి సూచించారు.

ఎమ్మెల్సీలు భగీరథరెడ్డి, అర్జునుడు లేనిలోటు తీరనిది

దివంగత ఎమ్మెల్సీలకు మండలి సంతాపం

సాక్షి, అమరావతి: దివంగత సభ్యులు చల్లా భగీరథరెడ్డి, బచ్చుల అర్జునుడు అకాల మృతికి శాసనమండలి సంతాపం తెలిపింది. గత సమావేశాల్లో తమతో ఉన్న సభ్యులు ఈ సమావేశంలో లేకపోవడం బాధాకరమని, ఎంతో రాజకీయ అనుభవం ఉన్న అర్జునుడు, ఎంతో భవిష్యత్ ఉన్న భగీరథరెడ్డి లేనిలోటు తెలుస్తోందని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ మోషేన్‌రాజు అధ్యక్షతన బుధవారం సమావేశమైన శాసనమండలిలో దివంగత సభ్యులు చల్లా భగీరథరెడ్డి, బచ్చుల అర్జునుడు అకాల మృతికి సంతాపం తెలుపుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తీర్మానాలు ప్రవేశపెట్టారు. చైర్మన్ మోషేన్‌రాజు, వైస్ చైర్మన్ జకియా ఖానమ్, సభ్యులు జంగా కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, డొక్కా మాణిక్యవరప్రసాద్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు.. భగీరథరెడ్డి, అర్జునుడుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం లభించాలని కోరారు. మండలి సభ్యుడిగా కొనసాగుతూ అకాల మరణం చెందిన చల్లా రామకృష్ణారెడ్డి వారసుడిగా వచ్చిన భగీరథరెడ్డి కూడా గత సమావేశాల్లో కనిపించి, ఇప్పుడు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బచ్చుల అర్జునుడు అతి సామాన్య కటుంబం నుంచి ఉన్నత స్థాయి నేతగా ఎదిగారని, రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం చైర్మన్ సభను గురువారానికి వాయిదా వేశారు.

ప్యానల్ చైర్మన్లుగా నలుగురు

మండలి ప్రారంభం కాగానే బుధవారం సెషన్‌కు చైర్మన్ మోషేన్‌రాజు ప్యానల్ చైర్మన్ల పేర్లను ప్రకటించారు. సభ్యులు పోతుల సునీత, వరుదు కళ్యాణి, తూమాటి మాధవరావు, మంతెన సత్యనారాయణరాజు ప్యానల్ చైర్మన్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

అక్రమ ప్రాజెక్టులపై మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?: కేశవ్



సాక్షి, అమరావతి: పొరుగు రాష్ట్రాలు కడుతున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల రాయలసీమకు జరుగుతున్న అన్యాయం గురించి చెబుతుంటే తమను సభ నుంచి సస్పెండ్ చేశారని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ విమర్శించారు. సస్పెండయిన తర్వాత ఆయన టీడీపీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. సభ నుంచి సస్పెండ్ చేసినా తమ గొంతును సస్పెండ్ చేయలేరన్నారు. కర్ణాటక నిర్మించే అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నా ప్రభుత్వం ప్రశ్నించలేకపోతున్నదని విమర్శించారు. తెలంగాణ అక్రమ ప్రాజెక్టులు వల్ల ఎంత నష్టమో సభలో తెలిపామన్నారు. అప్పర్ భద్రతో రాయలసీమలో భూములు బీడుగా మారే ప్రమాదాన్ని ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిమ్మల మాట్లాడుతూ తాను సీట్లో నుంచి కదలకపోయినా సస్పెండ్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నదన్నారు.

జగన్ పాలన ఓ విజయగాథ

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు



సాక్షి, అమరావతి: దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని సంస్కరణలు, అమలు కాని సంక్షేమ పథకాలు ఏపీలో అమలు జరుగుతున్నాయని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఓ విజయగాథ అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కొనియాడారు. బుధవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జగన్ పేరును గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేయాలన్నారు. దానిపై స్పందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి.. పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు పూర్తికాగానే గిన్నిస్ బుక్ నిర్వాహకులకు శాసనసభ తరఫున జగన్ పేరు చేర్చాలని ప్రతిపాదన పంపుదామన్నారు. ఎమ్మెల్యేలు ఇంకా ఏమన్నారంటే..

టీడీపీని ప్రజలు చీదరించుకుంటున్నారు



గవర్నర్ తన ప్రసంగంలో చెప్పినవన్నీ వాస్తవాలు. ఆయన నేచర్ కాల్ కోసం ఇచ్చిన బ్రేక్‌పై కూడా టీడీపీ రాద్ధాంతం చేయడం వల్ల ప్రజలకు ఏమైనా ప్రయోజనం ఉందా? టీడీపీ తీరును ప్రజలు చీదరించుకుంటున్నారు. నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో జగన్ వెలుగులు నింపారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను అవహేళన చేయడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనం. టీడీపీ హయాంలో పాఠశాలలు బూత్ భవనాల్లా ఉండేవి. ఇప్పుడు పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లను మించి ఉన్నాయి. పేదలకు సీఎం జగన్ 32 లక్షల ఇళ్లు ఇచ్చారు. ఆ విషయంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో జగన్ పేరు నమోదు చేయాలి.

– కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే

కాపులపై కేసులు ఎత్తివేయించిన ఘనత సీఎం జగన్‌ది..



దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీ ముందు వరుసలో ఉంది. ఉత్తమ సీఎంలలో జగన్ మూడో స్థానంలో ఉన్నారు. ఆయన పాలనలో తరతరాలకు చెప్పుకొనేలా సంస్కరణలు చేస్తున్నారు. కానీ చంద్రబాబు ప్రజలకు ఏం చేశారు. ఏం చేస్తానని ప్రజలకు ఆయన చెబుతారు. ప్రభుత్వంపై బురదజల్లడమే ఎల్లో మీడియా పనిగా పెట్టుకుంది. కాపులకు చంద్రబాబు చేసిందేమీ లేదు. ముద్రగడ చేత, వారింటి మహిళల చేత కన్నీళ్లు పెట్టించారు. కానీ కాపులపై కేసులు ఎత్తివేసిన ఘనత జగన్‌ది. ఈ నాలుగేళ్ల సీఎం జగన్ పాలన ఓ విజయగాథ.

– కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే

గిరిజన బతుకుల్లో వెలుగులు



వైద్య, ఆరోగ్య శాఖలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ముఖ్యంగా గిరిజనులకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సీఎం జగన్ పాలనలో గిరిజనులకు న్యాయం జరుగుతోంది. నేనే స్వయంగా విశాఖ కేజీహెచ్‌లో వైద్యం చేయించుకున్నా. ఒకప్పుడు అక్కడికి వెళ్లాలంటేనే భయపడేవాళ్లం. ఇప్పుడు ఇసుకేస్తే రాలనంతమంది ఉంటున్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పదవుల్లో ప్రాధాన్యతనిస్తోంది.

– విశ్వసరాయ కళావతి, ఎమ్మెల్యే

క్లుప్తంగా...

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తొలి రోజు 96.24 శాతం హాజరు
- 9 మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పరీక్షలు జరిగాయని ఇంటర్ బోర్డు పేర్కొంది. మొత్తం 1,489 కేంద్రాల్లో తొలిరోజు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. 5,04,835 మంది విద్యార్థులకు గాను 18,993 మంది గైర్హాజరయ్యారు. 4,85,842 మంది (96.24 శాతం) పరీక్ష రాశారు. వీరిలో జనరల్ కేటగిరీ విద్యార్థులు 4,48,517 మంది కాగా వొకేషనల్ విద్యార్థులు 37,325 మంది ఉన్నారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 97.56 శాతం మంది పరీక్ష రాశారు. కాగా రాష్ట్రం మొత్తం మీద 9 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి.

సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

సాక్షి, అమరావతి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేసే ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోసం కొత్త జేఏసీని ఎన్నుకున్నారు. జేఏసీ నూతన చైర్మన్‌గా కొమ్ము నాగరాజు, సెక్రటరీ జనరల్‌గా ధనుంజయ్‌రెడ్డి, కన్వీనర్‌గా శోభన్‌బాబు, ట్రెజరర్‌గా జగన్ మోహనరావు ఎన్నికయ్యారు.

ఈఏపీసెట్ ద్వారా బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్‌లు

- ఐఎన్‌సీ నిబంధనల మేరకు అడ్మిషన్‌ల ప్రక్రియ
- నోటిఫికేషన్ జారీ చేసిన వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఏపీలోని నర్సింగ్ కళాశాలల్లో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లలో అడ్మిషన్‌లను ఈఏపీసెట్‌లో అర్హత ఆధారంగా చేపట్టనున్నారు. ఈ మేరకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధిక రెడ్డి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇంటర్మీడియట్ మెరిట్ ఆధారంగా కాకుండా ఏదైన ప్రత్యేక పరీక్షలో అర్హత ఆధారంగా నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్‌లు చేపట్టేలా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) నిబంధనలు తెచ్చింది. జాతీయ స్థాయిలో నీట్ నర్సింగ్ పరీక్షను నిర్వహించే వరకు రాష్ట్రంలో ఈఏపీసెట్ ద్వారా అడ్మిషన్‌లు చేపట్టేలా ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇతర రాష్ట్రాల వారు మన దగ్గర నర్సింగ్ విద్య చదవడానికి వస్తుంటారు. ఈ క్రమంలో యాజమాన్య కోటా సీట్లకు సంబంధించి ఈఏపీసెట్‌తో పాటు, నీట్–యూజీ అర్హతను పరిగణలోకి తీసుకోనున్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రత్యేక అర్హత పరీక్షల్లో జనరల్ కేటగిరి అభ్యర్థులు 50 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు 40 పర్సంటైల్, జనరల్ వికలాంగ అభ్యర్థులు 45 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వికలాంగ అభ్యర్థులు 40 పర్సంటైల్ అనేది కనీస అర్హతగా నిర్ణయించారు.

ఈడీ దృష్టికి మార్గదర్శి అక్రమాలు!

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంసీఎఫ్ఎల్) అక్రమాలపై దర్యాప్తు జరుపుతున్న సీఐడీ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. నిధులను దారి మళ్లించి చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న మార్గదర్శిపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతోపాటు ఇతర రాష్ట్రాల సీఐడీ, రిజిస్ట్రేషన్ల శాఖలు కూడా విచారణ జరపాలని నివేదించింది. ఈమేరకు కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపన్ను శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిధిలోని 'తీవ్రమైన ఆర్థిక నేరాల పరిశోధన విభాగం'(ఎస్ఎఫ్ఐవో)తోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల సీఐడీ, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల విభాగాలకు ఫిర్యాదు చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పలు రాష్ట్రాల్లో వ్యాపారం నిర్వహిస్తూ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతుండటంతో చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సీఐడీ విభాగం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో తాము గుర్తించిన అక్రమాలు, అవకతవకలను వివరిస్తూ రూపొందించిన నివేదికను సీఐడీ అధికారులు జత చేశారు. కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా ఈడీ, ఆదాయ పన్ను, కార్పొరేట్ వ్యవహారాల శాఖలు, ఇతర రాష్ట్రాల సీఐడీ విభాగాలు దర్యాప్తు జరపాల్సినంత తీవ్రమైన నేరాలకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ పాల్పడిందని అందులో స్పష్టం చేశారు.



సీఐడీ నివేదికలో ముఖ్యాంశాలు ఇవీ..

- మార్గదర్శి చిట్స్ నిధులను అక్రమంగా బదిలీ చేస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడుతోంది.
- చందాదారులకు చెల్లించాల్సిన డబ్బులను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఇవ్వకుండా రూ.కోట్లలో బకాయిలు పెడుతోంది.
- చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డుల నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘిస్తోంది.
- చందాదారులకు చిట్ మొత్తం చెల్లించకుండా అక్రమ డిపాజిట్లు సేకరిస్తోంది. ఇది రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధం.
- చందాదారుల సొమ్మును అక్రమంగా బదిలీ చేస్తూ ఇతర సంస్థల్లో పెట్టుబడులు పెడుతోంది.
- ఆదాయపన్ను చట్టాలను ఉల్లంఘిస్తూ చందాదారుల నుంచి పరిమితికి మించి భారీ మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతోంది.
- చెల్లింపులపై టీడీఎస్ చెల్లించడం లేదు.

వధూవరులను ఆశీర్వదించిన గవర్నర్ నజీర్



వధూవరులను ఆశీర్వదిస్తున్న గవర్నర్ జస్టిస్ నజీర్, సుప్రీంకోర్టు మాజీ సీజేఐ ఎన్‌వీ రమణ

మంగళగిరి: జస్టిస్ కుంభజడల మన్మథరావు కుమారుడు కౌశిక్ వివాహ రిసెప్షన్‌కు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గుంటూరు జిల్లా చినకాకాని హాయ్‌ల్యాండ్‌లో కౌశిక్ వివాహ రిసెప్షన్ బుధవారం రాత్రి జరిగింది. వధువు ఉదయ, వరుడు కౌశిక్‌లను గవర్నర్ ఆశీర్వదించారు. కాగా, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ వివాహ రిసెప్షన్‌కు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఒక్క పాఠశాలా మూయలేదు

ఎక్కడైనా ఒక్క స్కూలు మూసివేశామని చెప్పండి

- విద్యారంగంలో ఏపీని 14వ స్థానం నుంచి 3వ స్థానంలోకి తెచ్చాం
- కాదని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తా
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి సంఖ్య పెరిగింది
- 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను తీసుకొస్తున్నాం
- హైస్కూల్స్ అన్నింటినీ సీబీఎస్ఈ స్కూళ్లుగా మారుస్తున్నాం
- ప్రశ్నోత్తరాల సమయంలో జరిగిన చర్చలో మంత్రి బొత్స


సాక్షి, అమరావతి: 'ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ప్రభుత్వ పాఠశాలను కూడా మూయలేదు. పైగా టీడీపీ హయాంలో మూతపడిన 5 వేల స్కూళ్లలో 3 వేలు తిరిగి ప్రారంభించాం. రాష్ట్రంలో ఒక్క పాఠశాలనైనా మూసివేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం' అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. 'విద్యా రంగంలో 14వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని మూడో స్థానానికి తీసుకొచ్చాం. మీరు ఆరోపిస్తున్నట్టుగా 27వ స్థానంలో ఉందని నిరూపిస్తే ఇదే సభలో నా మంత్రి పదవికి రాజీనామా చేస్తా' అని సవాల్ విసిరారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ సభ్యులు వీరాంజనేయులు, సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ.. 'సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతి 15 రోజులకోసారి విద్యా రంగంపై సమీక్ష చేసిన సీఎంను నేను ఎప్పుడూ చూడలేదు. విద్యా రంగం అభివృద్ధి పట్ల ఆయనకున్న తపనకు ఇది నిదర్శనం. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఎన్‌రోల్‌మెంట్ రేషియో 102 శాతం నమోదవుతోంది. 2018–19లో స్కూళ్లలో 70.43 లక్షల మంది పిల్లలుండగా, వారిలో ప్రభుత్వ పాఠశాలల్లో 37 లక్షల మంది, ఎయిడెడ్ సంస్థల్లో 2.08 లక్షల మంది, ప్రైవేటు పాఠశాలల్లో 31.14 లక్షల మంది ఉన్నారు. అదే 2022–23లో 70.18 లక్షల మంది పాఠశాలలకు వెళ్తుంటే, వారిలో ప్రభుత్వ స్కూళ్లలో 39.70 లక్షల మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 1.09 లక్షల మంది, ప్రైవేటులో 29.39 లక్షల మంది చదువుతున్నారు. అంటే ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగినట్టా? తగ్గినట్టా? మీరే చెప్పాలి. 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను తీసుకొస్తున్నాం. 5,419 పోస్టులు అప్‌గ్రేడ్ చేశాం. ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం. విద్యార్థులకు 5 లక్షల ట్యాబ్‌లు ఉచితంగా ఇచ్చాం. హైస్కూళ్లు అన్నింటినీ సీబీఎస్ఈ స్కూల్స్‌గా మారుస్తున్నాం. మీ పిల్లలు కాన్వెంట్‌కు వెళ్లి చదువుకోవాలి. పేదవాడి పిల్లలకు మాత్రం సబ్జెక్టు టీచర్లు అక్కర్లేదనడం సరికాదు. మీ నియోజకవర్గాల్లో ఏ ఊళ్లో అయినా ఒక్క ప్రభుత్వ పాఠశాలయినా మూసేశారేమో చెప్పండి చూద్దాం' అని మంత్రి బొత్స సవాల్ విసిరారు. దీనికి టీడీపీ సభ్యులు మారు మాట్లాడలేక మిన్నకుండిపోయారు.

సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత మీకు లేదు : మంత్రి అంబటి రాంబాబు



'సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక అర్హత వైఎస్ వారసుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తప్ప టీడీపీ నేతలకు లేదు. టీడీపీ వారు ఎస్టిమేట్లు పెంచి ఇష్టానుసారం దోచుకున్నారు. జలయజ్ఞం కింద వైఎస్ తలపెట్టిన ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తాం' అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సభలో టీడీపీ సభ్యుడు అచ్చెన్నాయుడు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. 'బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు రెండో దశ ఫేజ్ 2లో 90 శాతం, సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు 83 శాతం, గజపతినగరం బ్రాంచ్ కెనాల్ 43 శాతం, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ 38 శాతం, వంశధార–నాగావళి నదుల అనుసంధానం 70 శాతం, తారకరామ తీర్థ సాగర్ రిజర్వాయర్ 41 శాతం, గొర్రెల శ్రీరాములనాయుడు మడ్డువలస రిజర్వాయర్ రెండో దశ 79 శాతం, వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు జంఝావతి రిజర్వాయర్ 76 శాతం పూర్తి చేశాం. హిరమండలం రిజర్వాయర్ గొట్టా బ్యారేజ్ కుడి ప్రధాన కాల్వకు ఎత్తిపోతల పథకాన్ని కొత్తగా ప్రారంభించాం. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. ఈ ప్రాజెక్టుల కోసం 2019 నుంచి ఇప్పటివరకు రూ.543.25 కోట్లు ఖర్చు చేశాం. వీటిని డిసెంబర్ 2023 కల్లా పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం' అని మంత్రి అంబటి వివరించారు.

ఉద్యమంలా ప్రకృతి వ్యవసాయం : మంత్రి కాకాణి



రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా తీసుకెళ్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. అసెంబ్లీలో సభ్యులు చింతల రామచంద్రారెడ్డి, అబ్బయ్య చౌదరి లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. 'తక్కువ పెట్టుబడితో నేలలను పునరుజ్జీవింపజేస్తూ నీటి సంరక్షణ, జీవ వైవిధ్యానికి దోహదపడేలా ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్రంలో 8 లక్షల మంది ప్రకృతి సాగు చేస్తున్నారు. రైతులకు ఇన్‌పుట్స్, ఉపకరణాలు ఆర్బీకే స్థాయిలోనే ఇస్తున్నాం. టీటీడీకి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.175 కోట్ల విలువైన 12 రకాల ప్రకృతి ఉత్పత్తులను సరఫరా చేస్తున్నాం. మహిళా సంఘాల ద్వారా మార్కెటింగ్ చేస్తున్నాం. ప్రకృతి ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం. 25 వేల మందికి సర్టిఫికేషన్ ఇస్తున్నాం, పంటల మార్పిడి ద్వారా 2019 నుంచి ఇప్పటివరకు 2.85 లక్షల ఎకరాల్లో వరికి ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటలను సాగులోకి తీసుకొచ్చాం. 2022–23 రబీలో బోర్ల కింద 37,500 ఎకరాలు పంట మార్పిడి చేశాం' అని మంత్రి కాకాణి చెప్పారు.

వైద్య శాఖలో నియామకాలకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. అచ్చంగా వైద్య శాఖలో నియామకాల కోసమే ప్రభుత్వం 'ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు'ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల అందుబాటుపై తొలి నుంచి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదన్న లక్ష్యంతో 2019 నుంచి ఇప్పటి వరకూ 48,639 పోస్టులను భర్తీ చేశారు. మరోవైపు శాఖలో ఏర్పడే ఎప్పటి ఖాళీలను అప్పుడే భర్తీ చేసేలా అనుమతులిచ్చారు. ఇదే క్రమంలో రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయడం గమనార్హం.

ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా..

రిక్రూట్‌మెంట్ బోర్డుకు వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మెంబర్ సెక్రటరీగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, మరో మెంబర్‌గా జాయింట్ డైరెక్టర్ ఉంటారు. మరికొంత మంది సపోర్టింగ్ సిబ్బంది ఉంటారు. బోర్డు ఏర్పాటు నేపథ్యంలో 17 పోస్టులను కొత్తగా సృష్టించారు. ఇకపై వైద్య శాఖలో ఏపీపీఎస్సీ ద్వారా నియమించే పోస్టులను మినహాయించి.. మిగిలిన అన్ని రాష్ట్ర, జోనల్, జిల్లా పోస్టుల భర్తీ ప్రక్రియను రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా చేపట్టనున్నారు. తద్వారా నియామక ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని కుదించనున్నారు.

తెలంగాణ

నేడు మళ్లీ ఈడీ ముందుకు కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు మరోసారి విచారించనున్నారు. ఈ నెల 11న సుమారు 9 గంటల పాటు కవితను ప్రశ్నించిన ఈడీ.. 16వ తేదీన మళ్లీ హాజరుకావాలని నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఉదయం 11 గంటలకు కవిత ఈడీ కార్యాలయానికి వెళ్లనున్నారు. లిక్కర్ పాలసీ రూపకల్పన, సౌత్‌గ్రూపు పాత్ర, ఆప్ నేతలకు ముడుపులు తదితర అంశాలపై ప్రశ్నించడంతోపాటు బుచ్చిబాబు, అరుణ్‌పిళ్లైలతో కలిపి విచారించాలని ఈడీ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

అరుణ్ పిళ్లైతో కలిపి బుచ్చిబాబు విచారణ

ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ అధికారులు బుధవారం విచారించారు. ఆయనను ఒంటరిగా, అరుణ్ పిళ్లైతో కలిపి ప్రశ్నించినట్లు తెలిసింది. కేసులో ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరినీ విచారించారని.. సాక్ష్యాల ధ్వంసం, మద్యం విధానం రూపకల్పన, హోటళ్లలో సమావేశాలు తదితర అంశాలపై లోతుగా ప్రశ్నించారని సమాచారం.

సుప్రీంకోర్టులో కవిత పిటిషన్

ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో తనపై తీవ్ర చర్యలు తీసుకోవద్దని ఈడీని ఆదేశించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈడీ విచారణ పారదర్శకతపై అనుమానాలు వస్తున్నాయని.. నిందితులు/సాక్షులపై థర్డ్ డిగ్రీ చర్యలకు పాల్పడుతున్న పరిస్థితి కనిపిస్తోందని పేర్కొన్నారు. అధికారులు చట్ట విరుద్ధంగా తన ఫోన్‌ను సీజ్ చేశారని కోర్టుకు తెలిపారు. కేంద్రంలోని అధికార పార్టీ కుట్రతో కావాలనే ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. అందువల్ల ఈ నెల 11 నాటి విచారణకు సంబంధించిన తదుపరి చర్యలపై, 16న జరగాల్సిన విచారణపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది వందన సెహగల్ బుధవారం కవిత తరఫున అభ్యర్థనలను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనానికి విన్నవించారు. ఈ తరహా కేసుల్లో గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులను పిటిషన్‌లో ప్రస్తావించారు.

అత్యవసర విచారణకు నో

ఈడీ దర్యాప్తుపై స్టే ఇవ్వాలంటూ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని కవిత తరఫు న్యాయవాది సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు బుధవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. కానీ అత్యవసర విచారణకు నిరాకరించిన సీజేఐ.. ఈ నెల 24న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

రాజస్తాన్‌లోనూ ఏపీ తరహా రైతు సేవలు

అమలుకు కృషి చేస్తామన్న రాజస్తాన్ ఉన్నతాధికారులు


సాక్షి, అమరావతి: ఏపీలో రైతులకు అందిస్తున్న సేవలు అద్భుతమని.. తమ రాష్ట్రంలో కూడా వాటి అమలుకు కృషి చేస్తామని రాజస్తాన్ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చెప్పారు. గతేడాది జూలైలో ఏపీలో పర్యటించిన రాజస్తాన్ వ్యవసాయ శాఖ మంత్రి లాల్‌చంద్ కటారియా ఆర్బీకే ద్వారా అందిస్తోన్న సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ తరహా సేవలను తమ రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు.. త్వరలోనే ఉన్నతాధికారుల బృందాన్ని పంపిస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర సీడ్ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ కేసీ మీనా నేతృత్వంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు అజయ్‌కుమార్ పచోరి, రాకేశ్ కుమార్ అతల్, దన్వీర్ వర్మ, తారాచంద్ బోచాలియా ఏపీకి వచ్చారు. బుధవారం గన్నవరంలోని ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్, ఆర్బీకే చానల్‌ను సందర్శించి.. వాటి పనితీరును అధ్యయనం చేశారు. రాజస్తాన్‌లోని కాల్ సెంటర్‌ను కూడా ఏపీలో మాదిరిగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్బీకే చానల్ నిర్వహణ, రైతు భరోసా మ్యాగజైన్, ఈ క్రాప్ నమోదు చాలా వినూత్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. మరో 2 రోజుల పాటు ఆర్బీకే, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్, ఇతర సేవలను అధ్యయనం చేసి.. తమ రాష్ట్రంలో కూడా ఈ తరహా సేవల అమలు కోసం నివేదిక అందజేస్తామన్నారు.

ఆటోలోనే ఇంటర్ పరీక్ష

పెద్దపంజాణి(చిత్తూరు జిల్లా): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ విద్యార్థికి ఆటోలోనే పరీక్ష రాసేలా అధికారులు సహకరించారు. మండలంలోని శ్రీరామాపురం పరీక్ష కేంద్రం వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. పలమనేరు మండలం జల్లిపేట గ్రామానికి చెందిన రామకృష్ణయ్యగారి రవిచంద్ర కుమారుడు రవిచంద్ర రాహుల్ పలమనేరు పట్టణంలోని మధు విద్యానికేతన్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ సీఈసీ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రంగా గాయం కావడంతో రాడ్లు అమర్చారు. కాలు కింద పెట్టి నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలోనే పరీక్షలు రాయాల్సి రావడంతో కుటుంబ సభ్యుల సహకారంతో ఆటోలో పరీక్ష కేంద్రానికి చేరుకున్నాడు. విద్యార్థి సంకల్పాన్ని, దీనస్థితిని గుర్తించిన పరీక్ష కేంద్రం అధికారులు ఆటోలోనే పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నారు. సిబ్బంది పర్యవేక్షణలో రవిచంద్ర పరీక్ష రాశాడు.

పాదరక్షల్లో పసిడి స్మగ్లింగ్

1.2 కేజీలు సీజ్ చేసిన కస్టమ్స్ అధికారులు



చెప్పుల్లో దాచి తరలిస్తున్న బంగారం

దొడ్డబళ్లాపురం: పాదరక్షల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న 1.2 కేజీల బంగారాన్ని బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ నెల 12వ తేదీన ఇండిగో విమానంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన ఒక ప్రయాణికునిపై అనుమానం రావడంతో తనిఖీ చేశారు. అతడు వేసుకున్న చెప్పుల్లో బంగారాన్ని దాచి తరలిస్తున్నట్లు బయటపడింది. రూ.65,03,656 విలువైన 1,205 గ్రాముల 24 క్యారెట్ల బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

హైవే పనులు రయ్.. రయ్

త్వరలో నెరవేరనున్న మెట్టప్రాంత వాసుల కల

- శరవేగంగా జరుగుతున్న జాతీయ రహదారి పనులు
- వింజమూరు – దుత్తలూరు మార్గంలో 70 శాతం మేర పూర్తి
- నెల్లూరు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల ప్రజలకు ఉపయోగం

తొలిదశలో..

ఎక్కడి నుంచి ఎక్కడి వరకు:
కావలి - దుత్తలూరు
విడుదల చేసిన నిధులు: రూ.400 కోట్లు

కావలి - సీతారామపురం జాతీయ రహదారి. ఇది కావలి, ఉదయగిరి నియోజకవర్గాలను కలుపుతూ రాయలసీమ జిల్లాలను అనుసంధానం చేస్తుంది. ఈ రోడ్డు నిర్మాణం దశాబ్దాలుగా మెట్ట ప్రాంతవాసుల కల. గత పాలకులు దీనిని పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తయితే మూడు జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు పూర్తిగా మారనున్నాయి.



వింజమూరు - దుత్తలూరు మార్గంలో కొంతమేర పూర్తయిన రోడ్డు పనులు

ఉదయగిరి: కావలి – సీతారామపురం జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. మొదటిదశలో కావలి నుంచి దుత్తలూరు వరకు 64.9 కి.మీ రోడ్డును అభివృద్ధి చేసే పనులు చకచకా చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే వింజమూరు – దుత్తలూరు మార్గంలో 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. కావలి నుంచి దుత్తలూరు వరకు కల్వర్టులు, వంతెనలు కొన్ని పూర్తికాగా మరికొన్నిటిని త్వరితగతిన నిర్మించేందుకు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. 2024 సంవత్సరం జూన్ కల్లా మొదటిదశ పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తూ పురోగతిపై పూర్తిస్థాయి దృష్టిపెట్టారు.

మెట్టలో పెరగనున్న సౌకర్యాలు

104.4 కి.మీ పొడవున్న కావలి – సీతారామపురం రోడ్డు మార్గంలో నిత్యం ఐదు వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని అంచనా. జాతీయ రహదారి పనులు పూర్తయితే కావలి పట్టణంతోపాటు ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో ఈ మార్గంలో ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ఈ రోడ్డును 14 మీటర్ల వెడల్పుతో విస్తరిస్తున్నారు. పది మీటర్ల తారురోడ్డుతోపాటు రెండు వైపులా నాలుగు మీటర్లు అదనంగా రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు.

మూడు జిల్లాలకు ఉపయోగపడేలా..

రామాయపట్నం పోర్టు పనులు పూర్తయిన తర్వాత వాహనాల రాకపోకలు పెరిగే అవకాశముంది. దీనిని దృష్టిలో పెట్టుకుని నెల్లూరు, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లాల మధ్య అంతర్గత మార్గాలను కలిపే విధంగా తొలిదశలో కావలి – దుత్తలూరు రోడ్డును విస్తరిస్తున్నారు. దీని వల్ల పోర్టు నుంచి వచ్చే సరుకులను కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలోని నకిరేకల్, చిత్తూరు జిల్లా, కడప జిల్లాలోని బద్వేల్, ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సులువుగా తక్కువ వ్యయంతో రవాణా చేయొచ్చు.

ఫలించిన మేకపాటి కృషి

ఈ రహదారిని విస్తరించాలని గతంలోనే ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఆయన అకాల మరణంతో ఈ ప్రతిపాదన ఆగిపోయింది. ఆ తర్వాత అధికారంలోకొచ్చిన టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి రోడ్డు విస్తరణ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఈ మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా అనుమతులు లభించాయి. అంతేకాకుండా ఈ మార్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. దీంతో మెట్టప్రాంత వాసుల కల త్వరలో ఫలించబోతోంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943